అక్టోబర్
2020

174

సంపుటి : 15 సంచిక : 5 వెల రు. 10/-

## ఈ సంచికలో........

ప్రపంచీకరణ-ప్రజాస్వామ్యం
కార్మిక సంఘాల్లో పార్టీ పని
రైతాంగ వ్యతిరేక చట్టాలతో బద్దలవుతున్న అసంతృప్తి
ప్రజారోగ్యం కోసం పోరాటం అనివార్యం
మోడీకి దాసోహమైన డిజిటల్ మీడియా
ఫేస్‌బుక్ -జియో డీల్ : ఇంటర్నెట్‌పై కార్పొరేట్ ఆధిపత్యం
ఉపాధికి ఏదీ హామీ?
నూతన విద్యావిధానం: సమస్య, పరిష్కారం
విద్యుత్‌రంగ ప్రైవేటీకరణే నగదు బదిలి లక్ష్యం
చిరస్మరణీయ తెలంగాణా సాయుధ ప్రజా పోరాటం

**భారత కమ్యూనిస్టు పార్టీ శతవార్షికోత్సవ వ్యాసావళి**

# చిరస్మరణీయ తెలంగాణా సాయుధ ప్రజా పోరాటం

మన దేశ స్వాతంత్రోద్యమంలో, కమ్యూనిష్టు ఉద్యమంలో చిరస్మరణీయ మైనది తెలంగాణా సాయుధ ప్రజా పోరాటం. హైదరాబాద్ సంస్థానంగా పిలవబడే నిజాం పాలనలో భూస్వాముల దారుణమైన దోపిడీకి వ్యతిరేకంగా 1946లో ప్రజా పోరాటం మొదలయి 1951 వరకు కొనసాగింది. తెలంగాణ పోరాటాన్ని మూడు ప్రముఖమైన దశలుగా విడదీయ వచ్చు– మొదటిదశ, వెట్టి చాకిరికి, భూముల నుండి వెళ్లగొట్టడానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం, రెండోదశ, నిజాంపాలనకు ఉద్వాసన పలకడం, గ్రామీణ స్వయం పాలన అమలుచేయడం, దున్నేవాడికే భూమిని పంచడం, మూడోదశ, పోరాటాల ద్వారా పొందిన ప్రయోజనాలను కాపాడు కుంటూ పోరాటాన్ని విరమించుకోవడం.

హైదరాబాద్ సంస్థానంలో మూడు భాషలు మాట్లాడేవారుండేవారు. తెలంగాణ ప్రాంతంలో తెలుగు మాట్లాడేవారు ఎనిమిది జిల్లాలలో ఉండేవారు (సగానికి సగం ప్రాంతం) మారట్వాడా ప్రాంతంలో మరాఠీ మాట్లాడేవారు(28 శాతం) మూడు జిల్లాలలో కన్నడం మాట్లాడేవారు ఉండేవారు (22 శాతం). ఈ ప్రాంత ప్రజల భాష, సంస్కృతీ తీవ్రమైన అణచివేతకు గురయాయి. సహజంగానే చదువుకోవాలనే తపన, సాంస్కృతికంగా అభివృద్ధి చెందాలన్న ఆశ, తమ మాతృ భాషలను అభివద్ధి చేసుకోవాలన్న కాంక్ష నిజం పాలనలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంతో మిళితమై ఉంది. తెలంగాణ ప్రాంత సామాజిక ఆర్థిక జీవితాలలో ప్రధాన మైనది అంతులేని దోపిడీ. ఆ ప్రాంతంలోని 60 శాతం భూమి ప్రభుత్వానిది కాగా 10 శాతం భూమి నిజాం స్వంత ఎస్టేట్. మొత్తం రాష్ట్రంలో 30 శాతం నిజాం జాగీరుదారుల అధీనంలో ఉండేది. ఈ జాగీర్దారులు భూస్వామ్య దోపిడీదారులు. వారు ప్రభుత్వ భూమిపై వసూలు చేయబడే పన్నులకంటే పదిరెట్లు ఎక్కువ వసూలు చేసేవారు. బలవంతపు చాకిరీ చేయించుకునే వారు. ప్రజలనుమరెన్నో రకాలుగా దోచుకునే వారు. కొంతమంది జాగీర్దారులకు సొంత పోలీసు, రెవెన్యూ, సివిల్, క్రిమినల్ వ్యవస్థలు ఉండేవి. జాగీర్దారులే కాక దేశముఖులు, దేశ్‌పాండేలు ఉండేవారు. వీరొకప్పుడు ప్రభుత్వ భూముల పన్నులు వసూలు చేసేవారు. ఆ క్రమంలో వేలాది సాగు భూములను అక్రమంగా ఆక్రమించుకున్నారు. ఈ భూములను సాగు చేసుకునే రైతుల జీవితాలు దేశముఖులు, దేశ్‌పాండేల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేవి. ఆర్థిక సంక్షోభాల కాలాలలో పన్నులు కట్టలేకపోతే రైతుల స్వంత భూములను స్వాధీనం చేసుకునేవారు.

**వెట్టి చాకిరీ వ్యవస్థ**

తెలంగాణలో వెట్టి చాకిరి సర్వే సర్వత్రా అమలవుతుండేది. ప్రతి దళిత కుటుంబం తమ కుటుంబం నుండి ఒకరిని వెట్టికి పంపించవలసిందే. భూస్వామి ఇంట పని చేయడం వారి బాధ్యత, వారికి ఇతర ప్రాంతాల వార్తలు చేరవేయాలి. చెప్పులుకుట్టేవారు చెప్పులను, వ్యవసాయ పరికరాలకు అవసరమైన తోలు ఉపకరణాలను భూస్వాములకు ఉచితంగా అందించవలసిందే. కల్లుగీసేవారు ఉచితంగా సరఫరా చేయాలి. నేతగాళ్లు బట్టలను, వడ్రంగులు, కమ్మర్లు వ్యవసాయ పరికరాలు, కుమ్మర్లు కుండలు ఉచితంగా అందించాలి, చాకళ్ళు బట్టలు ఉతికి పెట్టాలి. మంగళ్ళు రోజువారీ వారిళ్లలో సేవలు చేయాలి, రాత్రులు అయ్యగార్ల కాళ్ళు ఒత్తాలి, ఒళ్ళు పట్టాలి. భూస్వాముల ఇళ్లలోని పురుషులు, స్త్రీలు ఒక ఊరి నుండి ఇంకొక ఊరికి వెళ్ళడానికి వెనుకబడిన కులాలవారు పల్లకీలు మోయాలి.

రైతులకు కూడా ఈ వెట్టి నుండి మినహాయింపు లేదు. భూస్వాముల పొలాలు దున్నిన తరువాతే తమ పొలాలు దున్నుకోవాలి.



అలా దున్నినందుకు చిల్లిగవ్వ ఇచ్చేవారు కాదు. ఇవేకాక అనేకరకాల ఇతర దోపిడీలు అమలవుతుండేవి. కేవలం భూస్వాములే కాదు, ప్రభుత్వాధికారులందరు ఇటువంటి దోపిడీలకు పాల్పడేవారు. అన్నిటికన్నా నీచమైనది ఈ భూస్వాములు అమ్మాయిలను 'బానిసలుగా' పెట్టుకోవడం. భూస్వాముల ఇళ్లల్లోని ఆడపిల్ల లకు పెళ్లయి అత్తవారింటికి వెళుతుంటే వారితోపాటే పనిపిల్లలను కూడా పంపేవారు. ఈ పనిపిల్లలు కొత్తచోట్లకు పెళ్లికూతురితోపాటు పోవలసివచ్చేది. ఈ బానిసలను భూస్వాములు ఉంపుడుగత్తెలుగా ఉంచుకునే వారు. వెట్టి వ్యవస్థ తెలంగాణ ప్రజల జీవితాలను అత్యంత హీనస్థాయికి దిగజార్చింది. వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసింది. 1940లలో ఈ విషయం పైనే ప్రజలు భూస్వాములపై తిరగబడడానికి సిద్ధపడ్డారు. అప్పటికి కమ్యూనిస్టు పార్టీ ఒక సంఘటిత శక్తిగా రూపుదిద్దుకుంది. అణగారిన కౌలుదారుల, గ్రామీణ పేదల పోరాట స్ఫూర్తితో మమేకం అవగలిగింది.

నిజాం నిరంకుశ పాలన సాగించేవాడు. అక్కడ ఏ స్థాయిలోనూ ఎన్నికయిన సంస్థలు లేవు. పౌరస్వేచ్ఛ అసలే లేదు. అటువంటి

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. చిరస్మరణీయ తెలంగాణా సాయుధ ప్రజా పోరాటం ........................ 2
2. ప్రపంచీకరణ-ప్రజాస్వామ్యం
   ప్రభాత్ పట్నాయక్ ....... 4
3. కార్మిక సంఘాల్లో పార్టీ పని ......... 11
4. రైతాంగ వ్యతిరేక చట్టాలతో బద్దలవుతున్న అసంతృప్తి
   పి సాయినాథ్........... 14
5. ప్రజారోగ్యం కోసం పోరాటం అనివార్యం
   జెఎస్ మజుందార్ ...... 20
6. మోడీకి దాసోహమైన డిజిటల్ మీడియా................ 25
7. ఫేస్‌బుక్ జియో డీల్ : ఇంటర్నెట్‌పై కార్పొరేట్ ఆధిపత్యం
   రఫీ అహ్మద్ ............ 28
8. ఉపాధికి ఏదీ హామీ?
   ఎ కోటిరెడ్డి.................. 30
9. నూతన విద్యావిధానం: సమస్య, పరిష్కారం
   యువరాజ్ సింగ్........... 32
10. విద్యుత్‌రంగ ప్రైవేటీకరణే నగదు బదిలి లక్ష్యం
   బివి రాఘవులు ........ 34



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్:కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# దాడులు - ప్రతిఘటన

పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభాలు అనివార్యం, అలలమాదిరిగా అప్పుడప్పుడు వచ్చే సంక్షోభాలు క్రమంగా తుపానులుగా మారుతాయని కారల్ మార్క్స్ చెప్పాడు. "పెట్టుబడిదారీ ఉత్పత్తిలో మంచి చెడులతో సంబంధం లేకుండా కొన్ని పరిస్థితులు ఏర్పడతాయి, ఆ పరిస్థితుల్లో కార్మికవర్గం సాపేక్షంగా సంపద్వంతమవుతుంది, కానీ అది చాలా తాత్కాలికమే, వెనువెంటేనే వచ్చే సంక్షోభానికి అది సూచిక మాత్రమే" అని ఆయన పేర్కొన్నాడు. ప్రపంచ వెట్టుబడిదారీ వ్యవస్థలో ఆ తాత్కాలిక సమయం గడిచిపోయింది, సంక్షోభపు పెనుతుపాను ప్రారంభమైందని ప్రపంచ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలన్నీ చెబుతున్నాయి. అయితే పాలక వర్గాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ గరిష్ట లాభాలను వదులుకోడానికి సిద్ధపడవు. సంక్షోభ భారాలను శ్రామిక ప్రజల మీదకు నెట్టేసి తమ గరిష్ట లాభాలను కాపాడుకోడానికి సంక్షోభ కాలంలో మరింత ఎక్కువగా ప్రయత్నిస్తాయి. ప్రపంచ వ్యాపితంగా నేడు జరుగుతున్నదదే. భారత దేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వ హయాంలో అది మరింత నగ్నంగా సాగుతోంది.

మోడీ ప్రభుత్వం రెండోసారి పూర్తి మెజారిటీతో అధికాంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నర కాలంలో, ముఖ్యంగా కరోనా వైరస్ పరిస్థితులను ఉపయోగించుకుని చేసిన చట్టాలు, తీసుకున్న చర్యలు పరిశీలిస్తే ఈ ప్రభుత్వం పాలకవర్గాల కొమ్ముకాస్తూ శ్రామిక ప్రజలపై ఎటువంటి దాడులకు పూనుకుందో అర్ధమవుతుంది. సాధారణ ఉత్పత్తి కార్యకలాపాల ద్వారా పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి చెందే అవకాశాలు లేవు గనుక ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలతో కార్పొరేట్‌లకు దేశ వనరులను, ప్రభుత్వ రంగాన్ని వివిధ రూపాల్లో దోచిపెడుతోంది. అందుకే కరోనాతో దేశ ప్రజలంతా ఆర్థికంగా కుదేలవుతున్నా అంబానీ, ఆదానీల సంపద మాత్రం గరిష్టంగా పెరుగుతోంది. మరోవైపు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కార్మికుల హక్కులను రక్షించే చట్టాలను రద్దు చేశారు. రైతాంగాన్ని కార్పొరేట్ దోపిడీకి గురిచేసే మూడు చట్టాలను నిరంకుశంగా గత పార్లమెంటు సమావేశాల్లో ఆమోదింపజేసుకున్నారు. విద్యారంగంలో కార్పొరేట్ పెట్టుబడుల దోపిడీకి అనుకూలంగా విద్యావిధానాన్ని మార్చేశారు. అడవులను కార్పొరేట్‌లకు దారాదత్తం చేసేందుకు గిరిజన హక్కులు హరిస్తూ అటవీ చట్టాలను, వాతావరణ చట్టాలను మార్చేశారు. దళితులు, ఆదివాసీలు, బలహీనవర్గాల రిజర్వేషన్లకు ఎసరు పెడుతూ చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం మీద చూసినప్పుడు సంక్షోభం ప్రజలకేగాని, పాలకులకు కాదన్న రీతిలో అన్ని వర్గాల ప్రజలపైనా దాడులు చేస్తున్నారు.

ఇంకోవైపు నుండి చూసినప్పుడు, ప్రభుత్వం నుండి ఏక కాలంలో తీవ్రతరమైన ఈ దాడులు దేశంలోని కార్మిక, రైతాంగ ఇతర శ్రామిక వర్గాలన్నీ ఏకమై ఎదిరించాల్సిన అనివార్య పరిస్థిలను కూడా కల్పిస్తున్నాయి. రైతాంగ వ్యతిరేక చట్టాలకు నిరసనగా దేశంలో ముఖ్యంగా పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో ఆందోళనలు కొనసాగుతుండగానే మరోవైపు తమహక్కులు హరించే చట్టాలకు, చర్యలకు వ్యవతిరేంగా కార్మికవర్గం సార్వత్రిక సమ్మెకు పూనుకున్నది. నవంబర్ 26న దేశవ్యాపిత సమ్మెచేయనున్నట్లు పది కార్మిక సంఘాలు సంయుక్తంగా పిలుపునివ్వడం, వారి డిమాండ్లలో కార్మిక, కర్షక ఇతర శ్రామిక ప్రజలందరి సమస్యలు చేర్చడం...సమైక్య ప్రతిఘటనకు సంకేతం. కార్మికవర్గ నాయకత్వంలో ఈ ప్రతిఘటన ఎంతగా విస్తరిస్తే, ఎంతగా బలపడితే, ఎంత సమైక్యంగా నడిస్తే శ్రామిక ప్రజల హక్కులు అంతగా కాపాడబడతాయి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**


పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# ప్రపంచీకరణ ప్రజాస్వామ్యం

**ప్రభాత్ పట్నాయక్**



రచయిత ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంత వేత్త

ప్రపంచీకరణలో అనేక పార్శ్వాలు ఉన్నాయి. ఆర్థికాంశాలైన ద్రవ్య పెట్టుబడులతో పాటు పెట్టుబడులు, సరుకులు దేశాల సరిహద్దులు దాటి స్వేచ్ఛగా ప్రవహించటం గురించి నేను ప్రధానంగా చర్చిస్తాను. ఈ వ్యాసం హెడ్డింగ్‌లో స్వేచ్ఛను గురించి పేర్కొన్న విధంగానే వాటి అనుభవాలు, కార్యకలాపాల ఆధారంగా ఒకరి భౌతిక జీవిత ప్రమాణాలను మెరుగుచేయటానికి ఉన్న ఆటంకాలను గురించి నేను చర్చిస్తాను. ప్రభుత్వాలు విధిస్తున్న ఆంక్షల వలన అటువంటి ఆటంకాలు కలుగుతుం టాయని భావిస్తుంటారు. కాని సామాజిక సంస్థలు, మనం జీవిస్తున్న పరిస్థితులు కూడా అటువంటి ఆటంకాలకు కారణమౌతాయి. మార్క్స్ చెప్పినట్లుగా నిరుద్యోగ సైన్యం యొక్క పరిమాణం పెరగటం కార్మికులు ఎక్కువ వేతనాల కోసం చేసే పోరాటాలను నిర్వీర్యం చేసి, వారి స్వేచ్ఛకు పరిమితులను విధిస్తుంది. అదేవిధంగా రాజ్యం పనిచేయటంపై విధిస్తున్న పరిమితుల వలన కూడా అటువంటి ఆంక్షలు వస్తాయి. అందువలన ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ప్రజల కోసం పనిచేస్తున్న సంస్థలపై కూడా రాజకీయపరంగా కూడా ఆంక్షలు విధిస్తారు. కార్మికుల భౌతిక జీవన పరిస్థితులు దిగజారటం రూపంలో స్వాతంత్ర్యాన్ని కుదించటం వ్యక్తం అవుతుంది. కాని ఆ విధంగా పరిస్థితులు దిగజారిపోవటం స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కోల్పోవటం కాదు. స్వేచ్ఛపై ప్రపంచీకరణ ప్రభావాన్ని ఈ అర్థంలో నేను చర్చిస్తాను. ప్రపంచీకరణ, స్వేచ్ఛకు పరిమితులు విధించటం, సాపేక్షంగా ద్రవ్య పెట్టుబడులతో పాటు పెట్టుబడులు సరిహద్దులు దాటి స్వేచ్ఛగా సంచరించటం వలన ఏర్పడే పరిణామాలు దిగువ విధంగా ఉంటాయి. మనం జాతి రాజ్యాలలో నివసించటం వలన తాము సరైనవని భావిస్తున్న వాటికి భిన్నంగా ఏ ఒక్క దేశమైనా పెట్టుబడుల ప్రవాహాలపై ఆంక్షలు విధిస్తే ద్రవ్య పెట్టుబడులు మూకుమ్మడిగా ఆ దేశాన్ని వదలి వెళతాయి. ఫలితంగా ఆ దేశం ద్రవ్య సంక్షోభంలో చిక్కుకుంటుంది. అందువలన ద్రవ్య పెట్టుబడులకు అనుకూలమైన, జాతి రాజ్యాలు నిరంతరం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకొనే విధంగా, ప్రపంచవ్యాపితంగా సంచరిస్తున్న ద్రవ్య పెట్టుబడులు సరైనవని భావిస్తున్న విధానాలను అనుసరించాలి.

ఈ విధానాలు వాటికవే ప్రజల స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తాయి. ప్రజాస్వామ్యం ప్రజలు తమకిష్టమైన ప్రభుత్వాన్ని ఎన్నుకొనే స్వేచ్ఛను కల్పిస్తుంది. ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజలు ఎక్కువగా ఆమోదించే విధానాలను అనుసరించటానికి పోటీపడుతుంటాయి. రాజకీయ పార్టీలు వివిధ రకాల విధానాలతో ఎన్నికలలో ప్రజల మద్దతు పొందటానికి ప్రయత్నం చేస్తాయి. కాని వారు అధికారానికి వచ్చిన తర్వాత పెట్టుబడులు దేశం నుండి పోతే వినాయకరమైన పరిణామాలు ఎదురౌతాయనే భయంతో అన్ని రాజకీయ పార్టీలు ఒకే విధమైన, ద్రవ్య పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను మాత్రమే అనుసరిస్తే లేదా ఎన్నికలకు ముందు ప్రచారం చేసిన విధానాలను వదిలివేసి, అంతకు ముందు అధికారంలో ఉన్నవారు అనుసరించిన విధానాలనే అనుసరిస్తే–గ్రీస్‌లో సిరిజా చేసిన విధంగా– అపుడు తమకిష్టమైన విధానాలను అనుసరించే వారిని ఎన్నుకునేందుకు ప్రజలకు ఉన్న స్వేచ్ఛ అర్థం లేనిదవుతుంది.

దీనిని వేరేవిధంగా చూస్తే ప్రజాస్వామ్యం ప్రజలకు సార్వభౌమ హక్కును ఇస్తుంది. కాని ప్రపంచీకరణ ద్రవ్య పెట్టుబడుల ఆధిపత్యాన్ని నెలకొల్పటానికి ప్రయత్నం చేస్తుంది. అది తప్పనిసరిగా ప్రజల ఆధిపత్యాన్ని పక్కన పెట్టటం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను రద్దు చేస్తుంది. ఒకవేళ ప్రజలు తమ సార్వభౌమత్వాన్ని రద్దు చేయటాన్ని అంగీకరించనప్పటికీ ఈ అంశంలో ఏ మాత్రం వ్యత్యాసం ఉండదు. ప్రజాస్వామ్యాన్ని రద్దుచేయటం అనేదానిని ఏ మాత్రం మార్చదు. దవ్య పెట్టుబడుల కోర్కెలకు, ప్రజల ఆకాంక్షలకు ఏ మాత్రం పోలిక ఉండదు. ఉదాహరణకు ఏ మూడవ ప్రపంచదేశంలోనైనా పెద్దమొత్తంలో సంక్షేమ పథకాలపై, ముఖ్యంగా విద్య, వైద్యంపై ఎక్కువ ఖర్చు చేయటం ద్వారా ప్రజల జీవన పరిస్థితతులను మెరుగుపరచటం ముఖ్యమైన అవసరంగా ఉంటుంది. నిజంగా ప్రజల పరిస్థితులను అభివృద్ధి చేసే అటువంటి ఖర్చును ఎవరైతే లబ్దిదారులున్నారో వారిపై విధించే పన్నుల ద్వారా సమీకరించటం కాక, ధనికులపైన పన్నులు వేయటం ద్వారా లేక ద్రవ్యలోటు ద్వారా సమీకరించాలి. కాని ఈ రెండింటిని ద్రవ్య పెట్టుబడి శాపంగా పరిగణిస్తుంది. అతికొద్దిమొత్తం ద్రవ్యలోటును, జిడిపిలో మూడు శాతానికి లోపుగా మాత్రమే అది అంగీకరిస్తుంది. చాలా దేశాలు దీనిని ఆమోదిస్తూ చట్టాలను కూడా చేశాయి. పెట్టుబడిదారులపై ఎక్కువ మొత్తంలో పన్నులు వేస్తే పెట్టుబడిదారులు ఆ దేశం నుండి

పన్నులు తక్కువగా ఉన్న ఇతర దేశాలకు వెళ్ళిపోతారు. అందువలన ఈ ప్రభుత్వాలు విస్తృతంగా ప్రజల మద్దతు పొందే సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయటం లేదు. ఈ మాట చెబుతున్నామంటే ఈ సాకుతో మూడవ ప్రపంచదేశాలలో విద్య, వైద్యం అధ్వాన్నంగా ఉండటంపై వారి బాధ్యతను తప్పించి, ఈ బాధ్యత మొత్తాన్ని ప్రపంచీకరణపై మాత్రమే పెట్టటానికి కాదు. వీటిలో చాలా ప్రభుత్వాలు ప్రజానుకూల విధానాలను పూర్తిగా అమలు చేయటానికి ప్రయత్నం చేయటం లేదు. ఈ విధానాల అమలును ప్రపంచీకరణ అడ్డుకోకుంటే ఈ ప్రభుత్వాలు ఈ విధానాలను త్వరగా అమలుచేస్తాయని కాదు. కాని ప్రపంచీకరణ ఈ విధానాలను దృఢంగా నిరోధిస్తుందన్నది కాదనలేని వాస్తవం. అందువలన మార్పు తీసుకొస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన సోషలిస్టు పార్టీలు కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత యధాతధ పరిస్థితులను కొనసాగించాల్సి వస్తున్నది.

> **"ప్రజాస్వామ్యం ప్రజలకు సార్వభౌమ హక్కును ఇస్తుంది. కాని ప్రపంచీకరణ ద్రవ్య పెట్టుబడుల ఆధిపత్యాన్ని నెలకొల్పటానికి ప్రయత్నం చేస్తుంది. అది తప్పనిసరిగా ప్రజల ఆధిపత్యాన్ని పక్కన పెట్టటం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను రద్దుచేస్తుంది."**



భారత దేశంలో నయా-ఉదారవాద విధానాలు అంబానీలు, ఇతర కార్పొరేట్లవద్ద సంపద, సామాన్య ప్రజల వద్ద దారిద్ర్యం పోగుచేస్తున్నాయి.

ఆదాయం, సంపదల పున:పంపిణీకి తీసుకొనే చర్యలకు సంబంధించి కూడా ఇవే అంశాలను చెప్పుకోవచ్చు. 'పెట్టుబడిదారుల విశ్వాసం' దెబ్బతింటుందనే భయంతో సోషల్ డెమొక్రసికి కట్టుబడిన వారితో పాటు మూడో ప్రపంచదేశాలలోని ఏ రాజకీయ సంఘటన కూడా సంపద, ఆదాయ పున:పంపిణీని తమ విధానాలలో చేర్చటం లేదు. ప్రపంచీకరణ కాలంలో అసమానతలు తీవ్రమైనప్పటికీ ఇదే విధానం కొనసాగుతున్నది. పికెట్టి, ఛాన్సెల్ల అంచనా (2017) ప్రకారం 1982లో భారతదేశంలోని పైస్థాయిలోని ఒక శాతం మంది దేశ ఆదాయంలో 6 శాతాన్ని స్వంతం చేసుకొంటుండగా, 1991లో సరళీకరణ విధానాల అమలు ప్రారంభించిన తర్వాత 2013-14 నాటికి 22 శాతాన్ని స్వంతం చేసుకొంటున్నారు. ఇటువంటి అసమానతలను ఎదుర్కోవటానికి గతంలో అమలుచేసిన రాజకీయంగా జోక్యం చేసుకొనే విధానాలు ఇపుడు ఏ మాత్రం ఉపయోగపడేవిగా ఉండవు. అటువంటి జోక్యం అవసరం లేకపోవటం వలన కాక(దీనికి విరుద్ధంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం కూడా దీని అవసరాన్ని గురించి చెబుతున్నది) ప్రపంచీకరించబడిన ద్రవ్య పెట్టుబడులను జాతీయ ప్రభుత్వాలు ఎదుర్కొనేటపుడు అటువంటి అవకాశాలు పరిమితంగా ఉండటం వలన ఇది సంభవిస్తుంది. కాబట్టి ప్రపంచీకరించబడిన ద్రవ్య పెట్టుబడులను ఎదుర్కొనే సందర్భాలలో జాతీయ ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా ప్రజల స్వేచ్ఛను తగ్గించటమే కాక, వారి జీవన పరిస్థితులను మెరుగుచేసుకొనే అవకాశాలను కూడా హరించివేస్తుంది. మొదటిది, ఎన్నికల సందర్భంలో అర్థవంతమైన ప్రత్యామ్నాయ రాజకీయాలను ఎంచుకొనే అవకాశాలను ప్రజలకు లేకుండా చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని హరించటంతో సమానమౌతుంది. వివిధ రాజకీయ పార్టీలు ప్రజల ముందు పెట్టే విధానాలలో ఆర్థికాంశాలు దాదాపు ఒకే విధంగా ఉంటున్నాయి. ఒకవేళ ఏదైనా పార్టీ ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజల ముందుకు వచ్చి ఎన్నికలలో విజయం సాధించినా, అధికారంలోకి వచ్చిన తర్వాత తమ విధానాలను పక్కన పెట్టి ప్రజలకు ద్రోహం చేస్తున్నాయి.

రెండవది. ప్రపంచీకరించబడిన ద్రవ్య పెట్టుబడుల డిమాండ్లకు అనుగుణంగా వివిధ రాజకీయ పార్టీలు అమలు జరుపుతున్న విధానాలు ఉంటాయి. కాబట్టి అది కేవలం ఎంచుకొనే అవకాశం లేకపోవటం అనేదేకాదు. అది ప్రజల ప్రయోజనాల కన్నా ప్రపంచీకరించబడిన ద్రవ్య పెట్టుబడుల దురాశకు ప్రాధాన్యం ఇవ్వటం అవుతుంది. మూడవది. సంపదను పున:పంపిణి చేయటం, సంక్షేమ చర్యలను రాజకీయ పార్టీల విధానాల నుండి తొలగించటం జరుగుతుంది. నయా ఉదారవాద ప్రపంచీకరణలో ఆదాయం, సంపదల పంపిణిలో పెరుగుతున్న అసమానతలను సరిదిద్దలేకపోవటం ఈ విషయాన్ని మరింత స్పష్టంగా వెల్లడిస్తున్నది.

## 2

నయా-ఉదారవాద ప్రపంచీకరణలో అంతర్గతంగా ముడిపడిన మూడు అంశాల వలన అసమానతలు పెరుగుతున్నాయి. మొదటిది, ప్రపంచీకరణ అన్నిచోట్ల కార్మికుల నిజవేతనాలు ఒకేవిధంగా ఉండేలా చేస్తున్నది. ప్రస్తుత ప్రపంచీకరణలో పెట్టుబడులు ప్రపంచంలో స్వేచ్ఛగా సంచరించటం, కార్మికులు అన్ని దేశాలకు స్వేచ్ఛగా వెళ్ళలేనప్పటికీ, ఆర్థిక కార్యకలాపాలను అధిక వేతనాలున్న అభివృద్ధి చెందిన దేశాల నుండి తక్కువ వేతనాలున్న మూడవ ప్రపంచదేశాలకు తరలిస్తున్నారు. అందువలన మూడవ ప్రపంచదేశాలలో

> **“ మూడవ ప్రపంచదేశాలలో రైతాంగ (చిన్న ఉత్పత్తి దారులు) ఆదాయాలను హరించటం, రైతాంగం పట్టణాలకు వలస పోవటం వలన సాపేక్షంగా పెరుగుతున్న నిరుద్యోగం ఆదాయం, సంపద అసమానతలను పెంచటమే కాక, (పోషకాహార ప్రమాణాల రీత్యా) నిష్ట దరిద్రంలో బతికేవారి సంఖ్యను కూడా పెంచుతుంది. ”**

విస్తారంగా ఉన్న నిరుద్యోగ సైన్యం అభివృద్ధి చెందిన దేశాలోని కార్మికుల వేతనాలు, అన్నిచోట్ల కార్మికుల వేతనాల పెంపుదలకు ఆటంకంగా మారుతున్నది. తమ పరిశ్రమలను తక్కువ వేతనాలున్న మూడవ ప్రపంచదేశాలకు తరలిస్తామని పెట్టుబడిదారులు అభివృద్ధి చెందిన దేశాలలోని కార్మికులను బెదిరించటం వలన వారి వేతనాలు పెరగటం లేదు. మూడవ ప్రపంచదేశాలలో పెద్దసంఖ్యలో ఉన్న నిరుద్యోగ సైన్యం వలన ఆ దేశాలలో వేతనాలు పెరగటం లేదు. అందువలన ప్రపంచవ్యాపితంగా కార్మికుల నిజ వేతనాలు పెరగటం లేదు. ఉదాహరణకు అమెరికాలోని కార్మికుల సగటు నిజ వేతనాలు 1968లో కన్నా 2011లో ఎక్కువగా లేవని, వాస్తవంగా అప్పటి కన్నా తక్కువగా ఉన్నాయని జోసెఫ్ స్టిగ్లిట్జ్ పేర్కొన్నాడు. రెండవది, ఒకవైపు ఈ పరిణామాలు జరుగుతుండగా, మరోవైపున శ్రామికుల ఉత్పాదకత పెరుగుతున్నది. ఫలితంగా అన్నిచోట్లా అదనపు విలువ పెరుగుతున్నది. పెట్టుబడిదారులు, పెద్దసంఖ్యలో సేవల రంగంలో పనిచేస్తున్న వారు అదనపు విలువలో ఎక్కువ వాటా పొందటం ఆదాయ అసమానతలు పెరగటానికి కారణమౌతున్నది. ఈ విధంగా సంపద, ఆదాయ అసమాతనలు పెరగటంతో ప్రతిచోటా ప్రజాస్వామ్యం హరించుకుపోతున్నది. ఇది కొద్దికాలం కొనసాగిన తర్వాత అదృశ్యమైపోయేది కాదు. మనం చర్చిస్తున్న వాటిలో మూడవ అంశం, కార్యకలాపాలను అభివృద్ధి చెందిన దేశాల నుండి మూడవ ప్రపంచ దేశాలకు తరలించినప్పటికీ ఆ దేశాలలోని నిరుద్యోగం, తక్కువ వేతనాలు అంతం కావు. అందుకు భిన్నంగా పెరిగిన కార్యకలాపాలతో పోల్చుకున్నపుడు నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నది. అందువలననే ఇది తాత్కాలికమైనది కాదు. వలసవాదం అంతమైన తర్వాత దేశీయ అభివృద్ధి కోసం అనుసరించిన విధానాల స్థానంలో కార్మికులను తగ్గించే సాంకేతిక, వ్యవస్థాగతమైన మార్పులను అనేక మూడవ ప్రపంచదేశాలలో ప్రవేశపెట్టారు. మరోవైపున స్వయంసమృద్ధిని సాధించే క్రమంలో వ్యవసాయ రంగంలోని రైతాంగానికి అండగా ఉన్న ప్రభుత్వం నయా సరళీకరణ విధానాల క్రమంలో ఆ విధానాల ఉనుండి ఉపసంహరించుకుంటున్నది. దానితో వ్యవసాయంలో లాభదాయకత తగ్గిపోయి, అనేక తరగతుల రైతాంగం వ్యవసాయం చేయటాన్ని మానుకుని, ఉపాధిని వెదుక్కుంటూ నగరాలకు వలస వెళ్ళారు. గతంతో పోలిస్తే అక్కడ కూడా ఉపాధి కల్పించే వేగం తగ్గిపోయింది. అందువలన ప్రస్తుత ప్రపంచీకరణ సమయంలో ఆదాయ అసమానతలు పెరగటం తాత్కాలికమైనది కాక దీర్ఘకాలం కొనసాగుతుంది.

మూడవ ప్రపంచదేశాలలో రైతాంగ(చిన్న ఉత్పత్తిదారుల) ఆదాయాలను హరించటం, రైతాంగం పట్టణాలకు వలస పోవటం వలన సాపేక్షంగా పెరుగుతున్న నిరుద్యోగం ఆదాయం, సంపద అసమానతలను పెంచటమే కాక, (పోషకాహార ప్రమాణాల రీత్యా) నిష్ట దరిద్రంలో బతికేవారి సంఖ్యను కూడా పెంచుతుంది. భారతదేశంలో గ్రామీణప్రాంతంలో రోజుకు తలకు 2,200 కేలరీలు, పట్టణ ప్రాంతాలలో 2,100 కేలరీలు దరిద్రరేఖకు ప్రమాణంగా తీసుకుంటున్నారు. తలకు 2,200 కేలరీల ఆహారం తీసుకోలేని వారు 1993–94లో గ్రామీణప్రాంతంలో 58 శాతం ఉండగా, 2011–12లో 68 శాతానికి పెరిగింది. పట్టణప్రాంతంలో ఇది 57శాతం నుండి 65 శాతానికి పెరిగింది. 1991లో నయా ఉదారవాద ప్రపంచీకరణ ప్రారంభం అయిన తర్వాత భారతదేశంలో దరిద్రం పెరగటాన్ని స్పష్టంగా చూడవచ్చు.

ఈ విధంగానే ప్రపంచం మొత్తంగా చూస్తే 1979–80 నుండి 1981–82 మధ్య సంవత్సరానికి తలసరి ఆహారధాన్యాల ఉత్పత్తి 355 కిలోలు ఉండగా 2,000–02 నాటికి 343 కిలోలు, 2016–18 నాటికి 344 కిలోలకు తగ్గింది. దశాబ్దంలోని చివరి మూడు సంవత్సరాల కాలంలో ఇథనాల్ ఉత్పత్తికి ఎక్కువ ఆహారధాన్యాలను వినియోగించటంతో ఆహార వినియోగం కోసం లభించే మొత్తం తగ్గిపోయింది. నయా ఉదారవాద ప్రపంచీకరణ ఆధిపత్యం ప్రారంభమైన తర్వాత ప్రపంచవ్యాపితంగా ఆహారలభ్యత తగ్గటంతో పోషకాహారం లభించని ప్రజల సంఖ్య పెరిగింది. ప్రపంచీకరణ సంపద, ఆదాయ అసమానతలు పెంచటం, ప్రతిచోటా ప్రజాస్వామ్యాన్ని కుదించటంతో పాటు పోషకాహారం తీసుకోలేని వారి సంఖ్యను కూడా పెంచింది. మూడవ ప్రపంచదేశాలలో జరుగుతున్న అభివృద్ధి ప్రజలను దారిద్ర్యరేఖ పైకి తీసుకొస్తున్నదని పెద్దఎత్తున ప్రచారం జరుగుతున్న క్రమంలో మొదట ఈ వాదన కొత్తగా అనిపించవచ్చు. దారిద్ర్యరేఖను కొలిచే అన్ని ప్రమాణాల కన్నా ఆహార లభ్యత అత్యంత ప్రామాణికమైనది. మనం చూసిన కారణాల వలన పెరుగుతున్న అసమానతలు, దరిద్రాన్ని తగ్గించటం కోసం అమలుచేసే సంక్షేమ పథకాలను ప్రపంచీకరణ నిరోధిస్తుంది. ప్రపంచీకరణ ఎక్కువమంది ప్రపంచ ప్రజానీకాన్ని ఒక చట్రంలో కట్టిపడవేస్తుంది. దిగజారిపోతున్న తమ పరిస్థితులను మార్చుకోవటంలో వారు అశక్తులుగా ఉంటారు. ప్రపంచీకరణ సమయంలో ఆసియాలో భారతదేశంతో పాటు అనేకదేశాలు అధిక పెరుగుదల రేట్లను సాధించినప్పటికీ ఈ మౌలిక వాస్తవానికి భిన్నంగా లేవు. ఉదాహరణకు భారతదేశంలో అధిక పెరుగుదల రేట్లు దేశంలో ధనికులు, పేదల మధ్య విభజనను తీవ్రం చేశాయి.

ఈ విధంగా ఒక చట్రంలో బంధించబడటం వలన నిరంతరం జీవన పరిస్థితులు దిగజారుతున్నటికీ వాటిని మార్చటానికి రాజకీయంగా జోక్యం చేసుకోలేని పరిస్థితులలో ఉంటారు. ప్రజలు ఎంత ఎక్కువగా స్వేచ్ఛను కోల్పోయారో ఇది స్పష్టం చేస్తుంది. అంతేకాకుండా ఒకదేశం ప్రపంచీకరణ నుండి బయటపడి, ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించటానికి శక్తి లేకుండాచేస్తుంది. క్షేత్రస్థాయి లెక్కలను ఆధారం చేసుకొని మొత్తం ప్రజానీకంలో ఆహారం అందని ప్రజానీకం ఎంతమంది ఉంటారో స్పష్టంగా చెప్పటం సాధ్యం కాదు కాబట్టి అంచనాలను చెబుతుంటారు. పెట్టుబడులపై ఆంక్షలను

విధించినచోట ప్రపంచీకరించబడిన పెట్టుబడుల ఆధిపత్యం సాగదు. అపుడు జాతీయ ప్రభుత్వం తనకు ఇష్టమైన విధానాలను అనుసరించటానికి, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవటం కోసం రాజకీయంగా ఐక్యంగా జోక్యం చేసుకోవటానికి అవకాశాలు కూడా పరిమితం అవుతాయి. దీనికి కారణాలేమిటనేది ఇపుడు పరిశీలన చేద్దాం.

> **"దేశాల మధ్య స్వేచ్ఛగా సంచరిస్తున్న ధనిక దేశాల పెట్టుబడుల ప్రయోజనాలను కాపాడటం కోసం ప్రపంచీకరణ పనిచేస్తున్నది కాబట్టి దానికి అభివృద్ధి చెందిన ప్రధానదేశాల మద్దతు ఉన్నది. కాబట్టి ఏ దేశమైనా ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే ఆ దేశం అభివృద్ధి చెందిన దేశాల కోపాన్ని చవిచూడాల్సి వస్తుంది."**

## 3

ద్రవ్య పెట్టుబడులతో తెగతెంపులు చేసుకోవటం వలన దీర్ఘకాలంలో ప్రయోజనం పొందే ప్రజలకు సమస్యలు ఎదురౌతాయి. తెగతెంపులు చేసుకోవటానికి ప్రయత్నం చేసిన వెంటనే దేశం నుండి వెళ్ళే ద్రవ్య పెట్టుబడులు వలన ద్రవ్య సంక్షోభం ఏర్పడుతుంది. అందువలన ఆ దేశం వెంటనే తెగతెంపులు చేసుకోవటాన్ని గురించి పునరాలోచించటానికి, ఆ నిర్ణయాన్నుండి వెనక్కు రావటానికి కూడా దారితీస్తుంది. ఒకవేళ ద్రవ్య సంక్షోభం ఏర్పడనప్పటికీ, తెగతెంపులు చేసుకోవటాన్ని ప్రకటించిన వెంటనే ద్రవ్య పెట్టుబడులపై ఆంక్షలు విధించినప్పటికీ (విధిస్తే అవి ఆశ్చర్యకరంగా ఉంటాయి) విదేశీ చెల్లింపుల సమస్య ముందుకువస్తుంది.

భారతదేశంతో పాటు అనేక మూడవ ప్రపంచదేశాలు విదేశీ చెల్లింపులలో లోటుతో ఉన్నాయి. పెట్టుబడుల ఖాతాలో వచ్చే ధనాన్ని ఉపయోగించి చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకోవాలనే నిర్ణయంతో పెట్టుబడులు పెద్దమొత్తంలో దేశం నుండి వెళ్ళినప్పటికీ(ఆ విధంగా బయటికి వెళ్ళటంపై తక్షణమే ఆంక్షలు విధించటం వలన), దేశంలోకి పెట్టుబడులు రావటం ఆగిపోతుంది. అపుడు విదేశీ చెల్లింపులు భరించలేనివిగా మారి దిగుమతులను తగ్గించుకోవాల్సి వస్తుంది. ఏ పేదప్రజల ప్రయోజనాల కోసమైతే ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకోవటం, దేశీయ వినియోగాన్ని తగ్గించే చర్యలు తీసుకొంటున్నారో ఆ పేదల వినియోగంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక పెద్ద ఆర్థికవ్యవస్థ ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకొంటున్నపుడు నిర్దిష్ట కాలంలో ఎక్కువ సరుకుల ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచటానికి చర్యలు తీసుకోవాలి. కాని కొన్ని సరుకులకు ప్రత్యామ్నాయాన్ని ఉత్పత్తి చేయటం సాధ్యం కాదు. ఉదాహరణకు ఆయిలును ఆ విధంగా ఉత్పత్తి చేయటం సాధ్యం కాదు. అటువంటి దేశం ఆయిలు దిగుమతి చేసుకోవటానికి(ఇతర ముఖ్యమైన ఉత్పత్తులకు కూడా) ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవాలి. సమకాలీన ప్రపంచంలో ఆ విధంగా తెగతెంపులు చేసుకోవాలంటే ఆచరణాత్మకమైన సమస్య ఉంది. ఇది మనలను రెండవ ఆటంకం వద్దకు తీసుకొస్తుంది.

దేశాల మధ్య స్వేచ్ఛగా సంచరిస్తున్న ధనిక దేశాల పెట్టుబడుల ప్రయోజనాలను కాపాడటం కోసం ప్రపంచీకరణ పనిచేస్తున్నది కాబట్టి దానికి అభివృద్ధి చెందిన ప్రధానదేశాల మద్దతు ఉన్నది. అమెరికా ఆలస్యంగా పన్నులను విధించటం ప్రారంభించినప్పటికీ ఇది కొనసాగుతున్నది. కాబట్టి ఏ దేశమైనా ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే ఆ దేశం అభివృద్ధి చెందిన దేశాల కోపాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఆ దేశంతో వాణిజ్యంపై ఆంక్షలు విధిస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల, ముఖ్యంగా అమెరికా వత్తిడి వలన ఎక్కువ దేశాలు ఆంక్షలు విధించటానికి అంగీకరిస్తాయి. దానితో ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకున్న దేశం తన అత్యవసరాలైన ఆయిల్, ఇతరాలను దిగుమతి చేసుకోవటం కష్టమౌతుంది. ప్రస్తుతం ఇరాన్‌కు వ్యతిరేకంగా విధించిన ఆంక్షలు ఈ అంశాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ విధమైన ఆంక్షలు పేదప్రజలపై ఎక్కువ ప్రభావం చూపటంతో ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకోవటం వలన వారి మద్దతును కోల్పోవాల్సివస్తుంది.

ప్రపంచీకరించబడిన ద్రవ్య పెట్టుబడులతో పెనవేసుకున్న, దాని వలన ప్రయోజనం పొందిన మూడవ ప్రపంచదేశాలలోని పెట్టుబడిదారులు దానితో తెగతెంపులు చేసుకోవటాన్ని వ్యతిరేకిస్తున్నారు. అందువలన ఈ కార్యక్రమం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, మత్స్యకారులు తదితరుల మద్దతును మాత్రమే పొందుతుంది. వీరి మద్దతు పొందిన, ఎన్నికైన తర్వాత కూడా తన విధానాలకు కట్టుబడి ఉండే ధైర్యం, నమ్రత కలిగిన రాజకీయ పార్టీతోనే ఈ కార్యక్రమాన్ని అమలు చేయటం సాధ్యమౌతుంది. అప్పటికే పెట్టుబడిదారులు, మధ్య తరగతుల నుండి నిరంతర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న అటువంటి పార్టీ, అభివృద్ధి చెందిన దేశాల ప్రభుత్వాల నుండి కూడా వ్యతిరేకతను ఎదు ర్కొంటుంది. వాణిజ్య ఆంక్షల వలన ఎదురౌతున్న ఇబ్బందుల వలన పునాది వర్గాల మద్దతును కూడా కోల్పోతుంది. వ్యతిరేకులు, తప్పుడు ప్రచారం చేసే వారిని ఎదుర్కోవటానికి తోడ్పడే వారి మద్దతును కోల్పోతుంది. అది కోల్పోయే మద్దతు ఎక్కువ కానప్పటికీ ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకొనే విధానాలతో ముందుకుసాగటానికి, నిలదొక్కుకోవటానికి అవకాశాలను తగ్గిస్తుంది.

ఈ ధోరణుల వలననే ప్రపంచీకరణ పరిధిలో ఉన్న ప్రపంచ పేదలు, శ్రామికప్రజలు తమ పరిస్థితులను మెరుగు చేసుకోవటానికి రాజకీయంగా జోక్యం చేసుకొనే అవకాశాలు లేకుండా చేస్తుంది. ఆ విధంగా ప్రపంచీకరణ తన పరిధి నుండి బయటపడటానికి తీవ్రమైన ఆటంకాలను సృష్టిస్తుంది. ప్రపంచంలోని విస్తారమైన ప్రజానీకాన్ని దుర్భరమైన పరిస్థితులలోకి నెట్టి, దాని నుండి బయటపడటానికి అవకాశం లేకుండాచేస్తుంది.

## 4

ప్రపంచీకరణతో తెగతెంపులు చేసేకొనే అటువంటి కార్యక్రమం జాతీయవాదానికి తిరిగివెళ్ళటం అవుతుందని పెద్దసంఖ్యలో అభ్యుదయవాదుల నుండి కూడా వ్యతిరేకత రావటం హాస్యాస్పదంగా ఉంటున్నది. జాతీయవాదాన్ని ఒకే విధమైనదిగా చూస్తూ పొరపాటు అవగాహనతో వారు వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నవారు హిట్లర్ అనుసరించిన యూరోపియన్ జాతీయవాదానికి, గాంధీ, హొచిమిన్‌లు అనుసరించిన మూడవ ప్రపంచదేశాల సామ్రాజ్యవాద వ్యతిరేక

> **"ప్రపంచీకరణ మూడవ ప్రపంచదేశాల లోని శ్రామికప్రజలను ఒక చట్రంలో ఇరికించి, వారిని మరింత ఎక్కువెక్కువగా దోపిడి చేస్తూ దాని నుండి వారు బయటపడటానికి వీలులేని పరిస్థితులను కల్పిస్తుంది. అది సంక్షోభంలో చిక్కుకున్నపుడు ప్రజాస్వామ్యాన్ని బలహీన పరచటానికి, ఫాసిస్టు ధోరణులను పెంపొం దించటానికి పూనుకుంటుంది."**

జాతీయవాదానికి మధ్య వ్యత్యాసాన్ని చూడటం లేదు. 17వ శతాబ్దంలో యూరప్‌లో జరిగిన వెస్ట్‌ఫాలియన్ ఒప్పందాల కాలంలో వాడుకలోకి వచ్చిన జాతీయవాదం అనే మాటకు, 20వ శతాబ్దంలో మూడో ప్రపంచదేశాలలో ఉనికి లోకి వచ్చిన సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ వాదానికి కనీసం మూడు మౌలిక వ్యత్యా సాలున్నాయి. మొదటిది, యూరోపియన్ జాతీయవాదం ఎప్పుడూ అంతర్గత శతృవు కోసం అనేషిస్తుంది కాబట్టి అది ఎప్పుడూ అందరినీ ఐక్యం చేసేది కాదు. మరోవైపున మూడవ ప్రపంచదేశాలలోని సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం మతం, జాతి, భాష, లింగ వివక్షలతో సంబంధం లేకుండా అందరినీ కలుపుకెళుతుంది. వలసదేశాలలోని ప్రజల మధ్య ఉన్న విభజనలను వినియోగించుకొని బలపడిన సామ్రాజ్య వాదాన్ని ఎదుర్కోవటానికి అందరిని కలుపుకెళ్ళే జాతీయవాదం రూపుదాల్చింది. రెండవది, యూరోపియన్ జాతీయవాదం ప్రారంభం నుండి సామ్రాజ్యవాదంగా ఉన్నది. మూడవ ప్రపంచదేశాలలోని సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అనుసరించకుండా తమలాగా పోరాటాలు చేస్తున్నవారితో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నది. మూడవది, యూరోపియన్ జాతీయవాదం ప్రజల కన్నా దేశం ఉన్నతమైనదని, దేశం కోసం ప్రజలు త్యాగాలు చేయాలని చెబుతుంది. మూడవ ప్రపంచదేశాలలోని సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం దేశంలోని ప్రజల పరిస్థితులను మెరుగుచేయటం న్యాయమైనదని చెబుతుంది. ఈ రెండు జాతీయవాదాలకు ఉన్న వర్గపునాది కూడా భిన్నమైనది. యూరోపియన్ జాతీయ వాదం బూర్జువా జాతీయవాదం. బూర్జువావర్గ అభివృద్ధికి అనుగుణంగా దాని పాత్ర, ప్రాధాన్యతలు మారుతుంటాయి. మరోవైపున మూడో ప్రపంచదేశాలలోని సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజల ఆగ్రహాన్ని వ్యక్తం చేసినప్పటికీ, వలస విధానంలో అత్యంత తీవ్రంగా దోపిడీకి గురైనవారు, ఎక్కువ సంఖ్యలో ఉన్నవారు రైతాంగం కాబట్టి ఇది ప్రధానంగా రైతాంగ జాతీయవాదం.

యూరోపియన్ జాతీయవాదం, సామ్రాజ్య వాద వ్యతిరేక జాతీయవాదం భూభాగం ప్రాతిపదికగా ఏర్పడినవి కాదు. యూరప్‌లో వలె ఒక తరగతిని బలపరిచే జాతీయవాదం మూడవ ప్రపంచదేశాలలో కూడా ఉన్నది. అది వలస విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని వ్యతిరేకించింది. వలసపాలనకు వ్యతిరేకంగా ప్రజలందరినీ సమీకరించటాన్ని వ్యతిరేకించి, మతం, జాతి విబేధాల ప్రాతిపదికగా ఒక తరగతికి వ్యతిరేకంగా మరొక తరగతిని సమీకరించటానికి పూను కుంది. అది కొనసాగటమే కాక ఆ తర్వాత నూతన ప్రోత్సాహాన్ని పొందింది (అందుకు కారణాలను తర్వాత చర్చిద్దాం). ప్రపంచం లోని ఇతరచోట్ల వలె నిరంకుశ, ఫాసిస్టు ఉద్యమాల తరహాలో వ్యవహరిస్తున్నది. ఇది వ్యవహరించే తీరులో ప్రత్యేకత ఏమంటే ఇది ప్రజల పరిస్థితుల మెరుగుదలకు ఎటువంటి హామి ఇవ్వదు. ప్రజల పరిస్థితులు మెరుగు కాకపోవటానికి బాధ్యతను 'ఇతరుల'పై, భిన్నమైన మత, జాతి, భాషా గ్రూపులపై పెడుతుంది.

ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకోవటానికి ప్రయత్నించే అభ్యుదయ ప్రతిపక్షంతో సమస్య ఏమిటంటే అది అన్ని జాతీయవాదాలను ఏకీకృతమైనవిగా, ఫాసిజానికి నమూనాగా, యూరోపియన్ జాతీయ వాదంగానే చూస్తుంది. ఇది వాస్తవ విరుద్ధం. మూడవ ప్రపంచదేశాలలోని కార్మికులు, రైతులు, ఇతర ప్రజల పరిస్థితులను మెరుగుచేయటానికి ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకోవటం ఫాసిస్టు నమూనాకు పూర్తి విరుద్ధమైనది. అది ఎదుర్కొనే ఇతర సమస్యలన్నింటితో పాటు తప్పుడు అవగాహనతో ఉండే సైద్ధాంతికాంశాలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది.

## 5

ప్రపంచీకరణ మూడవ ప్రపంచదేశాల లోని శ్రామికప్రజలను ఒక చట్రంలో ఇరికించి, వారిని మరింత ఎక్కువెక్కువగా దోపిడి చేస్తూ దాని నుండి వారు బయటపడటానికి వీలులేని పరిస్థితులను కల్పిస్తుంది. అది సంక్షోభంలో చిక్కుకున్నపుడు ప్రజాస్వామ్యాన్ని బలహీన పరచటానికి, ఫాసిస్టు ధోరణులను పెంపొం దించటానికి పూనుకుంటుంది. కొదికాలం నుండి ప్రపంచీకరణ ఎదుర్కొంటున్న సంక్షోభం ఈ విధమైన నిరంకుశ, ఫాసిస్టు ధోరణులకు బలాన్ని చేకూరుస్తున్నది. మనం గతంలో చర్చించిన, ప్రపంచంలోని ప్రతిదేశంలో జరిగే ఉత్పత్తిలో ఎక్కువ భాగం కొద్దిమంది చేతుల్లోకి వెళ్ళటంలోనే సంక్షోభానికి మూలం ఉన్నది. వేతనాల ద్వారా వస్తున్న ఆదాయం కన్నా అదనపు విలువ పొందేవారి ద్వారా జరిగే వినియోగం తక్కువ కాబట్టి, వేతనాల నుండి ఆదాయం అదనపు విలువ వైపు మళ్ళుతున్నపుడు నిర్దిష్టకాలంలో, తక్కువ డిమాండు, తక్కువ వినియోగం, తక్కువ పెట్టుబడులు పెడతారు. నిర్దిష్టకాలంలో డిమాండ్ పడిపోతున్నడు అదేకాలంలో పెట్టుబడులు పెరగటం లేదా యథాతథంగా ఉండటం జరగదు. డిమాండ్‌కు అనుగుణంగా పెట్టుబడులు స్పందిస్తూ ఉంటాయి. కాబట్టి అదే కాలంలో పెట్టుబడి పెట్టటం తగ్గిపోవటంతో ఆర్థిక స్థంభన కొనసాగు తుంటుంది.


ఈ విధంగా స్థంభించిపోవటాన్ని ఎదుర్కొనేందుకు ఏ విధమైన ముఖ్యమైన కార్యక్రమం ఉండదు. పెట్టుబడిదారులపై పన్నులు విధించటం, ద్రవ్యలోటును పెంచితే ప్రపంచీకరించబడిన ద్రవ్య పెట్టుబడులకు కోపం వస్తుంది కాబట్టి ప్రభుత్వం చేసేఖర్చుకు పరిమితులు ఉంటాయి. దీనిని ఎదుర్కోవటానికి ఉన్న ఒకే ఒకమార్గం ఆస్తుల బుడగలను సృష్టించటమే. అమెరికా లాంటి పెద్ద ఆర్థికవ్యవస్థలో ఇటువంటి బుడగలను సృష్టిస్తే ప్రపంచ ఆర్థికవ్యవస్థపై పెద్ద ప్రభావం చూపుతుంది. అటువంటి బుడగలను సృష్టిస్తే గతంలో జరిగిన విధంగా అవి బద్దలైనపుడు ప్రపంచ ఆర్థికవ్యవస్థ తిరిగి సంక్షోభంలో కూరుకుపోతుంది. సంక్షోభాన్ని ఎదుర్కోవటంలో ఈ వ్యవస్థకున్న అశక్తత దానిని

బలహీనపరుస్తుంది. అందువలన అది తన ప్రచారపద్ధతిని మార్చుకొని, సంక్షోభానికి 'ఇతరులు' కారణమని నిందించటానికి పూనుకుంటుంది. ఏ ఆధునిక సమాజంలో అయినా అప్రధానమైనవిగా ఉండే ఫాసిస్టు, అర్ధ ఫాసిస్టు ముఠాల మద్దతును కూడగట్టుకొంటుంది. సంక్షోభ సమయంలో రెండు కారణాల రీత్యా అవి కేంద్రస్థానానికి వస్తాయి. మొదటిది, 'ఇతరుల'ను శత్రువులుగా భావించే, వారిని దూరం చేసే నినాదాలను స్వీకరించే ప్రజానీకం అపుడు ఎక్కువగా ఉంటారు. రెండవది, ఇంతకుముందు మనం చర్చించిన కారణాలతో విధానాలలో మార్పుకోసం బడా పెట్టుబడి దారులు వారికి పెద్దమొత్తంలో ఆర్థిక వనరులు సమకూరుస్తారు. ప్రజలు మత, జాతి ప్రాతిపదికపై విభజించబడతారు కాబట్టి వారి జీవితాలను ప్రభావితం చేసే ఆర్థిక విషయాలను చర్చల నుండి మినహాయించి, మెజారిటి ప్రజల ఆర్థిక కష్టాలకు బాధ్యతను 'ఇతరుల'పైకి నెట్టివేస్తారు. ఆర్థిక సంక్షోభానికి కారణాలను, దాని నుండి బయటపడటం కోసం శాస్త్రీయంగా చర్చించటం వదిలివేసి, 'ఇతరుల'ను దూరం చేయటంపై కేంద్రీకరిస్తారు.

1930లలో లాగా ఫాసిస్టు ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పటికీ నిరుద్యోగాన్ని తగ్గించటం కోసం భారీగా సైనికావసరాలపై ఖర్చు పెట్టటం కోసం ప్రభుత్వం రుణాలు తీసుకోవటం లేదా పెట్టుబడిదారులపై పన్నులు వేయటాలను ప్రపంచీకరించబడిన ద్రవ్య పెట్టుబడులు అంగీకరించవు. అయినప్పటికీ వ్యవస్థను కాపాడుకోవటం కోసం కనీసం రెండు విధాలుగా ముందుకువస్తాయి. మొదటిది, 'ఇతరుల'ను శత్రువులుగా చూయించటం ద్వారా ఆర్థికాంశాలపై తీవ్రమైన చర్చ జరగకుండా చేసి, ఇతరులపై ద్వేషాన్ని రెచ్చగొడుతుంది. రెండవది, ఇంతకు ముందుకన్నా మరింత అణచివేసే సాధనంగా ప్రభుత్వాన్ని తయారు చేసి, అది తీసుకుంటున్న నిరంకుశమైన చర్యలకు వ్యతిరేకంగా తాము వ్యతిరేకించే గ్రూపులు చేసే ఎటువంటి పోరాటాలనైనా అణచివేస్తారు. కాలక్రమంలో ప్రజాస్వామ్య పోరాటాలన్నింటి పైకి నిర్బంధాన్ని విస్తరింపజేస్తారు. ప్రభుత్వం ఆ విధంగా నిరంకుశంగా, ఫాసిస్టు స్వభావం కలిగినదిగా మారేక్రమాన్ని భారతదేశంలో మనం చూస్తున్నాం.

సంక్షోభం ప్రారంభం కావటానికి ముందు ప్రపంచీకరణ ఉన్నతస్థాయిలో ఉన్నపుడు కూడా ప్రజల కార్యకలాపాలపై ఆంక్షలు విధించి, వారి స్వేచ్ఛను క్రమంగా కుదిస్తున్నది.

**"మానవహక్కులు, ప్రజాస్వామిక విలువలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనను వ్యక్తం చేస్తూ ప్రపంచీ కరణ తనను తాను సమర్థించుకోవటానికి ప్రయత్నిస్తుంది. అదే సమయంలో ప్రపంచీ కరణను గట్టిగా సమర్థిస్తున్న బడా బూర్జు వాలలోని ఒకభాగం ఆర్థిక మద్దతు లేకుండా ఫాసిస్టు శక్తులు ఏ దేశంలోనూ అధికారంలోకి రాలేవనేది కూడా వాస్తవం."**




ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకోవటం కోసం రాజకీయంగా జోక్యం చేసుకోవటాన్ని పరిమితం చేయటమే కాక, ప్రజలు తమ సమస్యలపై రాజకీయంగా జోక్యం చేసుకొనే సామర్థ్యాన్ని కూడా హరించివేస్తుంది. సంక్షోభ సమయంలో వాటిని మరింతగా కుదించి వేస్తుంది. సాధారణమైన ప్రజాస్వామ్య నిర్మాణాలను బలహీనపరచటం, ప్రజాస్వామ్య హక్కులను కుదించటం, వివిధ సమూహాలకు చెందిన ప్రజల మధ్య అనైక్యతను పెంచటం చేస్తుంది. రెండు కారణాల రీత్యా ఈ వాదన సందేహాస్పదంగా ఉంటుంది. మొదటిది, ప్రపంచవ్యాపితంగా అనేకదేశాలలో ఫాసిస్టు శక్తులు తలెత్తుతున్నప్పటికీ వాటికి ప్రపంచీకరణతో ఉన్న సంబంధం ఏమిటి? జాతీయవాద భావజాలంతో ప్రభావితం కాని శక్తులు ప్రపంచీకరణలో భాగస్వాములు కావటానికి బదులు తమ స్థానిక నిర్మాణాలలోకి కుదించుకుపోవటానికి ప్రయత్నిస్తున్నాయా? అని ప్రశ్నిస్తారు. రెండవది, ప్రపంచీకరణ మానవ హక్కులను గురించి ఆందోళనను వ్యక్తం చేయటమే కాక, ప్రపంచంలోని ప్రతిభాగం ప్రపంచానికంతటికీ కనిపిస్తున్నది కాబట్టి ప్రపంచంలోని ఏ ప్రాంతంలో మానవహక్కుల ఉల్లంఘన జరిగినా దానిపై కూడా ఆందోళన చెందుతున్నదని వాదన చేస్తారు. ఫాసిస్టు ఉద్యమాలకు మద్దతునివ్వటం, ప్రజాస్వామ్య హక్కులను హరించటం కాకుండా ప్రపంచీకరణ ప్రజాస్వామ్యం, మానవహక్కులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని వాదనలు చేస్తారు. ఈ వాదనలను గురించి మనం పరిశీలిద్దాం.

## 6

మానవహక్కులు, ప్రజాస్వామిక విలువలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనను వ్యక్తం చేస్తూ ప్రపంచీకరణ తనను తాను సమర్థించుకోవటానికి ప్రయత్నిస్తుంది. అదే సమయంలో ప్రపంచీకరణను గట్టిగా సమర్థిస్తున్న బడా బూర్జువాలలోని ఒకభాగం ఆర్థిక మద్దతు లేకుండా ఫాసిస్టు శక్తులు ఏ దేశంలోనూ అధికారంలోకి రాలేవనేది కూడా వాస్తవం. కాబట్టి ఫాసిస్టు శక్తులు దేశంలో మానవహక్కులను కుదించటంపై ప్రపంచవ్యాపితంగా విమర్శలు వస్తున్నప్పటికీ, ప్రపంచీకరణ నుండి తమ దేశాన్ని దూరం చేయాలనే ఉద్దేశం వారికి ఉండదు.

దేశంలోని ద్రవ్య–కార్పొరేట్ గుత్తాధిపతులు ప్రపంచీకరించిన ద్రవ్య పెట్టుబడులతో మమేకమైన పరిస్థితులలో ప్రజాస్వామిక సంస్థలపై దాడులను కొనసాగిస్తున్నది. కాబట్టి

❝ ఆర్థిక సంక్షోభం ముదిరేకొద్దీ ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకొనే దేశాలపై క్రమశిక్షణ చర్యలను రుద్దటానికి అభివృద్ధి చెందిన దేశాలకున్న శక్తి తగ్గిపోతుంది. ఈ విధానం పనిచేయదని స్పష్టం కావటంతో అభివృద్ధి చెందిన దేశాలు తాము ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవటం కోసం (అమెరికా చేస్తున్నట్లుగా) ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకోవటం ప్రారంభిస్తాయి. ప్రజల విముక్తి పోరాటాలను దారి తప్పించటంలో ఫాసిస్టు శక్తులు శాశ్వతంగా విజయం సాధించలేవు. ❞

మానవహక్కులను హరించటంపై అటువంటి ప్రభుత్వంపై విమర్శలు ఎప్పుడూ దాని తీవ్రతను వెల్లడించేస్థాయిలో ఉండవు. 1930లలో ఉన్న పరిస్థితికి ఇది పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అపుడు ఫాసిస్టు శక్తులు అధికారంలో ఉన్నాయి. సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్న పరిస్థితి అది. ఆ సమయంలో ఫాసిజం అంతర్గతంగా ఒక తరగతి బూర్జువాలు ప్రోత్సహించే( తెలిసి తెలియకుండా ఇతర బడా బూర్జువాలు కూడా మద్దతు నిచ్చారు) శక్తిగానే కాక, అప్పటికి ప్రపంచంలో ఉన్న సామ్రాజ్యవాద పొందికను, అధికార సంబంధాలను దెబ్బతీసే పరిస్థితిలో ఉన్నది. దీనిని భిన్నంగా చూసినట్లైతే ప్రతిదేశ ద్రవ్య పెట్టుబడికీ జాతీయ ముద్ర ఉన్న పరిస్థితులలో, తమ దేశాల ప్రభుత్వాల సహకారంతో 1930లలో ఫాసిజం అభివృద్ధి అయింది. తనలాగే ఆయా ప్రధాన దేశాల ప్రభుత్వాల మద్దతుతో అభివృద్ధి చెందిన ద్రవ్య పెట్టుబడులతో ఘర్షణపడింది. ద్రవ్య పెట్టుబడులు ప్రపంచీకరించబడిన పరిస్థితులలో నేడు ఫాసిజం అభివృద్ధి చెందుతున్నది. వివిధ దేశాలలోని కార్పొరేట్లు, ద్రవ్య పెట్టుబడిదారుల గుత్తాధిపత్యంలో ద్రవ్య పెట్టుబడులు భాగంగా ఉన్నాయి. కార్పొరేట్-ద్రవ్య పెట్టుబడిదారుల ఆధిపత్యంలోని ప్రపంచీకరణ క్రమంలో జాతి రాజ్యాలు భాగంగా ఉన్నంత కాలం అవి మానవహక్కులను ఉల్లంఘించటంపై ప్రపంచవ్యాపితంగా విమర్శలు వచ్చినప్పటికీ వాటన్నింటినీ సహిస్తారు. వేరేమాటల్లో చెప్పుకోవాలంటే సమకాలీన ప్రపంచీకరణ వాదులు మానవహక్కులను గురించి చేస్తున్న ప్రచారం నిర్దిష్ట దేశాలలో ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రావటానికి దోహదం చేస్తుంది. ఆ విధంగా అధికారంలోకి వచ్చిన శక్తుల వలన 1930లలో జరిగినట్లుగా యుద్ధాల ద్వారా ప్రపంచాన్ని పునర్విభజన చేసే ప్రమాదం ఉండదు.

## 7

ఈ వ్యాసంలో చర్చించిన అంశాలను నేను తిరిగి వివరిస్తాను. విస్తారంగా ఉన్న కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, చిన్న ఉత్పత్తిదారులు, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో ఉన్నవారికి వారి జీవన పరిస్థితులను మెరుగు చేసుకోవటం కోసం పోరాటాలు చేయటానికి ఉన్న స్వేచ్ఛను ప్రపంచీకరణ హరించివేస్తుంది. ప్రభుత్వాలు గతంలో ప్రజాస్వామ్య చట్రంలో స్వయం సమృద్ధి సాధన విధానాలు అమలుజరిపిన కాలంతో పోల్చుకున్నప్పటికీ హక్కులను హరించటం జరుగుతుంది. సమకాలీన ప్రపంచీకరణతో అమలుజరుగుతున్న నయా ఉదారవాద విధానాల వలన అసమానతల పెరుగుదలకు, పోషకాహార లోపానికి వీరు బలైపోతారు. ఈ విధానంలో పెట్టుబడులు ప్రపంచీకరించబడటం, ప్రభుత్వాలు దేశానికి పరిమితమైనవై ఉండటంతో సమైక్య రాజకీయ జోక్యం ద్వారా ఈ ఘటనలలో మార్పులు తీసుకురావటానికి శక్తి లేకుండాచేస్తారు. ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకొని బయటపడటం కూడా చాలా కష్టంగా ఉంటుంది. దీనినుండి తెగతెంపులు చేసుకోవటం పరివర్తన కాలంలో సమస్యలను తీసుకురావటంతో పాటు, అభివృద్ధి చెందిన దేశాల ఆదేశాలతో వాణిజ్య ఆంక్షలు విధించటంతో పరిస్థితి మరింత తీవ్రమౌతుంది. ప్రపంచీకరణ విధానాల వలన మూడవ ప్రపంచదేశాలలోని శ్రామిక ప్రజలు ఈ విధమైన చట్రంలో బిగించబడతారు. ఆర్థిక సంక్షోభంతో ప్రపంచీకరణ చిక్కులను ఎదుర్కొంటున్నపుడు నిరంకుశ, ఫాసిస్టు ప్రభుత్వాలు ఈ చట్రాన్ని మరింతగా బిగించి, ప్రజాస్వామిక సంస్థలు, వ్యక్తిగత హక్కులపై దాడులను ప్రారంభిస్తాయి. స్వేచ్ఛను హరించటం కూడా తీవ్రం అవుతుంది.

1930లలో సంభవించిన ఆర్థిక సంక్షోభంలో వలె ప్రస్తుత సంక్షోభంలోనూ ఏమీ చేయని ఫాసిస్టు ప్రభుత్వాలు ఈ చట్రాన్ని బద్దలు కొట్టటానికి కార్మికవర్గానికి ఒక అవకాశాన్ని ఇస్తున్నాయి. ఆర్థిక సంక్షోభం ముదిరేకొద్దీ ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకొనే దేశాలపై క్రమశిక్షణ చర్యలను రుద్దటానికి అభివృద్ధి చెందిన దేశాలకున్న శక్తి తగ్గిపోతుంది. ఈ విధానం పనిచేయదని స్పష్టం కావటంతో అభివృద్ధి చెందిన దేశాలు తాము ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవటం కోసం (అమెరికా చేస్తున్నట్లుగా) ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకోవటం ప్రారంభిస్తాయి. ప్రజల విముక్తి పోరాటాలను దారి తప్పించటంలో ఫాసిస్టు శక్తులు శాశ్వతంగా విజయం సాధించలేవు. నయా ఉదారవాద ప్రపంచీకరణ ముందుకుసాగటానికి అవకాశం లేని పరిస్థితులలో విముక్తి పోరాటాలు మరోసారి ముందుకు వస్తాయి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**నిర్మాణం**

# కార్మిక సంఘాల్లో పార్టీ పని



**కమ్యూనిస్టు ఉద్యమం మన దేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పీపుల్స్ డెమాక్రసీ పత్రికలో ఉద్యమ చరిత్రలోని ముఖ్యఘట్టాలను ధారావాహికంగా ప్రచురిస్తున్నారు. అందులో భాగంగా వచ్చిన వ్యాసం ఇది. కేవలం కార్మిక రంగంలో పనిచేసే కార్యకర్తలకే కాకుండా ప్రతి కమ్యూనిస్టు సులువుగా చదివి అర్థం చేసుకోగలిగినట్టు ఈ వ్యాసం ఉంది. అందుకే దీనిని అనువదించాను. -ఎం.వి.ఎస్.శర్మ**

కమ్యూనిస్టు పార్టీ చట్టబద్ధంగా పని చేయడానికి అనుమతించాక ట్రేడ్‌యూనియన్ రంగంలో (ప్రధానంగా ఎఐటియుసి లోను, ఇతర కార్మిక సంఘాలలోను) పనిచేసే కమ్యూనిస్టు కార్యకర్తలతో మొట్టమొటిసారిగా ఒక సదస్సును పార్టీ నిర్వహించింది. 2 రోజులపాటు కలకత్తాలో జరిగిన ఈ సదస్సులో 300 మంది ప్రతినిధులు పాల్గన్నారు. ఇది 1952లో జరిగింది. కార్మికుల సమస్యల పట్ల కమ్యూనిస్టుల వైఖరి ఏ విధంగా ఉండాలి అన్న అంశం పైన, కార్మికరంగంలో పనిచేసేవారు అనుసరించవలసిన పద్ధతులమీద చర్చ జరిగింది. ఆ సందర్భంగా ఆమోదించిన డాక్యుమెంటులోని కొన్ని ప్రధాన అంశాలను దిగువన ఇస్తున్నాము.

– మన టియు కార్యకర్తకు మనం చేసిన పోరాటాల చరిత్ర, సాధించిన విజయాల చరిత్ర కనీసం రేఖామాత్రంగానైనా తెలిసివుండాలి. అప్పుడే కార్మికులకు విజయాలు సాధించ గలమన్న విశ్వాసాన్ని కల్పించగలుగు తాము. వారికి వర్గదృక్పథం అలవడేలా చేయగలు గుతాము. గత పోరాటాల అనుభవాలనుండి నేర్చుకుంటే ఆ అనుభవంతో ప్రస్తుత పోరాటాలను నడపగలుగుతాము. శత్రువు మన చరిత్రను వక్రీకరించి కార్మికులను తప్పు దోవ పట్టించాలని చూస్తాడు. మనం ఆ వక్రీకరణలతో తలపడవలసివుంటుంది.

– కార్మికులు ఉత్పత్తి చేసే సరుకుల మార్కెట్ ఏవిధంగా ఉందో మన టియు కార్యకర్త తెలుసుకుని వుండాలి. ఆ సరుకుల ధరలు ఏవిధంగా ఉన్నాయో, ఎలా పడుతూ, పెరుగుతూ ఉన్నాయో తెలుసుకోవాలి. ఒక సరుకుకి ధర ఎక్కువగా ఉంటే అందుకు కారణం కార్మికులకు హెచ్చు జీతాలివ్వడమే నని చెప్తూ ప్రభుత్వాలు, యజమానులు వినిమయదారులైన ప్రజలను కార్మికులపైకి ఎగదోల్తారు. పట్టణాల్లోని కార్మికులకు, గ్రామసీమల్లోని రైతాంగానికి మధ్య వైరాన్ని సృష్టిస్తారు.

– ఏ పరిశ్రమలో యూనియన్ నడుపుతున్నామో ఆ పరిశ్రమను నిర్వహిస్తున్న పద్ధతులగురించి కనీసమైన అవగాహన అయినా మన కార్యకర్తకు ఉండాలి. అప్పుడే వేతనాలు, పనిభారం, పనివేగం పెంచడం, పీస్ రేట్లు వంటి అంశాలపై సక్రమంగా ప్రాతినిధ్యం చేయగలుగుతారు. ఈ విషయాలను మనకు బాగా నేర్పగలిగేది ఆ పరిశ్రమలో పనిచేసే సాధారణ కార్మికులే. వారి వద్దనుంచి నేర్చుకోడానికి మనం ఏనాడూ వెనుకాడవద్దు, నిర్లక్ష్యం చేయవద్దు.

– మనం పని చేసే పరిశ్రమకు వర్తించే చట్టాలగురించి శ్రద్ధ వహించాలి. ఆ చట్టాలు ఏ విధంగా వర్తిస్తాయో తెలిసివుండాలి. చట్టాలన్నీ కార్మికవర్గానికి వ్యతిరేకమేనని, కార్మికులపై ఎక్కుపెట్టిన దాడి అని అన్ని చట్టాలనూ ఒకే గాటన కట్టి కొట్టిపారేసే ధోరణి మన కామ్రేడ్స్‌లో ఉంది. ఐతే రెండు తరహాల చట్టాలున్నాయని మనం గుర్తించాలి. ఒక తరహా చట్టాలు మన పోరాటాల ఫలితంగా వచ్చినవి. వాటి అమలుకోసం పోరాడాలి. ఆ చట్టాల అమలు సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ పర్యవేక్షిస్తూండాలి. ఇంకోవైపు కార్మికులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన చట్టాలపై పోరాటాలను నిర్మించాలి.

– కార్మికుల నడుమ సామాజిక సేవను, సహకారవ్యవస్థల కృషిని, సంక్షేమాన్ని మన కార్యకర్త విస్మరించకూడదు. అదేవిధంగా కార్మికుల సాంస్కృతిక అవసరాలను ఎన్నడూ నిర్లక్ష్యం చేయకూడదు. ఈ తరహా కార్యక్రమాలన్నీ ''సంస్కరణవాద'' కార్యక్రమాలుగా ముద్రవేసి పక్కనపెట్టే పొరపాటు ధోరణి ఇంకా కొందరిలో ఉంది. అది కూడదు. కార్మికులకు ఆరోగ్యకరమైన వినోదాన్ని అందించే కార్యక్రమాలను నిర్వహించడంద్వారా వారికి మంచి సాంస్కృతిక విద్యను అందించాలి.

– తాను నడిపే యూనియన్‌లో, సంబంధిత రంగంలో పనిచేసే కార్మికుల కులపరమైన, జాతి పరమైన పొందిక ఏ విధంగా ఉందో మన కార్యకర్తకు తెలిసివుండాలి. వారి కట్టుబాట్లు, సాంప్రదాయాలు తెలిసి వుండాలి. జీవితం పట్ల వారి దృక్పథం ఏమిటో తెలుసుకోవాలి. కులం, మతం, తెగ, భాష, జాతి ప్రాతిపదికన వారి నడుమ పెట్టుబడిదారులు సృష్టించే విభేదాల పట్ల అప్రమత్తతతో ఉండాలి.

– ఈ పెట్టుబడిదారీ పరిశ్రమలు కార్మికులశక్తిని పీల్చి పిప్పి చేస్తాయి. ఇందులో ఒక భాగంగా మారేందుకు వచ్చిన కార్మికుడు తన తెగ, కులం, గ్రామం, మతం–వీటికి సంబంధించిన విశ్వాసాలను, కట్టుబాట్లను, దృక్పథాన్ని తనవెంట తెస్తాడు. ఒక కొత్త వర్గదృష్టి అతనిలో పరిణతి చెందడానికి చాలా సమయం పడుతుంది. తన కుటుంబంలో ఏదైనా కష్టం వచ్చినప్పుడుగాని, అనారోగ్యం వచ్చినప్పుడు కాని తన కులం వైపు సహాయంకోసం చూడడం అతడికి మొదటినుంచీ ఉన్న అలవాటు. అందుచేత తనకు కష్టం వచ్చినప్పుడు సహాయం కోసం యూనియన్ వైపు చూసేకన్నా ముందు ''తనవాళ్ళ'' వైపు చూస్తాడు. అతడి ఈ సంబంధాలు ఎంతగా ప్రభావితం చేస్తున్నాయో మనం ముందు అంచనా వేయగలగాలి. ఆ సంబంధాలు ఇప్పుడు కొత్తగా ఏర్పడిన వర్గ సంబంధాలకు, విశ్వాసానికి ఏ విధంగా ఆటంకం అవుతున్నాయో పరిశీలించాలి. ఆ ఆటంకాలను అధిగమించడం ఎలా అన్నది మనం అవగాహన చేసుకోవాలి. తన కులం, మతం, జాతి పట్ల అతడికున్న విశ్వాసాలను వర్గదృక్పథం వైపు, వర్గ ఐక్యత వైపు, మొత్తంగా, దోపిడీకి గురవుతున్న కార్మికవర్గంగా

> “ ఫాక్టరీ చుట్టుపక్కల గ్రామాలు గనుక ఉన్నట్లైతే మన టి యు కార్యకర్త అక్కడి రైతాంగాన్ని గురించి తెలుసుకోవాలి. అక్కడ ఫాక్టరీలో పనిచేసే కార్మికులు గ్రామాల్లో నివాసం ఉ ంటారు. అక్కడ జరిగే సమ్మెలు, ఇతర పోరాటాలు అన్నీ నేరుగా చుట్టుపక్కటి రైతాంగంతో ముడిపడివుంటాయి. అందుచేత మన పోరాటాలకు ఆ రైతాంగంనుండి సహాయం పొందడమెలాగో మన కార్యకర్తకు తెలిసివుండాలి. ”

కార్మికసంఘాల ఐక్యతవైపు మళ్ళించాలి. ఆ క్రమంలో అతడు కులానికి, మతానికి, తెగకి, జాతికి అతీతంగా వర్గ ఐక్యతకోసం నిలబడేవాడిగా తయారుకావాలి.

– కార్మికులుగానే కాకుండా మహిళలుగా కూడా ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఎదుర్కుంటున్న సమస్యలపై మన టియు కార్యకర్త ప్రత్యేకశ్రద్ధ వహించాలి. సమాన సనికి సమాన వేతనం, ప్రసూతి సెలవులు, శిశు సంరక్షణ ఏర్పాట్లు వంటి అంశాలను చేపట్టాలి. ఇక యువ కార్మికుల సంగతి చూస్తే వారి అప్రెంటిస్‌షిప్ కు సంబంధించిన చట్టాలపైన, వారి చదువుపైన, క్రీడలపైన (పనివేళల తర్వాత) దృష్టిపెట్టాలి.

– దోపిడీదారుడు తన స్వార్థం కోసం ఉద్యోగులకు వ్యతిరేకంగా నిరుద్యోగులను రెచ్చగొడతాడు, శతృత్వం సృష్టిస్తాడు. మనం దానిని తిప్పికొట్టేలా ఉద్యోగులకు, నిరుద్యోగులకు మధ్య ఐక్యతను పెంపొందించాలి.

– ఫాక్టరీ లోపల ధైర్యంగా, సమరశీలంగా, అప్రమత్తంగా, వివేకంతో వ్యవహరించగల కొత్త కార్యకర్తలను తయారుచేయడమెలాగో మనం నేర్చుకోవాలి.

– మన టియు కార్యకర్త ప్రజాసమూహంకన్నా ముందు పరిగెత్తకుండా ఉండడమెలాగో, అదే సమయంలో వారికన్నా వెనుకబడిపోకుండా ఉండడమెలాగో నేర్చుకోవాలి. ఇది అధ్యయనం ద్వారాను, అనుభవం ద్వారాను వస్తుంది. కొన్ని సందర్భాలలో అతను అనుభవం లేని ప్రజలను నిదానించమని చెప్పాల్సివుంటుంది. మరికొన్ని సందర్భాలలో వారిని సరైన పోరాటం వైపు నడిచేలా ప్రేరేపించాల్సివుంటుంది.

– ప్రజాఉద్యమాల్లో అనుసరించదగ్గ వివిధ ఎత్తుగడలగురించి మన టియు కార్యకర్త తెలుసుకునివుండాలి. గతానుభవాలనుండి వీటిని నేర్చుకొనవచ్చు. స్థానికంగా అనుసరించే పోరాట పద్ధతులను, వాటి పట్టువిడుపులను అతడు తెలుసుకునివుండాలి. సాధారణం సూత్రాలుగా మనం నేర్చుకునే పోరాట పద్ధతులు అన్ని సందర్భాలలోనూ యధాతథంగా వర్తించవని తెలుసుకోవాలి.

– ఫాక్టరీ చుట్టుపక్కల గ్రామాలు గనుక ఉన్నట్లైతే మన టి యు కార్యకర్త అక్కడి రైతాంగాన్ని గురించి తెలుసుకోవాలి. అక్కడ ఫాక్టరీలో పనిచేసే కార్మికులు గ్రామాల్లో నివాసం ఉంటారు. అక్కడ జరిగే సమ్మెలు, ఇతర పోరాటాలు అన్నీ నేరుగా చుట్టుపక్కటి రైతాంగంతో ముడిపడివుంటాయి. అందుచేత మన పోరాటాలకు ఆ రైతాంగంనుండి సహాయం పొందడమెలాగో మన కార్యకర్తకు తెలిసివుండాలి. అదేసమయంలో ఆ రైతాంగానికి మనం ఏవిధంగా సహాయపడగలమో తెలిసివుండాలి. చౌకగా భూమి, తక్కువ వేతనాలకే పని చేయడానికి శ్రమజీవులు దొరుకుతారు గనుక తేయాకు తోటలు, చెరుకు తోటలు, గనులు, వీటితో పాటు కొన్ని ఇతర ఫాక్టరీలను కూడా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పుతున్నారు. అక్కడ ట్రేడ్ యూనియన్ పోరాటాలు విజయం సాధించాలంటే రైతాంగం యొక్క సానుభూతి, మద్దత్తు చాలా కీలకం. అందుకోసం వారితో మనం సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవాలి.

–మన టియు కార్మకర్త మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం యొక్క స్థూల అవగాహన కలిగివుండాలి.

– మన టియు కార్యకర్త స్వయంగా ప్రజా సంస్కృతిని అలవర్చుకోవాలి. నమ్రతగా ఉండాలి. ప్రజలతో ఓపికగా వ్యవహరించాలి. యజమానులతో, అధికారులతో చర్చలు, సంప్రదింపులు జరిపేటప్పుడు కూడా చాలా మర్యాదపూర్వకంగా, హుందాగా వ్యవహరించాలి. అదే సమయంలో వర్గశత్రువుల పట్ల ఉండవలసిన అప్రమత్తత, పదునుగా, చురుకుగా స్పందించడం, పట్టుబట్టడం కూడా అవసరం. దురుసుగా వ్యవహరించడం వర్గపోరాటానికి ఉండకూడని లక్షణం.

– పైన చెప్పిన లక్షణాలున్నటువంటి కార్యకర్త తయారై, ధైర్యంగా కార్మికులతరపున మొనగాడుగా వ్యవహరించగలగాలి. సెక్టేరియన్ దృక్పథంతో దుస్సాహసికంగా నిర్ధారణలకు పోకుండా, సంస్కరణవాదంతో వ్యవహరించి పోరాటం పట్ల నమ్మకాన్ని కోల్పోకుండా సరైన పంథాను అనుసరించగలగాలి. అప్పుడే మనం మన కార్మికోద్యమాన్ని తిరిగి పునరుజ్జీవింపజేయగలుగుతాం. ప్రజల పోరాటాలకు నాయకత్వం వహించగలుగుతాం. ఆ ప్రజల, కార్మికుల డిమాండ్లను సాధించేవిధంగా పోరాట మార్గాన పయనించగలుగుతాం.

– మన కర్తవ్యాలను నెరవేర్చడంలో కీలకమైనది కార్మికవర్గ ఐక్యతను, కార్మిక సంఘాల మధ్య ఐక్యతను సాధించడం. దానితోబాటు శత్రువుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టడం కూడా అవసరం. ముందే చెప్పినట్టు కార్మికవర్గ పోరాటాల గురించి, అవి సాధించిన విజయాల గురించి, గుణపాఠాలగురించి మన కార్యకర్త తెలుసుకుని వుండాలి. దానితోబాటు పార్టీ, దాని నాయకత్వాన, దాని సలహాలతో నడిచే సంఘాలు ఏవిధంగా పని చేస్తున్నదీ తెలుసుకోవాలి. ఎక్కడెక్కడ అవి సరైన రీతిలో నడుచుకున్నదీ, ఎక్కడెక్కడ పొరపాట్లు జరిగినదీ తెలుసుకోవాలి.

– కార్మిక సంఘాలతో ఐక్యత కోసం కృషి చేసే సమయంలో ఆ సంఘాల స్వభావమూ, వాటి నాయకత్వాల వైఖరీ మనకు స్పష్టంగా తెలిసివుండాలి. దిగువనుంచి, పైనుంచి ఐక్యత కోసం కృషి చేసేటప్పుడు విధిగా పాటించవలసిన పద్ధతులు ఏవి, పాటించకూడనివి ఏవి అన్నది తెలిసివుండాలి.

– ఇప్పుడు మన పనిలో ఎటువంటి పొరపాట్లు దొర్లుతున్నాయి? ప్రజలతో సజీవ సంబంధాలను కొనసాగించలేకపోతున్నాం. ఫాక్టరీలలోపల పనిచేస్తూ కార్యకర్తలుగా పనిచేయగలవారు చాలా హెచ్చు సంఖ్యలో అవసరం. ఆ మేరకు లేనందున, మనకు సజీవ సంబంధాలు కొరవడినందున కార్మికులేం భావిస్తున్నారో మనం పసిగట్టలేకపోతున్నాం. నిర్దిష్టంగా వారి సమస్యలేమిటో గుర్తించలేకపోతున్నాం. అందుచేత పోరాటాలలో మనం ముందుండి

నడిపించాలని కార్మికులు కోరుకుంటున్నప్పుడు మనం వెంటవెంటనే స్పందించలేకపోతున్నాం. ఒక విస్తృత ప్రాతిపదికపైన మనం సరైన పద్ధతిలో టియు పనిని చేయడం, నివాస ప్రాంతాల్లో పని చేయడం జరగాలి. ఫాక్టరీల్లో ఒక గుర్తింపు పొందిన సంఘంగా పని చేయడం సాధ్యం కానపుడు కనీసం మన సంఘంలో కార్మికులు సభ్యులుగా చేరేటట్టు ప్రయత్నించాలి.

– ఉద్యోగులతోనే గాక నిరుద్యోగులతో కూడా సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకోవాలి. ఇందుకోసం ఆ యా ఫాక్టరీల కార్మికులు ఏయే ప్రాంతాల్లో నివసిస్తున్నారో ఆ ప్రాంతాల్లో కార్యకలాపాలు చేపట్టాలి.

– టియు కార్యకర్త ప్రతిరోజూ చేయవలసిన కనీసమైన పనులను నిర్దేశించుకోవాలి. ఆ పనులద్వారా కార్మికుల జీవితంలోని అన్ని పార్శ్వాలనూ మన కార్యకర్త స్పృశించగలగాలి. ప్రజలు ఏ సందర్భంలో ఏవిధంగా స్పందిస్తున్నారు, వారి దైనందిన డిమాండ్లేమిటి, సంక్షోభం కారణంగా వారు సరైన విధంగా ఆహారం పొందగలుగుతున్నారా లేదా...ఇటువంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోగలిగివుండాలి.

– ప్రతీ రంగంలోను, ప్రతీ పరిశ్రమలోను డిమాండ్లను జాగ్రత్తగా రూపొందించాలి. మన డిమాండ్లు అతిగా ఉండకూడదు.

– పోరాటానికి ముందు, తర్వాత కార్మికేతరుల అభిప్రాయాలను మనకు అనుకూలంగా మలచుకోవాలి. మునిసిపల్, విద్యుత్, ఇంటి పనివారు, రవాణా తదితర రంగాలలో ఇది ఇంకా ముఖ్యం. సమ్మె ఒక పూటకే పరిమితమా, ఒక రోజుకా లేక నిరవధికంగానా అన్నది కార్మికుల సన్నద్ధతను బట్టి, నాయకత్వం నడుమ ఉన్న ఐక్యతను బట్టి ఉంటుంది. కార్మికుల ప్రయోజనాలను

"టియు కార్యకర్త ప్రతిరోజూ చేయవలసిన కనీసమైన పనులను నిర్దేశించుకోవాలి. ఆ పనులద్వారా కార్మికుల జీవితంలోని అన్ని పార్శ్వాలనూ మన కార్యకర్త స్పృశించగలగాలి. ప్రజలు ఏ సందర్భంలో ఏవిధంగా స్పందిస్తున్నారు, వారి దైనందిన డిమాండ్లేమిటి, సంక్షోభం కారణంగా వారు సరైన విధంగా ఆహారం పొందగలుగుతున్నారా లేదా...ఇటువంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోగలిగివుండాలి."




పరిరక్షించడం అంటే వారిని పోలీసుల దమనకాండనుంచి, యజమానుల గూండాల దాడులనుంచి కాపాడడం కూడా. ఏవిధంగా అది నెరవేరుస్తామన్నది ఆయా పరిస్థితులను బట్టి, బాధలను తట్టుకుంటూ పోరాటాన్ని కొనసాగించడానికి ఏమేరకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నదానిని బట్టి ఉంటుంది.

– కార్మికుల టియు పోరాటాలు అక్కడి రైతాంగ పోరాటాలతోటి ఏవిధంగా సమన్వయం చేయగలమనేది ఆ ప్రాంతం, పరిశ్రమ, అక్కడ కార్మికులు, రైతాంగం ఏమేరకు సంఘటితంగా ఉన్నారు, వారి సైద్ధాంతిక సంసిద్ధత ఏ మోతాదులో ఉంది అనే వాటిని బట్టి ఉంటుంది.

– పని విధానానికి సంబంధించి ఎంత వివరంగా సూచనలు చేసినా వాటిని ఆచరణలో పెట్టగల నైపుణ్యం మన కార్యకర్తలకు ఏమేరకు ఉంది, వారి ప్రజా ఉద్యమ అనుభవం ఎంత అన్నదానిని బట్టి కార్మికోద్యమ నిర్మాణం, కార్మికవర్గ ప్రయోజనాలను పరిరక్షించడం ఆధారపడివుంటాయి.

❊

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**


'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం, డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఇంటర్వ్యూ

# రైతాంగ వ్యతిరేక చట్టాలతో బద్దలవుతున్న అసంతృప్తి

**పి. సాయినాథ్**



రచయిత ప్రముఖ పాత్రికేయులు

**రైతాంగానికి వ్యతిరేకమైన మూడు వ్యవసాయ బిల్లులను తీవ్రమైన గందరగోళం, నిరసనల మధ్య రాజ్యసభ ఆమోదించింది. ఈ ఏడాది జూన్‌లో జారీ చేసిన ఆర్డినెన్సుల స్థానంలో చట్టాలు చేశారు. వీటిని అంతకుముందే లోక్‌సభ ఆమోదించింది. ఈ మూడు బిల్లుల ఉద్దేశం వ్యవసాయ మార్కెట్లను సరళీకృతం చేయడం, మరింత సమర్ధవంతమైన విధానాల ద్వారా రైతులకు ఎక్కువ ధరలు లభించేటట్లు చేయడం. భారత రైతాంగాన్ని ఇప్పటికన్నా మెరుగైన స్థితిలో ఉంచటమేనని కేంద్రం చెబుతున్నది. అయితే దీనిపై పెద్దఎత్తున ప్రత్యేకించి పంజాబ్, హర్యానాలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లుల పట్ల ఎందుకు నిరసనలు వ్యక్తమవుతున్నాయి, వ్యవసాయ రంగంలో ఏ అంశాలను ప్రభావితం చేస్తున్నాయనే అంశంపై 'ది వైర్' పత్రికకు చెందిన మిథాలీ రాజ్ , 'ది హిందూ' పత్రిక గ్రామీణ వ్యవహారాల మాజీ సంపాదకులు పి.సాయినాథ్‌ను గత నెల 21వ తేదీన ఇంటర్వ్యూ చేశారు. ఇంటర్వ్యూలోని అంశాలను మీ ముందుంచుతున్నాం. – సంపాదకుడు**

---

**మిథాలీ రాజ్**: వ్యవసాయ బిల్లులపై మాట్లాడేందుకు అంగీకరించినందుకు ధన్యవాదాలు. వివాదాస్పదమైన మూడు వ్యవసాయ బిల్లుల్లో రెండింటిని రాజ్యసభ ఇప్పుడు ఆమోదించింది. ఇందులోని కీలకాంశాలు ఏమిటి? ఈ బిల్లులను సమర్ధించేవారు అందులో చెప్పుకోదగ్గ లోపాలేమీ లేవంటున్నారు. ముందుగా మొదటిదైన రైతుల ఉత్పత్తి, వర్తకం, వాణిజ్య ఆర్డినెన్సు లేదా కొందరు పిలుస్తున్నట్టు 'ఎపిఎంసి (వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటి) ఆర్డినెన్స్' గురించి, రైతాంగం దీని పట్ల వ్యతిరేకతతో ఉండడానికి గల కారణాలేమిటో వివరించండి.

**పి.సాయినాథ్**: వేటి ఆధారంగా ఈ మూడు బిల్లులను రూపొందించారో చాలా సంక్షిప్తంగా వివరిస్తాను. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఎపిఎంసి) చట్టంలోని దుర్మార్గమైన ఏకస్వామ్యాన్ని బద్ధలు చేయడానికి, ప్రజలను రక్షించేందుకు ఈ బిల్లు అని ప్రభుత్వం చెబుతున్నది. ప్రభుత్వం డిమానిటైజేషన్ చేసిన సమయంలో కూడా నేను ఇలాంటి మాటలే విన్నాను. ప్రజల రక్షణ మాట అటుంచి ఆరు నెలల తరువాత చేసిన తప్పులు కప్పిపుచ్చుకునే పనిలో పడ్డారు.

రైతులు గుత్తాధిపత్యానికి బానిస కాకుండా స్వేచ్ఛను ప్రసాదిస్తున్నామని ఎపిఎంసి బిల్లులో చెబుతున్నారు, అవునా? అయితే బిల్లు నిండా రాతపూర్వక ఒప్పందాల గురించే తప్ప తప్పనిసరిగా అమలు చేయాల్సిన వాటి ప్రస్తావన లేదు. నిత్యావసర వస్తువుల గురించిన ప్రస్తావన ఉంది. బడా వ్యాపారులు వాటిని ఎంతమొత్తమైనా నిల్వ చేసుకునేందుకు వీలుగా పరిమితుల్ని తొలగించారు.

ఇప్పుడు మొదటి అంశమేమంటే ఎపిఎంసి ప్రతి అంశాన్ని నియంత్రిస్తుందని, ఇది చాలా దుర్మార్గమైనదని చెబుతున్నారు. కాని అమ్మకానికి సిద్ధమైన వ్యవసాయ ఉత్పత్తులు ఎప్పుడూ ఎపిఎంసి గేట్ల బయట ఉంటాయి. ప్రాంతాల మధ్య తేడాలున్నప్పటికీ పెద్ద సం;ఖ్యలో రైతులు 'ముందుగా చేసుకున్న ఒప్పందాల' కారణంగా ఫారం గేట్ల బయట తమ ఉత్పత్తులతో పడిగాపులు కాస్తారు. షావుకార్లతో, కమీషన్ ఏజంట్లతో, పెద్ద రుణదాతలతో చేసుకున్న ఒప్పందాల వలన ఏదోవిధంగా తమ ఉత్పత్తులను వారికి కట్టబెట్టేందుకు సిద్ధపడతారు. ఎపిఎంసిలో లభించే కనీస మద్దతు ధర కూడా వారికి దక్కే అవకాశం లేదు.

వాస్తవానికి ఈ చట్టం ద్వారా ప్రభుత్వ ప్రమేయం లేని పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో పెరుగుతారు. ఎపిఎంసి వద్ద 98 శాతం కార్యకలాపాలు జరుగుతున్నాయని, దానిని బద్దలు కొడతామని మీరు చెబుతున్నారు. కాని మీరు వ్యవసాయ రుణభారాన్ని పరిష్కరించడం లేదు. రైతుల ఉత్పత్తిపై ప్రైవేటు లాభార్జనపరుల పట్టును తప్పించడం లేదు. ఇటువంటి పరిస్థితులలో ఎంతమంది రైతులు కనీస మద్దతు ధరలను పొందగలరు? ఎక్కువ మంది రైతులకు తమ ఉత్పత్తుల ధరలను నిర్ణయించుకొనే పరిస్థితి లేదు.

ఇలా ఎందుకు జరుగుతోంది? మిగిలిన రంగాల కంటే ఇది భిన్నమైనది కాదు. 1991 నుంచి సిద్ధాంతపరమైన అంశాలతో దీనిని ముందుకు తెస్తున్నారు. రైతుల నుంచి వ్యక్తమౌతున్న వ్యతిరేకత కారణంగా మాత్రమే ఆగింది. ఆసక్తికరమైన ఆంశమేమంటే లక్షలాది మంది రైతులు వ్యతిరేకిస్తున్నప్పటికీ రైతులకు ఇది మేలు చేకూరుస్తుందని మనకు చెబుతున్నారు – అది మరో విషయం.

మూడో అంశం ఇంతకు ముందు కూడా జరిగింది. నేనిక్కడ మహారాష్ట్రలో కూర్చుని ఉన్నాను. ఇక్కడకు వాషి ఎపిఎంసి పెద్దదూరంలో లేదు. ఈ తరహా విధానాలను కాంగ్రెస్ అనేక యేళ్ల క్రిందటే తీసుకువచ్చింది. మీరు ఎపిఎంసి రెక్కలు కత్తిరించి దాని అధికారాలు కొన్ని చదరపు గజాలకు పరిమితం చేస్తున్నారు. ఏ ప్రయోజనం ఆశించి ఇది చేస్తున్నారు? ఎందుకంటే పెద్దసంఖ్యలో కార్పొరేషన్లు, పెట్టుబడిదారులు పెట్టుబడులు పెడతారని, ప్రైవేటు మార్కెట్లు పెరగటం ద్వారా పోటీ పెరుగుతుందని చెబుతున్నారు. భారత కార్పొరేట్ రంగం ఎలాంటి పోటీని తట్టుకునేందుకు సిద్ధంగా

లేదు. ప్రజల ఆస్తులను ప్రభుత్వం అప్పనంగా మదతపెట్టి బహుమతిగా అప్పగిస్తే అమెజాన్ ద్వారా ఇంటిముంగిట అందుకునేందుకు సిద్ధంగా ఉంది.

కనుక ఈ తరహా ఎపిఎంసి నమూనా వల్ల వాషిలో ఏమీ జరగలేదు. కొత్తగా ప్రైవేటు మార్కెట్లు విస్తరించలేదు. బీహార్‌ను అతి పెద్ద ఉదాహరణగా చెబుతున్నప్పటికీ అక్కడ ఎలాంటి చట్టాన్ని అమలు చేయడం లేదు. అక్కడ ప్రైవేటు మార్కెట్లు మెరుగైన ధరలను కూడా ఇవ్వడం లేదు. కేరళలో ఎపిఎంసి లేదు, కాని ప్రైవేటు మార్కెట్లు కూడా లేవు. నేను చెప్పొచ్చేదేమిటంటే అక్కడ కార్పొరేట్ గొలుసు సంస్థలు ప్రత్యామ్నాయాలుగా లేవు.

కొద్దిసేపు ఎపిఎంసి చర్చను పక్కనపెట్టి ముందుకువెళదాం.

మరో ఆలోచన ఎక్కువ ధరలు సంపాదించడం గురించి. మీకు తెలుసు సైద్ధాంతికంగా, తాత్విక ప్రాతిపదకన చూస్తే ఈ కాలం చెల్లిన ఆలోచన గత 20 సంవత్సరాలుగా మనల్ని ఓలలాడిస్తూనే ఉంది. 'పేదలకు రాజ్యం సహకరిస్తే అది పౌరులను బానిసలుగా చేస్తుంది, ఫ్రీ మార్కెట్ స్వేచ్ఛతో కూడుకున్నది', అన్న ప్రచారం సాగుతూనే ఉంది. మిథాలీ, 'యదేచ్ఛగా ఉండే మార్కెట్ స్వేచ్ఛ'కు చిహ్నమైతే, మిగిలిన రంగాల్లో ఇది ఎలా పనిచేస్తున్నదో గమనించు. ఆరోగ్యరంగంలో చూస్తే కోవిడ్ 19 మహమ్మారి సమయంలో ఈ గ్రహంలో మనదేశం ఎదుర్కొన్నంత దుర్భరస్థితి ఎక్కడా లేదు. రోజుకు 90–98,000 కేసులు వస్తుండగా, 50 లక్షల మందికి పైగా ఈ వైరస్ బారినపడ్డారు. ఈ అంచనాలు, అంకెలూ అన్నీ తప్పుల తడకలే. మీ రాపిడ్ యాంటీజెన్, ఆర్‌టి–పిసిఆర్ టెస్టులు అన్నీ తప్పులే. నేను ముంబయిలో కూర్చుని ఉన్నాను. ఇక్కడకు ఐదు నిమిషాల నడక దూరంలో లేదా ఐదు నిముషాలు కారు డ్రైవ్ చేసుకుని వెళ్లేంత దూరంలో మూడు ఫైవ్‌స్టార్ ఆస్పత్రులున్నాయి. కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్న ఈ ఆస్పత్రుల్లో కోవిడ్–19 పరీక్షలు 6,500 రూపాయలకు తగ్గకుండా పదివేల రూపాయల వరకు ఖర్చవుతున్నది.

ఇప్పుడు ఆరోగ్యరంగంలో ఈ అంశాలను గుర్తించి, కార్పొరేట్ల నుండి విముక్తి కలిగించామా? గత యేడాది బడ్జెట్‌లో ప్రభుత్వం జిల్లా స్థాయి ఆస్పత్రులను, జిల్లా కేంద్రంలో ఉండే ఆస్పత్రులను ప్రైవేటు యాజమాన్య నిర్వహణకు అప్పగించింది. అమెరికాలో జరుగుతున్న మాదిరిగా పేదరికంలో ఉన్న మన ప్రజలు పేదలకు మరింత దయనీయమైన, దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కోవటానికి ఇది దారితీస్తుంది.

'స్వేచ్ఛా మార్కెట్‌లో ఉండే స్వేచ్ఛ'లోని పరమార్థం ఇదే. ఇప్పుడు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలైన ఐర్లాండ్, స్పెయిన్‌లలో మహమ్మారి పేట్రేగిన తొలివారంలో ఏం చేశారు? ఆరోగ్యరంగం మొత్తాన్ని జాతీయం చేశారు. ప్రైవేటు చేతుల్లోని ఆరోగ్య రంగానికి సంబంధించిన ప్రతి అంశాన్ని జాతీయం చేశారు. మనమేం చేశాం? ఢిల్లీ ప్రభుత్వం కార్పొరేట్ రంగాన్ని ఎక్కువ సంఖ్యలో పడకలు కేటాయించమని కోరడానికి రెండు నెలలు పట్టింది. దానికి ముందే మహారాష్ట్ర ప్రభుత్వం 80 శాతం పడకలు ఈ అవసరానికి వినియోగిస్తున్నామని చెప్పింది. ఇది ఇక్కడ తేడా. మీరు వాస్తవాన్ని చూడడం లేదు. ఇక్కడ మీ తాత్వికత (వ్యవసాయ బిల్లులు) (ఆరోగ్యరంగం కంటే) ప్రత్యేకంగా లేవు. దాన్నే విద్యారంగంలో కూడా అనుసరించాలని అనుకుంటున్నారు.

**మిథాలీ:** ఎపిఎంసి మీద మీరు చెప్పింది ముగిస్తాను. ఎందుకంటే ప్రజలు వాటి ఫలితాలను అర్థం చేసుకోవడం లేదని నేను భావిస్తున్నా. మీరు చెప్పిన దాని ప్రకారం మొదటిది గుత్త పెత్తనం పెరిగి పెద్ద కార్పొరేట్లు ధరలను తగ్గిస్తారనే భయం. రెండోది బీహార్ అనుభవం– స్థిరీకరణకు బదులుగా ప్రైవేటు మండీలు పెద్ద సంఖ్యలో వస్తాయి. ధరల్లో తీవ్రమైన అస్తవ్యస్త స్థితి ఉంటుంది, ఇది రైతులకు నష్టం అవునా?

**సాయినాథ్:** మహారాష్ట్రలో గత నెలలో ఎపిఎంసిల బయట మొత్తంగా ఏం జరిగిందో చూద్దాం. పాలవ్యాపారాన్ని పరిశీలిద్దాం. పాలవ్యాపారంలో అందరూ పెద్ద కొనుగోలుదారులే, ప్రైవేటువారే. అందులో ఒకటే రాష్ట్రానిది, మిగిలిన వ్యాపారులంతా బాగా లాభపడ్డారు. మహమ్మారి ఆరంభ దినాల్లో ముంబయిలో నేనున్న ప్రాంతంలో మేము ఆవుపాలు 48 రూపాయలు చెల్లిస్తే, గేదెపాలకు 60 రూపాయలు చెల్లించాం.

లీటరు ఆవుపాలకు చెల్లించిన 48 రూపాయల్లో మహారాష్ట్రలోని రైతుకు లభించింది 30 రూపాయలే. గేదెపాలకు 60 రూపాయలు వసూలు అది కూడా 2018–19 కాలంలో రైతులు పెద్దఎత్తున పోరాడిన ఫలితంగానే వచ్చాయి. మహమ్మారి ప్రారంభమైన నెలరోజుల్లోనే రైతులు లీటరుకు 17 రూపాయలు మాత్రమే పొందారు. వినియోగదారులు మాత్రం గతంలో మాదిరిగానే లీటరుకు 48, 60 రూపాయలు చెల్లిస్తున్నారు.

ఇక్కడ ఎపిఎంసిలు రైతును ఖైదీగా పట్టుకోవడం లేదు, ధరను అదుపుచేసే ప్రయత్నం చేయడం లేదు. ఎపిఎంసిలలో అనేక లోపాలు ఉన్నాయి. అది మరో చర్చ. ఇక్కడ పూర్తిగా ప్రైవేటు వ్యాపారులు కార్యకలాపాలు నిర్వహించారు. ఫలితంగా రైతులు 50 శాతం, 30 రూపాయలలో 45 శాతం ఆదాయం కోల్పోయారు. మీరు టెలివిజన్‌లో గమనిస్తే కొన్ని ఛానళ్లు ఆగస్టులో రైతులు ఆందోళన చేసి, రోడ్లపై పాలను పారబోయటాన్ని పట్టించుకున్నాయి. ఇందులో ఎపిఎంసి విలన్ పాత్ర ఎక్కడ పోషించిందో చెప్పండి? రెండో అంశం ఎక్కువ కార్యకలాపాలు ఎపిఎంసి బయటే జరిగాయి. కానీ మీరు చెబుతున్నదేమిటంటే " కాదు కాదు, ఎపిఎంసి కూడా అక్కడ ఉందంటున్నారు." నిజమే ఎలాగంటే విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్న విధంగానే. మీరు వాటిని మెరుగుపరచడానికి ఎలాంటి ప్రయత్నం చేయరు. ప్రైవేటురంగం మరింతగా ఎదగడానికి కావలసిన సకల సదుపాయాలను సమకూరుస్తారు. ఫలితంగా ఈవేళ పిల్లలు ఏవైపు పయనిస్తున్నారో, వారి స్థితి ఏమిటో తెలుస్తున్నది. పిల్లల మధ్య స్పష్టమైన డిజిటల్ చీలిక గురించి తరచుగా మాట్లాడుకుంటూ ఉండేవారం. ఇపుడు డిజిటల్ విభజన తీవ్రమౌతున్నది. ప్రస్తుత విద్యా ప్రక్రియ కారణంగా పేదల పిల్లలు పూర్తిగా నష్టపోతున్నారు.

వ్యవసాయ బిల్లులను అదే తాత్వికతతో తీసుకురావద్దని మరోసారి చెబుతున్నాను. 28 యేళ్ల నుంచి సాగుతున్న దానివల్లే చెప్పలేనంత నష్టం వాటిల్లింది. మరోసారి విద్యారంగం గురించి ప్రస్తావిస్తాను. గత కొన్ని నెలల్లో కార్పొరేట్ విద్య ఎలా పెరిగిందో చూడండి. బైజూస్ రెట్టింపయింది. యేడాది కాలంలో 550 కోట్ల డాలర్ల నుంచి 1,050 కోట్ల డాలర్లకు పెరిగింది. మహమ్మారి కాలంలోనే ఇది జరిగింది.

ఇప్పుడు దేశంలోని లక్షలాది మంది పాఠశాలలకు వెళ్లే ఆడపిల్లలను గమనిస్తే 15 యేళ్ల లోపు వారిలో ఎంతమందికి స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి? బెంగాల్‌లో పరిస్థితి నేను చెప్పగలను, ఒక్కరికి కూడా ఆ పరిస్థితి లేదు. మహారాష్ట్రలో పరిస్థితిని గమనిస్తే ఆడపిల్లలు ఇటుక బట్టీలో పనిచేసే తమ 17 సంవత్సరాల సోదరుని రాక కోసం ఎదురుచూడాలి. శని, ఆదివారాలు వారు వచ్చిన తర్వాత పిడిఎఫ్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందుకు వారు ఎక్కువ ప్యాకేజీ తీసుకోవాలి. చౌకగా లభించే ప్యాకేజీకి 200 రూపాయలు చెల్లిస్తే రోజుకు 2 జిబి ఉపయోగించుకోవచ్చు. పాఠ్యపుస్తకాలలోని సమాచారం అంతా పిడిఎఫ్‌ల ద్వారా తీసుకోవాలంటే ఎక్కువ మొత్తం చెల్లించాలి.

కుటుంబం మొత్తం ఎలాంటి పని, ఆదాయం లేకుండా ఇంటి దగ్గర కూర్చున్న పరిస్థితిలో ఈ ఖర్చులు చేయలి. కార్పొరేట్ రంగంలోని ఆరోగ్య, విద్యారంగాల్లో ఇటువంటి దుష్పరిమాణాలను చూస్తూ వ్యవసాయరంగంలో అత్యద్భుత ఫలితాలు సాధించగలమా?

**మిథాలీ:** రెండో అంశంలో కొస్తాను సాయినాథ్, వ్యవసాయ పంటలకు మద్దతు ధరలకు సంబంధించి రైతులకు మద్దతు ధర ఇస్తామని, ప్రభుత్వం అందుకు కట్టుబడి ఉన్నదని ప్రధానమంత్రి చెప్పారు. నాకున్న సమాచారం మేరకు శాంతకుమార్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా భారతదేశంలో 6 శాతం మంది రైతులు మాత్రమే మద్దతు ధర పొందుతున్నారు. ఆ కారణంగానేనా పంజాబ్, హర్యానా రైతుల్లో వీధుల్లోకి వచ్చింది?

**సాయినాథ్:** కాదు, అది తక్షణ స్పందన. అయినా అనేక సమస్యలు ఉన్నాయి. వారు ఎపిఎంసిలు, మద్దతు ధరల విషయంలో ఎక్కువ ఆందోళన పడుతున్నారు. మిథాలీ మీరు శాంతకుమార్ కమిషన్ గురించి ప్రస్తావించారు. కానీ తరువాత వచ్చిన స్వామినాథన్ కమిషన్ మరింత ప్రాతినిధ్యం గల సంస్థ. అది కేవలం స్వామినాథన్ కమిషన్ కాదు, రైతుల జాతీయ కమిషన్, దానికి ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ అధ్యక్షుడుగా పనిచేశారు.

ఈ విషయంలో ప్రధానమంత్రి మాటలకున్న విశ్వసనీయత ఎంతో చూద్దాం. గత ఆరు సంవత్సరాల మద్దతు ధర పరిస్థితి గుర్తుచేసుకుందాం. ఈ విషయమై నేను ఎన్నోమార్లు ప్రస్తావించాను. ప్రభుత్వం, వ్యవస్థ మాత్రమే కాదు మీడియా అజ్ఞానంతో, వారి స్వప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు.

నిజానికి వారేం చేస్తున్నారు? ఆ నిర్ధారణకు రావాలంటే గతంలో వారేం చేశారో పరిశీలించాలి. 2014కు ముందు జరిగిన ఎన్నికల సమయంలో భారతీయ జనతా పార్టీ, ఎన్‌డిఎ తమ ఉపన్యాసాల్లో స్వామినాథన్ కమిటీ సిఫారసులను ప్రత్యేకించి ఉత్పత్తి ధరకు 50 శాతం కలిపి ఇస్తామని, 12 నెలల్లో ఈ హామీ నేరవేరుస్తామని, నెలలోపే చేస్తామని కొన్ని చోట్ల హామీలిచ్చారు. స్వామినాథన్ కమిషన్ ఉత్పత్తి విలువకు సంబంధించి ఉత్పత్తి వ్యయానికి సంబంధించి సివోపి2+50 అమలుచేయాలని చెప్పింది.

వారు 12 నెలల కాలంలో ఏం చేశారు? వాటిని అమలుచేయడం ఆచరణ సాధ్యం కాదని, దాని వలన మార్కెట్ ధరలు వక్రీకరణకు గురవుతాయని కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. వారిచ్చిన హామీతో ప్రజలు అధికారం కట్టబెడితే కోట్లాది మంది రైతుల ఓట్లతో ఆ హామీపై గెలిచి కోర్టుల్లో దానికి వ్యతిరేకంగా అఫిడవిట్లు దాఖలు చేశారు. 'రైతుల జీవితాలు ధ్వంసం వారికి అనవసరం. మార్కెట్ ధరలను రైతులెలా వక్రీకరిస్తారో ప్రస్తావించకుండా' కోర్టులో అఫిడవిట్లు దాఖలు చేశారు. అది 2015.

2016లో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్ ఈ నిర్ణయాలన్నీ తీసుకున్నారు. మీ క్యాబినెట్‌లోని ఎక్కువ మంది మంత్రులకు పెద్దగా విలువ లేదు. ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి పేరు ఎంతమంది ఎడిటర్లకు తెలుసు? కొద్ది రోజుల క్రితం ఒక పెద్ద టివి ఛానల్‌లో బిజెపి అధికార ప్రతినిధి మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి పేరు చెప్పలేకపోయారు. ఆయన మాజీ వ్యవసాయశాఖ మంత్రి రాధా మోహన్‌సింగ్ పేరు ప్రస్తావించారు. ప్రస్తుత మంత్రి (నరేంద్ర సింగ్ తోమర్) పేరు చెప్పలేదు అవునా? ఇది ప్రస్తుత రాజకీయాల్లో ఉన్న విచిత్రమైన స్థితి.

2014లో "పన్నెండు నెలల్లో మేం స్వామినాథన్ సిఫారసులు అమలుచేస్తాం"అని చెప్పారు. 2015లో "వాటిని అమలు చేసి మేం మార్కెట్ ధరలను అస్తవ్యస్తం చేయలేం" అని కోర్టులో అఫిడవిట్ వేశారు. "మేం అటువంటి హామీ ఏదీ ఇవ్వలేదు" అని 2016లో రాధామోహన్ సింగ్ అన్నారు. 2017లో రాధా మోహన్ సింగ్ మాట్లాడుతూ "ఈ స్వామినాథన్ కమిషన్ గురించి మర్చిపోదాం, మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్ నమూనా స్వామినాథన్ కమిషన్ కంటే మెరుగైంది" అని చెప్పారు. అనంతరం జరిగిన మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఏం ఫలితాలు వచ్చాయో మీకు తెలుసు వాటి జోలికి నేను వెళ్లడం లేదు. ఆ మధ్యకాలంలో ఈ ప్రకటనలన్నింటి మధ్య ఐఐసిలో జరిగిన ఒక పుస్తక ప్రారంభ సమావేశంలో ఇతర అంశాలతో పాటు మధ్యప్రదేశ్ నమూనా గురించి మేధావులు పొడిగారు. అప్పటికి వారం రోజుల ముందు మందసౌర్‌లో ఐదుగురు రైతులను కాల్చి చంపారు.

2018-19 బడ్జెట్‌లో ఆర్థిక బిల్లుపై అరుణ్ జైట్లీ చేసిన ప్రసంగంలోని 13, 14 పేరాలను చూడండి. మీ సమయాన్ని వృధా చేయను. 14లో పన్నెండు నెలల్లో అమలుచేస్తాం, 15లో సాధ్యం కాదు, 16లో అసంబద్ధమైంది, ఆ హామీ మేం ఇవ్వలేదు, 17లో మధ్యప్రదేశ్ అంతకంటే ముందుంది; 18-19 బడ్జెట్ ప్రసంగంలో మేం స్వామినాథన్ సిఫారసులు అమలు చేసేశాం. జైట్లీ చివరి ఉపన్యాసంలోని 13-14 పేరాలు "మేం ఇప్పటికే రబీ పంటకాలంలో అమలు చేశాం, ఖరీఫ్ పంటకాలంలో అమలుకు సిద్ధమవుతున్నాం."

ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తోమర్, సంపాదకులకు, యాంకర్లకు కూడా ఆయన పేరు తెలియదు, ఆయన అంత ప్రాముఖ్యం గలవాడు కూడా కాదు. ఇప్పుడు 2020లో పార్లమెంటులో అంత యుద్ధం జరుగుతుండగా " స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేసింది మా పార్టీయే, మేం మాత్రమే ప్రజల పక్షాన నిలిచి సిఫారసులు అమలు చేసి ప్రజలకు మద్దతు ధర ఇచ్చాం" అని చెప్పాడు.

2017లో వారి ఎత్తుగడ ఏమిటంటే 'ఉత్పత్తి వ్యయం' నిర్వచనం. విభిన్న పద్ధతుల్లో ఉత్పత్తి వ్యయాన్ని విశ్లేషిస్తారు. ఎ2 కేవలం దిగుమతి ధర అంతకు మించి మరేమీ కాదు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొనుగోలుకు అయ్యేది. మరొక పద్ధతి ఎ2+ఎఫ్ఎల్ కొంత మెరుగైనది. దీనిలో వ్యవసాయానికయ్యే ఖర్చుతో పాటు వ్యవసాయ కూలీల వేతనాలనూ కలిపి చూస్తారు. స్వామినాథన్ కమిషన్ ఈ రెండు పద్ధతులను ఎన్నడూ సూచించలేదు. అది వ్యవసాయ కూలీలకు అయ్యే వ్యయం, భూమికౌలు,ఇతర ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకుని, సివోపి2+50 విధానాన్ని, మొత్తం ఉత్పత్తి వ్యయంతో 50 శాతాన్ని అదనంగా కలిపి సమగ్రంగా ఉత్పత్తి వ్యయంగా పరిగణించింది.

ఎ2కు సివోపి 2+50కి మధ్య క్వింటాలుకు 800 రూపాయలు వ్యత్యాసముంటుంది. ఎ2+ఎఫ్ఎల్‌కు సివోపి2+50కి మధ్య క్వింటాల్‌కు 500 వ్యత్యాసం ఉంది. దీనిని ప్రభుత్వం అర్ధమనస్కంగా అమలు చేసి తాము అమలుచేసినట్లు జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించాడు.

మొత్తానికి నేను చెప్పవచ్చేదేమంటే అతి స్వల్పసంఖ్యలో రైతులు మాత్రమే కనీస మద్దతు ధర పొందే వీలున్నది. అందుకే నేను ప్రతిసారీ చెప్పేది ఒక్కసారి రికార్డులు పరిశీలించండి, జర్నలిస్టుగానే కాదు జాతీయస్థాయిలో రైతుల కోసం పనిచేసేవారిలో ఒకడిగా మన ముందున్న అనేక డిమాండ్లు, అనేక సమస్యలను పరిశీలించండి. "మనిషి రోగంతో ఉన్నాడు, అతన్ని చంపేయండి" అని ఎపిఎంసి, లేదా కనీస మద్దతు ధర గురించి గురించి చెబుతున్నారు. కానీ చేయాల్సింది వాటిని అందుబాటులో ఉంచండి. ఇప్పుడు రైతులు ఏం కోరుకుంటున్నారు? ధరకు హామీ, స్థిరత్వం అంతే కదా? వారిపై మీరేం రుద్దుతున్నారు? పదమూడు రోజుల్లో 30 రూపాయల నుంచి 17 రూపాయల పాల ధర తగ్గించటం లాంటి మతిలేని అస్థిరత్వం తెస్తున్నారు. ఎపిఎంసి గురించి



బిజెపి ప్రభుత్వం తెచ్చిన రైతాంగ వ్యతిరేక చట్టాలకు నిరసనగా ఢిల్లీలో జరిగిన భారీ ప్రదర్శన

చెబుతున్న విషయాలకు దీనికి సంబంధం ఏమిటి?

ఇప్పుడు ఏం జరుగుతుంది? వారు పూర్తిగా కార్పొరేట్ అనుకూలురని స్పష్టమవుతోంది. కానీ వారు ఊహించిన విధంగా వాస్తవంలో జరిగే అవకాశం లేదు. మధ్యదళారీల పట్టు మరింతగా బిగుసుకుని దుర్భర పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. రైతులకు ఇప్పటివరకు ఉన్న అవకాశాలు తగ్గిపోతాయి. ఎక్కువమంది రైతులు ఎటువంటి రక్షణ లేకుండా పెద్దఎత్తున ప్రైవేటు వారితో వ్యవహరించాల్సి వస్తుంది. వాషి ఉదాహరణ తీసుకుందాం. అన్నీ తాంబూలంలో పెట్టి అందుకోవచ్చునుకుంటే తప్ప ప్రైవేటు వారు ముందుకు రారు.

**మిథాలీ:** సాయినాథ్ ప్రభుత్వం రైతుకంటే వినియోగదారునే ఎంచుకున్నదనేది స్పష్టం. ఒకరకంగా చెప్పాలంటే కనీస మద్దతు ధర రెండు పార్టీల మధ్య ఒక అపనమ్మకాన్ని సృష్టించింది. మీరు చెప్పినట్టుగా రైతులు ఆందోళనకు దిగడం తొలిసారి కాదు. ముంబయి వీధుల్లో వారు కదం తొక్కడం, పాల నిరసనలు మనం చూశాం. ఇపుడు పంజాబ్, హర్యానాల్లో పెద్ద సంఖ్యలో ఆందోళనలు సాగుతున్నాయి, అవి దక్షిణాదికి విస్తరిస్తున్నాయి.వాస్తవంగా చెప్పాలంటే వీటివల్ల ఏమవుతుంది? ఒక్కమాటలో చెప్పాలంటే మెజారిటీ ఉన్నది కనుక వారనుకున్నది చేయవచ్చు, ప్రభుత్వం మూడో బిల్లుపై వెనక్కు పోతుందా? దీనిపై ఒక సూచన ఉంది. ఎలాంటి ఒప్పందానికైనా కనీస మద్దతు ధర తప్పనిసరి అని చేర్చడం. వారు ఆ లైను చేరుస్తారని అనుకుంటున్నారా? మీకు తెలుసు ఈ ప్రభుత్వం బలవంతంగా తాను అనుకున్నది సాధిస్తుంది. కనీస మద్దతుధరకు హామీ ఇవ్వడం, మరొకటి రైతుల రుణాలను మాఫీ చేయడం. ఈ రెండు బిల్లులు ప్రైవేటు బిల్లులుగా ఉన్నాయి. వారనుకుంటే ఈ రెండూ చేయగలరు.

**సాయినాథ్:** మిథాలీ, ప్రభుత్వం అన్ని వేళలా వినియోగదారులకు అనుకూలంగా ఉంటుందని అభిప్రాయంతో నేను విభేదిస్తాను. అది వాస్తవం కాదు. అది కార్పొరేట్ ప్రపంచానికి మాత్రమే అనుకూలం. దయచేసి ఒక్కవిషయం మర్చిపోవద్దు. 14 కోట్లమంది రైతుల్లో 9.5 కోట్లమంది పూర్తికాలం రైతులు అని 2011 లెక్కలు చెబుతున్నాయి. వారు వినియోగదారులు కూడా. భారతీయ రైతుల్లో 70 శాతం మంది ఆహారధాన్యాలను మార్కెట్‌లో కొనుగోలు చేసేవారే.

ఆహార పదార్థాల అధిక ధరలు వీరికి మేలు కలిగించడం లేదు, నిజానికి రైతులకు నష్టం చేకూరుస్తున్నాయి. కిరాతక ధోరణి, అసమానత్వం, అసమానత్వాన్ని మరింతగా ప్రోత్సహించడం, అసమానత్వానికి పట్టం కట్టే సామాజిక వ్యవస్థలో మనం ఉన్నామని కోవిడ్-19 మహమ్మారి స్పష్టం చేసింది.

మార్చి 26న నిర్మలా సీతారామన్ మాట్లాడిన అంశంపై నేను ది వైర్‌లో రాశాను - అది పారిలో కూడా వచ్చింది - అందులో నేను ప్రతి భారతీయ రైతు ఈ సీజన్‌లో, వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఆహారపంటల వైపు దృష్టి సారించమని కోరాను. ఎందుకంటే 70 శాతం రైతుల ఆహార భద్రతపై నేను ఇప్పటికి కూడా భయపడుతున్నాను. గత 25-30 సంవత్సరాల నుంచి ఎక్కువమంది రైతులను ఎక్కువ వ్యయమయ్యే వాణిజ్యపంటల వైపు మొగ్గు చూపే విధంగా వత్తిడిచేసి, భయపెట్టారు, బలవంతపెట్టారు.

ఇప్పుడు రబీలో వాణిజ్యపంటలను ఎక్కువమంది విపరీతంగా పండించారు. పత్తి దిగుబడి చాలా ఎక్కువగా ఉంది. చెరకు పంట దిగుబడి కూడా అధికమే. ప్రస్తుతం ప్రపంచంలో ప్రజల ఆదాయాలు పడిపోయాయి, వినియోగం కూడా పడిపోయింది. వాటిని ఎవరు కొంటారు? ప్రపంచ కార్మికసంస్థ చెప్పిన దాని ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఆదాయాలు 60 శాతం తగ్గిపోయాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇది ఇంకా ఎక్కువ ఉంటుందని నేననుకుంటున్నా.

రబీ పంటలో ఉత్పత్తి పెరుగుదల రైతులకు సంక్షేమాన్ని కలిగిస్తుందా అనే ప్రాథమిక తాత్విక అంశానికి స్వేచ్ఛా వ్యాపారులు ఎవరూ సమాధానం చెప్పరు. ఎందుకంటే వారి అందాల హర్మ్యం కూలిపోవడాన్ని ఒప్పుకోరు. ఇప్పుడు మనకు మహారాష్ట్రలో జులై ఆఖరు నాటికి 30 లక్షల క్వింటాళ్ల

అమ్మకం కాని పత్తి, లక్షల టన్నుల అమ్మకం కాని చెరకు ఉంది. ఖరీఫ్‌లో రైతులు మళ్లీ అవే పంటలు వేస్తారు. అక్టోబరు, నవంబరు నాటికి మనం పత్తి, చెరకుతో మునిగిపోతాం. వాటిని మనం ఎక్కడ అమ్మాలి? వాటిని ఎవరు కొంటారు?

ఈ వ్యవసాయ బిల్లుల్లోని మరో అద్భుతమైన అంశం ఒక రైతు తన పంటను తనకు ఇష్టమైన చోట ఎక్కడైనా అమ్ముకోవచ్చు. మళ్లీ స్వేచ్ఛా మార్కెట్ బానిసత్వాన్ని తెస్తున్నారు. ఈరోజు లక్షల సంఖ్యలో వలస కార్మికులుగా ఉన్నవారి శ్రమను ఎక్కడైనా అమ్ముకోవచ్చంటున్నాం. వారి శ్రమను ఎవరు కొంటారు? ముప్పైయేళ్ల క్రితం ప్రజలు ముంబయి వచ్చి మిల్లుల్లో, పారిశ్రామిక వాడల్లో పనిచేసేవారు. ఈరోజు వారు ముంబయి వచ్చేది మీ ఇంట్లో పనివాడిగా చేయడానికి, నిజమేనా? రైతు పరిస్థితి కూడా అంతే. అతను విముక్తమవుతాడు. ఆమె విముక్తమవుతుంది. ఎక్కడికి వెళ్లాలి, ఎందుకు వెళ్లాలి? నిజమే వారికి ఎక్కడ మంచి ధర లభిస్తే అక్కడకు వెళ్లవచ్చు. కన్యాకుమారిలోని రైతు తన ధాన్యానికి మధ్యప్రదేశ్‌లో ఎక్కువ ధర లభిస్తుందని తెలిస్తే ఎడ్లబండిపై సాయంత్రానికి అక్కడకు చేరుకోగలడా? దీనివల్ల ప్రయోజనం ఎవరికి కలుగుతుందో మీకు తెలుసు.

**మిథాలీ:** నేను వలస కార్మికుల సమస్య గురించి కూడా ప్రస్తావించాలనుకున్నా. సాయినాథ్ మీరు గ్రామీణ వ్యవస్థ కార్యకలాపాలపై మరింత వివరంగా చెప్పగలరు. ఇటీవల కాలంలో గ్రామీణ ఆర్థికవ్యవస్థలో పెనుమార్పు వచ్చిందని, ఫలితంగానే ద్విచక్రవాహనాల సంఖ్య పెరిగిందని, సిమెంటు అమ్మకాలు పెరిగాయని మీడియా ప్రచారం చేస్తున్నది. అందులో నిజముందా? వాస్తవంలో గ్రామీణ రైతుల పరిస్థితి ఏమిటి? ఎందుకంటే 2006 నుంచి ఎన్‌ఆర్‌ఈజిఎలో పాల్గొనేవారి సంఖ్య బాగా పెరిగింది. ఏదోఒక పని దొరికితే ఏదోవిధంగా జీవనం సాగించాలనే వారిసంఖ్య పెరుగుతున్నదా?

**సాయినాథ్:** ఎన్‌ఆర్‌ఈజిఎ అంకెలు నిరాశను ప్రతిబింబిస్తున్నాయని నువ్వు చెప్పావు. అంకెలు అసమానతలను ప్రతిఫలిస్తున్నాయి. 2 కోట్ల మంది తిరిగి వెళ్లారు. వలసలపై, చావులపై వివరాలు లేవని ప్రభుత్వం చెబుతోంది. మొదట ప్రభుత్వం మే 1 నుంచి 26 వరకు 91 లక్షల మంది ప్రజలు శ్రామిక రైళ్లలో ప్రయాణించారని చెప్పారు. అప్పటికి మే నెలలో ఇంకా ఐదురోజులు మిగిలివున్నాయి. వలస కార్మికుల మరణాల గురించి రాష్ట్రాల నుంచి సమాచారం సేకరిస్తున్నామని ఇప్పుడు నరేంద్ర సింగ్ తోమర్ చెబుతున్నారు.

కానీ రైల్వే మంత్రిత్వ శాఖ మే 27న ఇచ్చిన సమాచారం ది వైర్‌తో పాటు మీడియాలో కూడా వచ్చింది. మార్చి 25 నుంచి మే 1 వరకు తొలి 26 రోజుల్లో రైళ్లు, శ్రామిక రైళ్లూ లేవు. ప్రజలు నడిచి వెళ్లడం, బస్సులలో వెళ్లడం మొదలయింది. కాబట్టి ఆసంఖ్య రెండుకోట్లు కాదు సరేనా? అంతకు మించి ఉంటుంది.

గ్రామీణ ప్రాంతం నుంచి మెట్రో నగరానికి లేదా పట్టణానికి వస్తే వారిని వలస కార్మికులని వారి గురించి మీడియాలో చాలా తప్పుగా వార్తలు వస్తున్నాయి. అనేక రకాల వలసలున్నాయి. అందుకు సంబంధించిన గణాంకాలు చూస్తే తెలుస్తాయి. గ్రామీణ ప్రాంతం నుంచి గ్రామాలకు వలసలున్నాయి. అది చాలా పెద్ద సంఖ్యలో ఉంది. పంటల కాలంలో జార్ఖండ్, బీహార్‌ల నుంచి పంజాబ్‌కు లక్షల సంఖ్యలో రైతులు వలస వెళతారు. అనేకమంది సరిహద్దులు దాటకుండా రాష్ట్రంలోనే ఇతర ప్రాంతాలకు వెళతారు. ఇటుకల తయారీ సీజన్‌లో తమిళనాడులోని పుదుకొట్టై నుంచి తంజావూరుకు తరలివెళతారు. గ్రామీణ ప్రాంతం నుండి గ్రామాలకు వలసలు వెళ్ళే వీరందరూ లాక్‌డౌన్ సమయంలో ఎక్కడికక్కడ నిలిచిపోయారు. మరో అంశమేమంటే పట్టణాల నుంచి పట్టణాలకు తరలివెళ్లే వలసలున్నాయి. తక్కువ సంఖ్యలో పట్టణాల నుంచి గ్రామాలకు వెళతారు. కనుక ఎన్నో రకాల వలసలు, ఎన్నో రకాల వలసదారులున్నారు.

జనాభా గణాంకాల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ ఈ వలసలన్నింటికి సంబంధించిన సమాచారం మొత్తాన్ని నమోదు చేయడం లేదని ఇంతకు ముందు నేను ది హిందూ పత్రికలో ఒక వార్తాకథనంలో నివేదించాను. ఎలాంటి తుది గమ్యం, స్పష్టమైన గమ్యం లేకుండా పయనించే 'వలసదారులు' దేశంలో చాలామంది ఉన్నారు. అలాంటివారు కలహండి నుంచి రావచ్చు – రైల్లో వాళ్లు ప్రయాణం చేస్తుంటే వారిని 'మీరు ఎక్కడ నుంచి వస్తున్నారు?' అని అడిగితే ముంబయి నుంచి అని చెబుతారు – వారు సాంధీ నుంచి వస్తుండవచ్చు – అక్కడ ఒక బ్రిడ్జి ప్రాజెక్టు కోసం 90 రోజులు పనిచేసేందుకు వచ్చి ఉండవచ్చు. వారికి అందులోని బంధువో, బావమరిదో మరో 45 రోజుల భవన నిర్మాణం పని ముంబయిలో ఉందని చెప్పవచ్చు. వారు నిరంతరంగా ప్రయాణిస్తూనే ఉంటారు. వారి జీవితాలు శాశ్వతంగా అభద్రతతో, నిత్య చలనంతో ఉంటాయి. అత్యంత అభద్రత, తక్కువ ఆదాయం, సదుపాయాల లేమి, ఎలాంటి చట్టం అమలుకాని స్థితిలో ఉంటారు. అంతర్రాష్ట్ర వలసదారుల చట్టం కింద నమోదైనవారు మొత్తం 85,000. అవునా? మన దేశంలో సమాచారం అలాగే ఉంటుంది. కనుక మనకు సరైన గణాంకాలు లేదనేది వాస్తవం. కాని సెన్సస్ రిపోర్టు ప్రకారం 2001 నుంచి 2011 మధ్య మానవ చరిత్రలోనే ఎక్కువమంది భారతీయులు వలసవెళ్ళారు.

మిథాలీ "మీడియాలో మనందరం వారు గ్రామాలకు ఎందుకు తిరిగి వెళుతున్నారు? అని అడుగుతున్నాం. వారు మనల్ని వదలి ఎందుకు వెళుతున్నారని మనం అడుగుతున్నామని నీకు తెలుసు?" కానీ వారు తమ గ్రామాలను వదిలి ఇక్కడకు ఎందుకు తరలివచ్చారని మీడియా అడగాలి. వ్యవసాయ సంక్షోభం కారణంగానే అని మనం మీడియాలో తక్కువ చేసి వదిలివేస్తాం.

ఇప్పుడు నువ్వు గ్రామీణ ప్రాంతంలోని కష్టం ఏమిటని నన్ను అడుగుతున్నావు? గ్రామీణ సమస్యలకు వ్యవసాయ మొక్కటే కారణం కాదు. వ్యవసాయం తరువాత ఎక్కువమందికి ఉపాధి కల్పించే రంగమేదో ఎంతమంది జర్నలిస్టులకు, సంపాదకులకు, యాంకర్లకు తెలుసు? అది ఐటి రంగం కాదు. హైటెక్ అంతకన్నా కాదు. అది చేతివృత్తులు, చేనేత. చేనేత, చేతివృత్తుల రంగం మన దేశంలో (వ్యవసాయం తరువాత) ఉపాధి కల్పించే అతి పెద్ద రంగం. మీరు చేనేత గణాంకాలు, గత 20–30 యేళ్ల నుంచి జరిగిన క్రాఫ్ట్ కౌన్సిల్ ప్రగతిని పరిశీలించండి. భారతదేశంలో వారే వ్యవసాయం తరువాత అధిక ఉపాధి కల్పిస్తున్నారు.

ఇప్పుడు వాటి గురించి తెలుసుకుంటే అవి చేనేత, కుమ్మరం, చేతి వృత్తులు తదితరాలు. ఇవన్నీ వ్యవసాయాధార అనుబంధ వృత్తులే. వ్యవసాయం లేకుంటే వారి మనుగడ కష్టం. మీరు వ్యవసాయరంగ ఆత్మహత్యలను పరిశీలిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలకు తోడు జరుగుతున్నవి చేనేత కార్మికుల ఆత్మహత్యలే. పూర్వ ఆంధ్రప్రదేశ్‌లోని పోచంపల్లిలో చేనేత కార్మికులు ఆత్మహత్యలతో చనిపోయారు, ఎందుకు? వ్యవసాయదారులు దివాలా తీయడంతో చేనేతకు మార్కెట్ లేకుండా పోయింది. ఇవన్నీ అనుబంధ వృత్తులు.

మీడియా వ్యవసాయ ఆర్థికవ్యవస్థకు, వ్యవసాయరంగ ఆర్థికవ్యవస్థకు మధ్య గల అంతరాన్ని పట్టించుకోవడం లేదు. వ్యవసాయ ఆర్థికవ్యవస్థ చాలా పెద్దది. వడ్రంగులు, చేనేతపనివారు, కమ్మరులు, తేనే పట్టేవారు, మత్స్యకారులు – తదితర అనుబంధ రంగాలకు చెందిన వృత్తుల వారందరూ వ్యవసాయార్థిక వ్యవస్థలో భాగం. వ్యవసాయ సమాజంలోని వారందరూ వ్యవసాయంపై ఆధారపడతారు. వ్యవసాయం నష్టపోతే దాని ఫలితం అందరిపై ఉంటుంది.

గత 30 సంవత్సరాలుగా అనుసరిస్తున్న నమూనా ఫలితంగా

ఆర్థికవ్యవస్థ ధ్వంసమైంది. వ్యవసాయం నుంచి, వ్యవసాయపు బురద నుంచి ప్రజలకు స్వేచ్ఛ కల్పించి వారు కోరిన ఉద్యోగాలు చూసుకోవాలని అనుకున్నాం. వారు సిస్కోలోనో లేక ఇన్ఫోసిస్, యాహూల్లో చేరాలనుకున్నాం. నిజానికి కొందరు చేరారు. వారిని మనం వాళ్ల క్యాంటీన్లలో చూడవచ్చు. మాంద్య రైతులు ఈ అత్యున్నత సంస్థల్లోని క్యాంటీన్లలో అడిగిన వారందరికీ టీలు అందిస్తున్నారు.

చంద్రబాబునాయుడు ప్రకటించిన విజన్ 2020లో 40 శాతం మంది ప్రజలు వ్యవసాయం నుంచి బయటకు రావాలని కోరుకున్నారు, అవునా? చాలామంది వ్యవసాయం నుంచి బయటకు వచ్చేశారు. 1991-2011 లెక్కల ప్రకారం పూర్తికాలం వ్యవసాయదారులుగా పనిచేసేవారి సంఖ్య 1.5 కోట్లు తగ్గింది. అంటే రోజుకు 2,000 మంది రైతులు పూర్తికాలం వ్యవసాయం నుంచి బయటకు వచ్చేస్తున్నారు. మహమ్మారి రావడం, లాక్‌డౌన్ విధించడంతో ప్రజలు తిరిగి గ్రామాలకు మరలుతున్నారు. గత 25 సంవత్సరాలుగా కోల్పోయిన తమ జీవనాధారాలను తిరిగి వెతుక్కుంటున్నారు.

**మిథాలీ:** చివరగా ఒక ప్రశ్న సాయినాథ్, పెద్దనోట్లరద్దు కాలంలో వలె, కనీస మద్దతు ధర తక్షణ సమస్యగా రైతుల ముందుకు రావడంతో వారు ఇపుడు రోడ్లపైకి వస్తున్నారు. ఈ నిరసనలు కేవలం ఉత్తరాదికి మాత్రమే పరిమితం కావడం లేదు, దేశమంతటా వ్యాపిస్తున్నాయి. దీనివల్ల సంభవించే రాజకీయ పరిమాణాలు ఎలా ఉండబోతున్నాయని మీరు భావిస్తున్నారు?

**సాయినాథ్:** నా ఆలోచనను బట్టి తక్షణ పరిణామాలు, మధ్యంతర పరిణామాలు కలగాపులగంగా ఉండబోతున్నాయి. ఏదో బద్దలు కాబోతోంది. ఒక శూన్యం ఏర్పడింది. మీరు ఏర్పాటు చేయాలని భావిస్తున్న వ్యవస్థ ఏర్పడకపోవచ్చు. రెండో అంశం కనీస మద్దతు ధర అసంతృప్తిని పెంచటానికి ఇది దోహదం చేసింది. స్థిరత్వం కోసం వ్యవసాయ సమాజంలో పెద్ద ఆందోళన ఉంది. రైతు తన సరుకుకు ధర నిర్ణయించలేడు, ఎవరో నిర్ణయిస్తారు. వారు అత్యంత దారుణంగా ధరల్లో నిలకడ లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

కేరళలో 2002, 2003లో ఏడాదిన్నర పాటు వనీలా అనే సుగంధం కిలో 4,000 రూపాయలు ధర పలికింది. రెండేళ్ల తరువాత కిలో 68 రూపాయలకు తగ్గింది. ది వైర్‌ను ప్రతి యేటా చదువుతుంటే లాసల్‌గావ్‌లో ఉల్లిపాయల ధరల్లో ఎంతటి అంతరం ఉంటుందో మీకు అర్థమవుతుంది. అలాంటి అభద్రతను మనం ఖండించాలి. ఇప్పుడు ఆ అస్థిరతను వ్యవస్థీకృతం చేస్తూ రైతులకు సహకారం లేకుండా చేస్తున్నాం. అలాంటి కొన్ని విఫలమైన విధానాలు కొందరి ప్రయోజనాలనే నెరవేరుస్తున్నాయి.

కనుక రాజకీయ పరిణామాలేమిటి? వాస్తవమేమిటంటే బిజెపిని వ్యతిరేకిస్తున్నవారిలో బలమైనశక్తిగా ఉన్నవారు ఎలాంటి విబేధం చూపకపోయినప్పటికీ కార్యాచరణను కోరుకుంటున్నారు. గతంలో యుపిఎ కూడా ఇదే చేసింది. ఈ మహమ్మారి నుంచి మనం ఏమైనా పాఠాలు నేర్చుకున్నామా? కోవిడ్-19 వల్ల మనకు జరిగిందేమిటి? అది సమాజాన్ని 100 శాతం శవపరీక్ష చేసింది. నయాఉదారవాదం, పెట్టుబడిదారీ అభివృద్ధి విధానాలను పరీక్షించి, ప్రతినరం, నాడి, సిర, ఎముక, దమని ఎక్కడ చెడిపోయింది, ఎక్కడ పురుగులు పడ్డాయో చెప్పింది.

కేరళలోని అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు తిరువనంతపురం విమానాశ్రయాన్ని ప్రైవేటుపరం చేయాలని చెబుతున్నాడు. అంటే మీరు ఒక చర్యను వ్యతిరేకించాలనుకుంటున్నారే తప్ప దాని వెనుక ఉన్న తాత్వికతను, దాని ద్వారా సాగే రాజకీయాలను మాత్రం కాదనే కదా? అందుకనే నేను చెబుతుంటాను, యుపిఎ బృందం నేరుగా కాల్చదు. ఎన్‌డిఎ బృందం ప్రతిదాన్నీ కాల్చడాన్ని ఆపదు. ప్రతివైపు, ప్రతి దగ్గరా, దేన్నయినా అది కాలుస్తుంది.

ఒక్క విషయం మిథాలీ, నేను ఒక విషయంలో న్యాయం చేశాననుకుంటున్నా. రాజకీయంగా ఏం జరగబోతోంది? మహమ్మారి తో వైరస్ సోకుతుందనే భయం వెన్నాడుతున్నా లక్షలాది మంది రైతులు ఏదో ఒక సమస్యతో రోడ్లపైకి రావటం నన్ను ఆశ్చర్యచకితుడ్ని చేసింది. కేవలం కనీస మద్దతు ధర మాత్రమే కాదు. పాల ధర ఒక సమస్య. కనీస మద్దతు ధర మరో సమస్య. రైతుల రుణభారం ఇంకో సమస్య కాబోతోంది. మొత్తంగా గమనిస్తే రైతాంగంలో పెద్ద ఎత్తున ఉన్న అసంతృప్తి బద్దలు కావడాన్ని రానున్న కాలంలో చూడవచ్చు.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

# విద్యుత్‌రంగ ప్రైవేటీకరణే నగదు బదిలి లక్ష్యం

(34వ పేజీ తరువాయి)

పార్టీ వారు రైతులకు నమ్మబలుకున్నారు. గతంలో ఇలా నమ్మబలికిన వారు ఎన్నిసార్లు వాగ్దానభంగం చేయలేదు? అధికారంలోకి కొత్త పార్టీ వచ్చినడప్పుడల్లా ఎన్ని మార్పులు జరగలేదు? గ్యాస్, కిరోసిన్, ఎరువులు సబ్సిడీల మోతాదు ఎలా తగ్గిపోతుందో చూస్తే ఇప్పుడు మీటర్లు పెట్టడాన్ని నిలవరించకపోతే, నగదు బదిలీని నిరోధించలేం, తర్వాత సబ్సిడీ కుదింపును ఆపలేం.

ఉచిత విద్యుత్‌కు ఎటువంటి ప్రమాదం లేదు. ఉచిత విద్యుత్‌కు మీటర్లు పెట్టడానికి సంబంధం లేదు. కరెంటు వినియోగం ఖచ్చితంగా తీసుకుకోవడానికే వాటిని ఏర్పాటు జేస్తున్నాం. విద్యుత్ బిల్లు మీకురాదు. మీరు కట్టనక్కరలేదు. ప్రభుత్వానికే వస్తుంది. ప్రభుత్వమే కడుతుంది. అని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. ప్రభుత్వమే మొత్తం వ్యవసాయ విద్యుత్ బిల్లు కట్టేపని అయితే మొత్తం బిల్లును ప్రభుత్వమే తీసుకుని అదే చెల్లిస్తే సరిపోతుంది కదా! రైతుకు బిల్లు రావటం ఎందుకు, ఆ మొత్తాన్ని ప్రభుత్వం రైతుల అకౌంట్లలో వేయటం, దాన్ని రైతులు చెల్లించడం ఎందుకు? ఈ డొంకతిరుగు డెందుకు? విద్యుత్ సంస్థ ప్రభుతం చేతుల్లో వుంటే తనకు తానే చెల్లించుకోవాల్సి అవసరం ఏంటి? ఎలా జూసినా విద్యుత్ పంపిణీ ప్రైవేటు వారికిచ్చి, ఉచిత విద్యుత్‌ను క్రమేణా వదిలేసే వ్యూహంలో భాగమే ఈ నగదు బదిలీ పథకం అన్నది యదార్థం.

విద్యుత్ మీటర్లు బిగించకపోతే, నగదు బదిలీ ప్రవేశపెట్టకపోతే అప్పుజేసుకోవడానికి కేంద్రం ఒప్పుకోదని పాలకులు అనడం ఆశ్చర్యంగా వుంది. మడమ తిప్పనివీరులుగా చెప్పుకునేవారు కోట్లాది రైతాంగం మీద భారం మోపమని బిజెపి ఒత్తిడి జేస్తుంటే ఎదిరించి పోరాడిల్సింది పోయి తోకాడించుకుంటూ బిజెపి చెప్పిన ప్రజావ్యతిరేక విధానాలను అమలు జేయడానికి పూనుకోవడం సిగ్గుచేటు. రైతుపక్షాన రాష్ట్రాల హక్కుల కోసం కొన్ని రాష్ట్రాలు ప్రదర్శించిన బాధ్యతను కూడా వైఎస్‌ఆర్ పార్టీ ప్రభుత్వం పాటించకపోవడం అన్యాయం.

విద్యుత్ రంగానికి సంబంధించిన పర్యవసానాలు ప్రైవేటీకరణ జరిగే అన్ని రంగాల్లో వస్తాయి. నగదు బదిలీ పథకం అనేది తక్షణం ప్రైవేటు రంగాన్ని ఆకర్షించడానికి, దీర్ఘకాలంలో ప్రబలకిచ్చే సబ్సిడీలపై వేటు వేయడానికి ఒక ఉచ్చు మాత్రమే.

ఆరోగ్యం

# ప్రజారోగ్యం కోసం పోరాటం అనివార్యం



రచయిత మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి

**జెఎస్ మజుందార్**

ప్రభుత్వరంగ ఆరోగ్యసేవలలో ప్రయివేటీ కరణను వ్యతిరేకించడం ద్వారానే మనం ఆ రంగాన్ని, సేవలను కాపాడుగలుగుతాం. ఇప్పు డు కార్మికవర్గం, ప్రజలు చేస్తున్న పోరాటాలతో ఇది మమేకం కావాలి. ముఖ్యంగా సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థలు, సేవలను అత్యంత వేగంగా ప్రయివేటీ కరిస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వం, దానిని అనుసరిస్తున్న కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను అందరం కలసి ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమయ్యింది.

**ఆరోగ్యం కోసం పోరాటం అనివార్యం**

పోరాటాల ద్వారానే ప్రజారోగ్య సేవల విధానం ఆవిర్భవించింది.

ఎ) జీవించి ఉండటం కోసం ఆహారం, ఆరోగ్య సేవల రక్షణ, మానవాభివృద్ధిలో ఈ రెండూ సమ్మిళితమై పరస్పర సంబంధం కలిగి ఉంటాయి.

బి) ఆరోగ్య సేవలలో ప్రజల అనారోగ్య స్థితి, మరణాలు మన పోరాటాలలో కీలక పాత్ర పోషిస్తాయి.

సి) పెట్టుబడిదారీ విధానం, ప్రజల అనారోగ్య స్థితిగతులకు మధ్య ఉన్న సంబంధాన్ని మొట్టమొదటిసారిగా మార్క్స్ అండ్ ఏంగెల్స్ తమ సామాజిక సిదాంతంలో ఆవిష్కరించారు. ఇందులో ప్రజారోగ్యానికి, పేదరికానికి మధ్య ఉన్న సంబంధం వ్యక్తిగతం కాదని, అది సామాజికం అని స్పష్టంగా నిరూపించారు.

డి) 19 వ శతాబ్దం మధ్యభాగంలో మార్క్స్, ఏంగెల్స్ రచనలు వెలువడిన తరువాత ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ప్రజారోగ్య జాగ్రత్తలు, దేశీయ ప్రజారోగ్య వ్యవస్థలు ఏర్పడ్డాయి. సుదీర్ఘ ప్రజా, కార్మిక, రాజకీయ పోరాటాల ద్వారా మాత్రమే ఈ హక్కులు సాధ్యమయ్యాయి. ప్రభుత్వరంగంలో ఉన్న ప్రజారోగ్య వ్యవస్థలలోని ఒక్కొక్క భాగాన్ని ప్రయివేటీకరించడం ద్వారా మోడీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నాశనం చేస్తోంది.

ప్రజారోగ్య ప్రణాళికలను రద్దు చేయటం: స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలోనే, దేశాభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ఆరోగ్యసేవల విధానం ప్రారంభించబడింది. మొట్టమొదటి పంచవర్ష ప్రణాళికలో (1951–56) మొత్తం సమాజ అభివృద్ధి ప్రణాళికలో ప్రజారోగ్య కార్యక్రమం ఒక ముఖ్య భాగమైంది.

ప్రజారోగ్య సేవల కార్యక్రమం రూపకల్పన లోనూ, అమలులోనూ అనేక లోపాలు ఉన్నాయి. బడ్జెట్ కేటాయింపులు చాలా తక్కు వగా ఉండటం ఈ కార్యక్రమం పరిపుష్టం కాకుండా ఉండటానికి హేతువయ్యింది. 2014 లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొత్తం ప్రణాళికా విభాగాన్ని రద్దుచేసింది. దీనితో ప్రజారోగ్య ప్రణాళిక కూడా గాలిలో కలిసిపోయింది. భారతదేశ ప్రజలు ఒక ప్రణాళికబద్ధమైన ఆరోగ్య సేవల వ్యవస్థ లేక దిక్కులేని వారయ్యారు. ఈ విధంగా మొత్తం ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసి, లాభాపేక్ష ధ్యేయంగా ఉన్న మార్కెట్ శక్తులకు ప్రజారోగ్యాన్ని బలిపశువుని చేశారు.

**ప్రయివేటీకరణకు పునాదులు వేసిన 2017 జాతీయ ఆరోగ్య ప్రణాళిక**

1978 అల్మాఅటా తీర్మానం ప్రకారం "2000 సం॥నికి అందరికీ ఆరోగ్యం" సాధిం చటం కోసం మనదేశం 1983లో మొట్ట మొదటి ''జాతీయ ఆరోగ్య ప్రణాళిక''ను రూపొందించింది." ప్రపంచ ఆరోగ్య సంస్థ" తీర్మానం ప్రకారం ఈ కార్యక్రమం రూపు దిద్దుకుంది.

జాతీయ ఆరోగ్య ప్రణాళిక 1983లో నాలుగు ముఖ్య భాగాలు ఉన్నాయి.

1. ఉచిత, సంపూర్ణ ప్రాథమిక ఆరోగ్య సేవలు మరియు ఆరోగ్య అవగాహన
2. ఆరోగ్య కార్యకర్తల భాగస్వామ్యం
3. ద్వితీయ, తృతీయ స్థాయి ఆరోగ్య సేవలు ఉచితంగా అందించడం, అనుసంధా నించడం
4. ప్రత్యేక సేవలు అర్హులందరికీ ఉ చితంగా అందించే ఏకీకృత వ్యవస్థ

ఇవన్నీ 2000 సంవత్సరానికి అందించాలని ప్రణాళికలు వేశారు. 1983 జాతీయ ఆరోగ్య ప్రణాళిక ఈ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. కాని సార్వజనీన ఆరోగ్య వ్యవస్థని సాధించటానికి అది ఖచ్చితంగా దారి చూపింది. 2002లో అటల్‌బిహారి వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్.డి.ఏ ప్రభుత్వం ఈ ప్రణాళికలో మార్పులు చేయటం మొదలు పెట్టింది. అది హేతుబద్ధంగాలేని అంచనా లతో ఉందనీ, ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యరం గంలో సరళీకృత విధానాలతో ప్రయివేటు రంగం పాత్ర పెరుగుతున్నదని, అందుకే దేశంలోనూ ప్రయివేటు పెట్టుబడిదారులను ఆరోగ్య సేవలలోకి తెస్తున్నామని ప్రకటించింది.

2002 లో ప్రకటించిన ఈ " జాతీయ ఆరోగ్య ప్రణాళిక" కు తోడుగా 2005లో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్'' ప్రారంభించబడింది. జాతీయ ఆరోగ్య మిషన్ లో భాగంగా 2013 జాతీయ పట్టణ ఆరోగ్య ప్రణాళిక" ఆవిష్కృతమయింది. ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే త్రాగునీరు, పారిశుద్యం,విద్యా, పౌష్టికాహారం, సామాజిక మరియు లింగ సమానత్వం సాధించటం కోసం మార్పులు

చేయబడ్డాయి. ముందు 2018 కి లక్ష్యం సాధించాలని భావించి ,మరల దానిని 2020 దాకా పెంచారు. ఐ.సి.డి.ఎస్ –సమగ్ర శిశు సంక్షేమ పథకం– దీనిలో ప్రధాన పాత్ర పోషించగా, ఆశా వర్కర్ల విధానం ప్రజారోగ్య సేవల వ్యవస్థలో ఏకీకృతమై నిలిచింది.

2015 మార్చి నాటికి ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో 1.53 లక్షల సబ్ సెంటర్లు, 25,308 ప్రామిక ఆరోగ్య కేంద్రాలు, 5,396 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా వైద్యశాలలు, వైద్య కళాశాలలు ఏర్పడ్డాయి. వీటికి తోడు పట్టణ ప్రాంతాల్లో డివిజన్ స్థాయి వైద్యశాలలు లేదా క్లినిక్స్ స్థానిక మున్సిపల్ యంత్రాంగ పరిధిలో నెలకొన్నాయి. ఇన్ని చేసినా సార్వజనీన ఆరోగ్య సేవల లక్ష్యం అందరికీ ఆరోగ్యం అందనంత దూరంలో ఉంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులకి ఇది నచ్చక పోయినా భారతదేశ పాలక వర్గాలు కొంత ప్రయత్నం చేశాయి. ఈ నేపధ్యంలో మోడీ ప్రభుత్వం ఆరోగ్య ప్రణాళికను రద్దు చేసి, జాతీయ ఆరోగ్య ప్రణాళిక 2017 ని ప్రకటించింది.

ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రయివేటీకరిం చడానికి ఈ ప్రణాళిక రెండు సూత్రాలను గుర్తించింది.

ఎ) బలిష్టమైన ఆరోగ్య సేవల రంగం రెండంకెల అభివృద్ధితో దూసుకెళ్ళడం. బి) బలంగా పెరుగుతున్న ప్రయివేటు వైద్యరంగ సేవలను ప్రభుత్వరంగ ఆరోగ్య సేవల లక్ష్యాలకు బలం చేర్చాలని ప్రణాళికలో మార్పులు చేయటం, తద్వారా ప్రయివేటు సేవల ద్వారా ఆరోగ్య సేవల రంగాన్ని మరింత ఉపయుక్తంగా, వివేకవంతంగా పనిచేయించడం కోసం, రక్షణ, నీతివంతమైన మరియు సేవలు అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. కాని సార్వజనీన ఆరోగ్య సేవల లక్ష్యం అందుకోవటానికి ఇది ఎంత మాత్రం ఉపయోగపడకపోగా, ప్రయివేటు ఆరోగ్యసేవల వ్యాపారాన్ని, దాని అనుబంధ వ్యవస్థలను బలోపేతం చేయడానికే ఉ పయోగపడింది.

### ఆయుష్మాన్ భారత్

ఈ ఆలోచనల కొనసాగింపుగానే 2018 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి "ఆయు ష్మాన్ భారత్"ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ పూర్వ ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి సుజాతారావు గారి ప్రకారం ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రభుత్వ పాత్ర" సేవలను అందించడం నుంచి తప్పుకొని ఫైనాన్షియర్‌గా మారిందన్నారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ఒక బీమా ఆధారిత

> “ లాభాల కోసమే కార్పొరేట్ బీమా కంపెనీలు ఈ వ్యాపారం లోకి వచ్చాయి. అందుకే ఏ యే వ్యాధులకు చికిత్స అందించ గలరు, ఎటువంటి అర్హతా ప్రమాణాలు ఉంటే చికిత్సకు అనుమతి లభిస్తుందన్న అంశాలను ప్రయివేటు వైద్యశాలలకు లబ్ధి కలిగించే విధంగా రూపొందించారు. ప్రయివేటు వైద్య శాలలు, వ్యాధి పరీక్షా కేంద్రాలు, డాక్టర్లు, మందుల కంపెనీలు, సరఫరాదారు లందరినీ దృష్టిలో పెట్టుకొని విధానాలు రూపొందిం చారు మినహా మెరుగైన చికిత్స కోసం మాత్రం కాదు. ”



వైద్యం కోసం మహిళను డోలీలో తీసుకుపోతున్న గిరిజనులు

ఆరోగ్య సేవ. ప్రభుత్వరంగ ఆరోగ్య వ్యవస్థల ద్వారా బలహీన వర్గాలకు అందిస్తున్న ద్వితీయ మరియు తృతీయ శ్రేణి వైద్య సేవల బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకొని బీమా బాట పట్టింది.

లాభాల కోసమే కార్పొరేట్ బీమా కంపెనీలు ఈ వ్యాపారంలోకి వచ్చాయి. అందుకే ఏ యే వ్యాధులకు చికిత్స అందించ గలరు, ఎటువంటి అర్హతా ప్రమాణాలు ఉంటే చికిత్సకు అనుమతి లభిస్తుందన్న అంశాలను ప్రయివేటు వైద్యశాలలకు లబ్ధి కలిగించే విధంగా రూపొందించారు. ప్రయివేటు వైద్య శాలలు, వ్యాధి పరీక్షా కేంద్రాలు, డాక్టర్లు, మందుల కంపెనీలు, సరఫరాదారులందరినీ దృష్టిలో పెట్టుకొని విధానాలు రూపొందిం చారు మినహా మెరుగైన చికిత్స కోసం మాత్రం కాదు. ప్రభుత్వరంగ ఆరోగ్య వ్యవస్థల ద్వారా పొందే సేవల బదులు, డాక్టర్– డయా గ్నసిస్–చికిత్స– వైద్యశాల మరియు మందులు అనే చట్రంలోకి పేద ప్రజానీకం నెట్టి వేయ బడ్డారు. ఇది మోడీ ప్రయివేటీకరణలో మొదటి అంకం. ప్రజల యొక్క ఆరోగ్యాన్ని బీమా కంపెనీలకు అప్పచెప్పటమేకాదు, కేంద్ర మరియు మెజారిటీ రాష్ట్ర ప్రభుత్వాలు వాటి పర్యవేక్షణ నుంచి కూడా తప్పుకుని, కేవలం 60:40 శాతంలో బీమా ప్రీమియం కట్టడానికి పరిమితమయ్యారు.

అంతటితో ఆగక జాతీయస్థాయిలో ఒక స్వతంత్ర ప్రజాసంస్థను, "జాతీయ ఆరోగ్య అథారిటీ" పేరుతో ఒక ముఖ్య పరిపాలనా అధికారి" (సిఇఓ) ని కూడా నియమించారు. సొసైటీ చట్టం ప్రకారం రిజిస్టర్ కూడా చేయిం చారు. రాష్ట్రాలలో కూడా ఈ బాధ్యతలను కొన్ని సొసైటీలకు, ట్రస్టులకు అప్పగించారు.

ప్రజారోగ్య సేవల నుండి ప్రభుత్వాలు తప్పుకుంటే జరిగే ఘోర విపత్తు ఏమిటో మనకి "కోవిడ్" చికిత్సలో స్పష్టంగా బట్టబయల య్యింది.

### ఆరోగ్యరంగంలో భారీగా పెరిగిన ప్రయి వేటు రంగం పాత్ర

సరళీకృత ఆర్థిక విధానాల నేపధ్యంలో భారీస్థాయిలో విదేశీ పెట్టుబడులు ఆరోగ్య

**❝ అందువలన ఎన్.డి.హెచ్.ఎం అనేది ప్రమాదకరం. వ్యక్తుల యొక్క అంతర్గత విషయాలు, గోప్యతా అంశాలు నేరుగా ప్రయివేటు వారికి అందించటం చాలా నష్టదాయకం. మనలాంటి దేశంలో ప్రజలను బెదిరించడానికి, సమాచారాన్ని దుర్వినియోగం చేయటానికి ఆస్కారాలు ఎక్కువగా ఉన్నాయి. నియంత్రణా యంత్రాంగం అసమర్థంగా ఉన్నదేశంలో బహుళ జాతి ఔషధ పరిశ్రమలు ప్రజలను గినీపందులుగా ప్రయోగాలు చేసే అవకాశాలు ఎక్కువ. ❞**

రంగంలోకి ప్రవేశించాయి. 2,000 ఏప్రిల్ నుండి 2020 మార్చి మధ్యకాలంలో వైద్య శాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, కొత్త ఔషధాల ప్రయోగాలలో దాదాపు 672 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు ప్రవహించాయి. కార్పొరేట్ వైద్యరంగంలో జరిగిన విలీనాలు, కొనుగోళ్ళు 2019 సం॥లో రికార్డు స్థాయిలో 155 శాతం పెరిగింది. ప్రజారోగ్య రక్షణ మార్కెట్ దాదాపు మూడురెట్లు అభివృద్ధితో సుమారు 8.6 లక్షల కోట్లకి చేరవచ్చునని ప్రభుత్వ అంచనా వేసింది. ఇంత పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు వస్తున్నప్పుడు దానికి సరిపడే స్థాయిలో మార్కెట్ అభివృద్ధి చెంది ఉండాలి. అందుకే మోడీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది.

**మందులు మరియు వినియోగపు పరిశోధనలు 2019**

2019 సం॥లో డ్రగ్స్ మరియు క్లినికల్ ట్రయల్స్ చట్టంలో సవరణలు తీసుకు వచ్చి మోడీ ప్రభుత్వం విదేశీ ఔషధ కంపెనీలు భారత ప్రజల మీద స్వేచ్ఛగా ప్రయోగాలు చేయటానికి అనుమతులిచ్చింది. బహుళజాతి కంపెనీలు మానవులపై ప్రయోగాలు చేయటానికి ఇప్పుడు మన దేశం స్వర్గధామం. మన వైద్యశాలల్లో ప్రయోగాలను పరిశీలించటానికి అమెరికా యొక్క "ఫుడ్ అండ్ డ్రగ్స్ ఎడ్మినిస్ట్రేటివ్" ఆఫీసులు మన దేశంలో ఏర్పడ్డాయి. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆఫీసుకి కూడా తెలియకుండా ఇవన్నీ జరిగిపోతున్నాయి. 2109 మొదటి త్రైమాసికంలో ఔషధ ప్రయోగాల రేటు తొమ్మిది శాతం పెరిగింది. ప్రజారోగ్య సేవలలో అతిపెద్ద ప్రయివేటీకరణ– మోడీగారి "నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్".

2020 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ప్రధాని మోడీ ప్రకటన "జాతీయ డిజిటల్ ఆరోగ్య సంరక్షణ మిషన్" ఆరోగ్య సేవలలో ప్రయివేటుకి పెద్దపీట వేయటానికి ఉద్దేశించినది. ప్రారంభదశలో ఇది దేశంలోని ఆరు కేంద్ర పాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణలో ప్రారంభమయి నెమ్మదిగా అన్ని రాష్ట్రాలకు విస్తరించబడుతుంది. 2017 జాతీయ ఆరోగ్య ప్రణాళికలోనే నీతి ఆయోగ్ దీని గురించి ప్రస్తావించింది.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి– ప్రధానమంత్రి జనఆరోగ్య యోజన పథకంలో ప్రభుత్వ ధనంతో బీమా ద్వారా పేదలకి ఆరోగ్య సేవలు అందిస్తామని ప్రకటించగా, ఎన్‌డిహెచ్‌ఎం (నేషనల్ డిజిటల్‌హెల్త్ మిషన్) లో పై పథకంలోకి రానివారందరికీ వైద్యం అందించేలా రూపొందించామని చెప్పారు. ఈ రెండు కూడా "జాతీయ ఆరోగ్య అథారిటీ ద్వారా పర్యవేక్షించబడతాయి.

ఇతర వినిమయ వస్తువులు, సేవలలో లభించే విధంగా, ఈ స్కీమ్‌లలో వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సేవల మార్కెట్‌లో ఎటువంటి ప్రత్యామ్నాయాలు లేవు. ఆమెకు లేదా అతనికి దొరికే ఆరోగ్య సేవలు, ఖర్చు డాక్టర్లు, పరీక్షా కేంద్రాలు, వైద్యశాలలు, మందుల జాబితా వ్రాసేవారు, సరఫరా చేసేవారి మీద ఆధారపడి ఉంటాయి. నీతి ఆయోగ్‌చే తయారు చేయబడిన ఎన్‌డిహెచ్‌ఎం పథకంలో ఈ దురదృష్టకర వ్యాధిగ్రస్తులు ఆరోగ్య సేవల మార్కెట్‌లోకి లాగ బడతారు. ప్రధానమంత్రి గారు దీనిని ఆరోగ్య సేవలలో పెనుమార్పు అని కొనియాడగా, కేంద్ర ఆరోగ్య శాఖామంత్రి దీనిని "అందరికీ ఆరోగ్యం అందించే" పథకం అని వక్కాణించారు.

జాతీయంగా "ఆరోగ్య గుర్తింపు"కార్డు పొందిన అందరూ ఈ మార్కెట్‌లోకి ప్రవేశిస్తారు. ఈ నమోదు ప్రక్రియలో వారి వ్యక్తిగత ఆరోగ్య రికార్డులు అన్నీ నమోదు చేసుకోవటంతో పాటు"సున్నితమైన అంతరంగిక అంశాలు కూడా నమోదు చేయాలి. ఎన్‌డిహెచ్‌ఎంలో ఉన్న అమ్మకందార్లు, సేవలు అందించువారు, డాక్టరు, పరీక్షాకేంద్రాలు, ప్రయివేటు వైద్య శాలలు, జాతీయ ఈ –రిజిస్టర్‌లో నమోదు అయిన డాక్టర్లు (డిజిడాక్టర్లు), అంతర్జాతీయ మందుల సరఫరాదారులు అందరికీ ఈ మొత్తం డేటా (సమాచారం) అందుతుంది.

ఆరోగ్య కార్డు పొందిన వారికి, డిజి డాక్టర్లకు, ఆరోగ్య సదుపాయాలు అందించే వారికి మధ్య ఎన్‌డిహెచ్‌ఎం నిర్వహణ, సదుపాయాలు, సమన్వయం బాధ్యతలు నిర్వహిస్తుంది. మిగతా మూడు, అంటే వ్యక్తిగత ఆరోగ్య సమాచార నిర్వహణ, టెలీకన్సల్టేషన్ మరియు ఈ– ప్రిస్క్రిప్షన్, టెలీ మెడిసిన్ విధానంలో ఈ– ఫార్మసీ ద్వారా మందుల సరఫరా వంటివి ప్రయివేటురంగానికి అప్పచెప్పింది. జాతీయ డిజిటల్ హెల్త్ మిషన్ యొక్క శాస్త్రీయత, న్యాయబద్ధత గురించి అనేక సందేహాలు నెలకొన్నాయి. అది వైద్య నియమాలను అతిక్రమించటం, గోప్యతకు భంగం కలిగించటం, డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం, డ్రగ్స్ అండ్ రెమిడీస్ చట్టాలను తుంగలో తొక్కి( ఈ చట్టాల ద్వారానే మెడికల్ రిప్రజెంటివ్‌లను నియమించి నమ్మకమైన, ఎంచుకోబడిన సమాచారాన్ని అందించే వారు) ఈ ఫార్మసి విధానం అమలు లోకి తెచ్చింది. ఇది చట్టవిరుద్ధ వ్యాపారానికీ ఆస్కారమిస్తోంది.

అందువలన ఎన్.డి.హెచ్.ఎం అనేది ప్రమాదకరం. వ్యక్తుల యొక్క అంతర్గత విషయాలు, గోప్యతా అంశాలు నేరుగా ప్రయివేటు వారికి అందించటం చాలా నష్టదాయకం. మనలాంటి దేశంలో ప్రజలను బెదిరించడానికి, సమాచారాన్ని దుర్వినియోగం చేయటానికి ఆస్కారాలు ఎక్కువగా ఉన్నాయి. నియంత్రణా యంత్రాంగం అసమర్థంగా ఉన్నదేశంలో బహుళజాతి ఔషధ పరిశ్రమలు ప్రజలను గినీపందులుగా ప్రయోగాలు చేసే అవకాశాలు ఎక్కువ. ప్రజలకి వాటి మీద సంపూర్ణ అవగాహన లేకుండానే ప్రయోగాలు జరిగిపోతున్నాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందిన అగ్రదేశాలలో వీటి నియంత్రణ చాలా కఠినంగా ఉంటుంది.

ఆధార్ కార్డుకి ప్రతిరూపమే ఆరోగ్యకార్డు. అయినప్పటికీ ఆధార్‌కార్డును ఈ అవసరాలకు వాడలేరు కాబట్టి ప్రత్యేక ఆరోగ్యకార్డు తప్పనిసరి అయింది. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆధార్‌కార్డు వినియోగం దీనికి పనికిరాదు.

ప్రధానమంత్రి ఈ పథకాన్ని ప్రకటించక ముందే, నీతి ఆయోగ్ 2020 జూలై 15వ తేదీన "జాతీయ డిజిటల్"ఆరోగ్య బ్లూప్రింట్ పేరుతో కొన్ని పత్రాలను ప్రజలలోకి వదిలింది. దాని ప్రకారం "వ్యక్తిగత, సున్నితమైన సమాచారం చాలా అందించాల్సి ఉంది. ఎ) వ్యక్తి

యొక్క ఆర్థిక సమాచారం–అనగా బ్యాంకు అకౌంట్, క్రెడిట్‌కార్డు, డెబిట్ కార్డు వివరాలు లేదా ఇతర చెల్లింపు విధానాలు బి) శారీరక, మానసిక సంబంధిత సమాచారం, సి)సెక్సు జీవితం, డి) సెక్స్ ధోరణులు, ఇ)వైద్య సమాచారం, చరిత్ర, ఎఫ్) బయోమెట్రిక్ సమాచారం, జి)జన్యుపర సమాచారం, హెచ్) ట్రాన్స్ జండర్ స్టేటస్, ఐ)ఇంటర్ సెక్స్ స్టేటస్ జె) కులం లేదా తెగ, కె) మతం లేదా రాజకీయ వైఖరి లేదా ధృక్పధం వంటి అంశాల వివరాలు అందించాల్సి ఉంటుంది.

ప్రింట్ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్ర ఆరోగ్యశాఖామంత్రి గారు “మొత్తం ఎన్‌డిహెచ్‌ఎం పథకానికి అందించాల్సిన సమాచారం కేవలం స్వీయ అంగీకారంతోటే (వాలంటరీ) అని శెలవిచ్చారు. కాని ఆరోగ్య కార్డు రిజిష్టరు చేయకుండా, సమాచారం ఇవ్వకుండా ఈ పథకం వర్తించదు. మరి స్వీయ అంగీకారం ఎలా సాధ్యం? ఇప్పటికే ఆధార్ కార్డు అనుభవం మన ముందు ఉంది. ఎన్‌డిహెచ్‌ఎం పథకం ఆరోగ్య సేవలను ప్రయివేటీకరించడంతో ఆగలేదు. సమతుల్యమైన పోటీ విధానానికి భిన్నంగా గుత్తాధిపత్యానికి దారి తీసే విధంగా పథకం రచించబడింది. ముఖ్యంగా వైద్య సేవలలో పెద్ద సంఖ్యలో ఉన్న వైద్యుల జీవనోపాధిని దెబ్బతీస్తుంది. ప్రయివేటు వైద్యులు, చిన్న వయస్సులో ఉన్నవారు ఎక్కువ దెబ్బతింటారు. అంతే కాదు, మందుల సరఫరా విధానంలో కూడా గుత్తాధిపత్యాన్ని పెంచి పోషించటం వలన దాదాపు 8 లక్షల మందుల షాపులు, వాటిలో పనిచేస్తున్న సుమారు 25 లక్షలమంది ఉపాధి ఆవిరైపోతుంది. ప్రధానమంత్రి ప్రకటన వచ్చిన వారంలోనే బెంగుళూరు, చెన్నై నగరాలలో రిలయన్స్, అమెజాన్ వంటి సంస్థలు ఈ ఫార్మసీలు ప్రారంభించాయి.

అలాగే ఔషధ తయారీలో కూడా గుత్తాధిపత్యానికి దారితీస్తుంది. ఔషధ తయారీలో దేశానికి బలాన్ని అందిస్తున్న వేలాది ఎంఎస్ఎంఇ’లు తక్కువ ధరలతో జనరిక్ ఔషధాలను ఉత్పత్తి చేస్తూ దేశీయ మరియు విదేశీ మార్కెట్లలో అమ్ముకుంటున్నవి. ఇవి మూత పడటం వలన లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు ఉపాధి కోల్పోతారు. అందువలన ఈ–ఫార్మసీలు విస్తరిస్తే పోటీతత్వం నశించి, ఔషధ తయారీదారుల గుత్తాధిపత్యానికి దారితీస్తుంది. చట్ట ప్రకారం మెడికల్ ప్రాక్టీషనర్స్ మరియు ఫార్మసిస్టులకు విశ్వాసంతో కూడిన సమాచారాన్ని అందించే దాదాపు రెండు లక్షలమంది మెడికల్ రిప్రజెంటేటివ్‌లు తొలగించబడతారు.

> “ఈ నేపథ్యంలో అత్యవసర మందుల ధరలను నిర్ణయించడంలో తయారీ ధరను ప్రాతిపదికగా తీసుకోవాలని, ధరలను ప్రభుత్వ నియంత్రణలో ఉంచాలని, జి.ఎస్.టి నుంచి వీటిని పూర్తిగా మినహాయించాలని దేశవ్యాప్తంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైంది.”



మన ఆసుపత్రుల దుస్థితికి నిదర్శనం ఈ ఫోటో: బీహార్‌లోని నలందా మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోకి వర్షపునీరు చేరడంతో నీటి మడుగులోనే రోగులు

**భారీగా పెరిగిన పన్నులు – పెరిగిన మందుల ధరలు**

2014 సెప్టెంబరులో అమెరికా సందర్శించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహుళజాతి ఔషధ పరిశ్రమాధిపతులను కలసి కొన్ని వారికి వరాలు ప్రకటించారు. అందులో పేటెంట్ హక్కులను పరిరక్షించటం, క్లినికల్ ప్రయోగాలు, మందుల ధరలు ఉన్నాయి. ఆ పర్యటనలో ఏర్పడిన మూడు ఇండో, యుఎస్ గ్రూపులలో ఒకటి ఫార్మాస్యూటికల్స్‌కు సంబంధించినది. దీని ఫలితంగా రెండు భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. 2013 మందుల ధరల నియంత్రణ పట్టికలో మార్పులు మరియు జి.ఎస్..టి అమలు మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వంలోనే రూపకల్పన జరిగినా, మోడీ ప్రభుత్వం అత్యంత వేగంగా అమలుకు శ్రీకారం చుట్టింది.

**డి.పి.సి.ఓ.2013**

2014 పార్లమెంట్ ఎన్నికల జరగడానికి కొన్ని నెలల ముందు ఒక అధికారిక ఆర్డర్ ద్వారా ధరల నియత్రణ చట్టాన్ని తలక్రిందులు చేశారు. మొట్టమొదటి ధరల నియంత్రణ చట్టం 1979లో అత్యవసర వినిమయ చట్టం ద్వారా అన్ని రకాల ఔషదాలను ధరల నియంత్రణలోకి తీసుకువచ్చి, ఔషధాలను మూడు భాగాలు చేసి ధరలు నిర్ణయించింది. మొదటి లిస్టులో అత్యవసర మందులు పొందుపరిచారు.(145) మొదటి లిస్టు వాటి ధర తయారీ మీద 40 శాతం అదనంగా, రెండోలిస్టు వాటికి 50 శాతం, మూడోలిస్టు వాటికి నూరుశాతంగా ధరలు నిర్ణయించారు.

నూతన సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమయిన దగ్గర నుంచి, 1987లో, 1995లో ధరల నియంత్రణ చట్టాన్ని నిర్వీర్యం చేసి, ధరలను పెంచేశారు. ఇప్పుడు అత్యవసర మందుల లిస్టులో కేవలం 76 రకాలు మాత్రమే ఉన్నాయి. అదికూడా తయారీ ధర మీద నూరుశాతం లాభం మరియు ఎక్సైజ్‌పన్ను విధించారు. 2013 ధరల నియత్రణ చట్టంతో ధరల నియత్రణ పద్ధతిని మార్కెట్‌కి వదిలేసారు. 2005లో సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎన్‌ఎల్‌ఇఎం దేశ అవసరాలకి కావాల్సిన 348

> ఆర్థిక సంక్షోభం ప్రభావంతో పెట్టుబడిదారులు, వారి రాజకీయ గుంటనక్కలు ప్రత్యామ్నాయ మార్గాలను వదిలివేసి, లాభాల కోసం శవాల మీద వేట ప్రారంభించారు. ప్రజారోగ్య రంగంలో దుర్మార్గమైన విధానాలను తేవడం, గుత్తాధిపత్యానికి అనుమతించడం ద్వారా, కొద్దీ గొప్పో మిగిలిన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలు, సేవలు రానున్న కాలంలో కనుమరుగుకానున్నాయి.

రకాల మందుల పట్టీని అనుభవజ్ఞులు తయారు చేశారు. ఈ మందుల ధరలను మార్కెట్‌లో కనీసం ఒక శాతం షేరు ఉన్న మందుల కంపెనీల సగటు ధరలను బట్టి నిర్ణయించాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో పదిశాతం వరకు పెంచుకోవచ్చని వెసులుబాటు ఇచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలో రాగానే ఎన్‌ఎల్‌ఇఎం లిస్టులో ఉన్న 348 సంఖ్యను 376కి పెంచింది కాని, వాటిధరలను ఏ రకంగాను నియంత్రించలేదు.

**అత్యవసర మందులపై పన్నులు**

2013 జూలై 29 వ తేదీన వెలువడిన సెంట్రల్ ఎక్సైజ్ నోటిఫికేషన్ 22/2013 ద్వారా గత యు.పి.ఏ ప్రభుత్వం ఎన్‌ఎల్‌ఇఎంలో ఉన్న అన్ని మందుల మీద కేంద్ర పన్నులన్నింటిని రద్దుచేసింది. కాని మోడీ ప్రభుత్వం రాగానే వాటన్నింటిని దొడ్డిదారిన జి.ఎస్.టి పరిధిలోకి లాగింది. 2017 జూలై 1 నుండి అమలోకి వచ్చిన జి.ఎస్.టి రేటు షెడ్యూల్‌లో కొన్ని జిమ్మిక్కులతో అసలు అమలులోలేని మందుల పట్టిక నుంచి అత్యవసర మందులను నిర్ణయించి, ఎన్‌ఎల్‌ఇఎంలో ఉన్న 348 రకాల మందులను విస్మరించింది. మోడీ ప్రభుత్వానికి ఎన్‌ఎల్‌ఇఎంలో లిస్టే కనబడలేదు. ఇప్పుడు ఎన్‌ఎల్‌ఇఎం లిస్టులో ఉన్న మెజారిటీ మందుల మీద 18 శాతం జి.ఎస్.టి వర్తిస్తోంది. అత్యవసర మందుల పట్టికలో ఉన్న 76 మందులపై కూడా 12 లేదా అంతకన్నా ఎక్కువ జి.ఎస్.టి వర్తిస్తోంది. గతంలో ఉన్న సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ బదులు ఇప్పుడు సెంట్రల్ జి.ఎస్.టి తో పాటు ముడిసరుకు తయారీ దశలోనే సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ విధించటం వలన కొన్ని మందులు ఉత్పత్తి ధర కన్నా 100 నుండి 500 శాతం అధికంగా ఉంటున్నాయి. ఈ విధానం వలన అత్యవసర మందుల ధరలు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. అందువలన సెంట్రల్ జి.ఎస్.టి వస్తు విలువను బట్టి ధరను నిర్ణయించేలా మారి, కంపెనీ రిటైల్ ధర అనివార్యంగా పెరుగుతుంది. కాబట్టి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గతంలో అత్యవసర మందులపై రాష్ట్రాలలో సేల్స్ టాక్సులు ఉండేవికావు. ఇప్పుడు జి.ఎస్.టి దేశవ్యాప్తంగా అమలు చేయటంతో ఈ విధానం కూడా రద్దై మందులపై పన్ను విధింపులో ఉన్న ఆ కొద్దిపాటి వెసులుబాటు లేకుండాపోయింది.

ఈ నేపథ్యంలో అత్యవసర మందుల ధరలను నిర్ణయించడంలో తయారీ ధరను ప్రాతిపదికగా తీసుకోవాలని, ధరలను ప్రభుత్వ నియంత్రణలో ఉంచాలని, జి.ఎస్.టి నుంచి వీటిని పూర్తిగా మినహాయించాలని దేశవ్యాప్తంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

**ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయటం**

దేశంలో ప్రజలకు తక్కువ ధరలకే మందులు అందచేయాలనే సంకల్పంతో ఎన్నో ప్రభుత్వ రంగసంస్థలను స్థాపించాం. విదేశీ మందుల కంపెనీల ఆధిపత్యానికి తెరదించి ధరలను అదుపులోకి తెచ్చాం. కాని 1980 ప్రాంతం నుండి ప్రారంభమైన ప్రయివేటు ఔషధ లాబీదారుల ఒత్తిడి మేరకు, క్రమంగా వీటిని నిర్వీర్యం చేస్తూ అంతిమంగా వాటిని మూసేసే దశకి తీసుకువచ్చారు. 2008లో దేశవ్యాప్తంగా ఉన్న జన ఔషధి దుకాణాలకు మందులను సరఫరా చేయిద్దామనే తలంపుతో వీటికి పునరుజ్జీవనం ప్రసాదిస్తే, మోడీ గారు రాగానే ఈ సరఫరా బాధ్యతను ప్రయివేటు కంపెనీలకు అప్పచెప్పి, ఈ ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేయడానికి నిర్ణయించారు.

**ముగింపు**

దయ్యానికి దాని వాటా చెల్లించాల్సిన సమయం ఆసన్నమయ్యింది. మానవ జీవనానికి అత్యవసరమయిన ఆరోగ్య సంరక్షణలో అనుసరించాల్సిన వైఖరిని విస్మరించి, కొద్దిమంది గుత్త పెట్టుబడిదారుల లాభాల కోసం వాటిని ఆరోగ్య వ్యాపారంలో దిగ్గిజాలైన బహుళజాతి కంపెనీల ఒత్తిడితో, నిర్బంధంతో సామాన్య ప్రజలు జీవితాను దుర్భరం చేసే విధానాలను ముందుకు తెచ్చింది.

మరోవైపు కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం, ముదిరిపోతున్న ఆర్థికమాంద్యం ప్రభావంతో పెట్టుబడిదారి వర్గాలు, వారి రాజకీయ గుంటనక్కలు ప్రత్యామ్నాయ మార్గాలను వదిలివేసి, లాభాల కోసం శవాల మీద వేట ప్రారంభించారు. ఇంతటి దుర్మార్గమైన విధానాలను ప్రజారోగ్య రంగంలో తేవడం గుత్తాధిపత్యానికి అనుమతించడం ద్వారా, కొద్దీ గొప్పో మిగిలిన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలు, సేవలు రానున్న కాలంలో కనుమరుగుకానున్నాయి. అంతిమంగా తొలగించవేయబడతాయి. ఇవన్నీ చూస్తూ కూడా మనం నిశ్శబ్దంగా ఉంటే, ఈ కిరాతకమైన కుట్రలో ప్రజలు బలిపశువులైపోతారు. పాలకవర్గాల నీచపు చర్యలను, అంతర్జాతీయ బహుళజాతి సంస్థలకు తొత్తులుగా మారిన వైఖరులను మనం ఎండగట్టాల్సిన సమయం ఆసన్నమయ్యింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా త్వరితగతిన కార్మిక, కర్షక ఉద్యోగ వర్గాలన్నింటికి ఒక తాటిమీదకు తెచ్చి ఉద్యమాన్ని నిర్మించాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది.

**డిమాండ్లు:**

1. ఎన్.డి.హెచ్.ఎం ని వెంటనే ఉపసంహరించాలి.
2. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థల ప్రయివేటీకరణ ఆపివేయాలి.
3. సార్వజనీన ఆరోగ్య సేవలు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయాలి.
4. జి.డి.పిలో మూడు శాతం ప్రజారోగ్యానికి కేటాయించాలి.
5. మందుల ధరలను తగ్గించాలి.
6. అత్యవసర మందుల ధరలను తయారీ ధరల ఆధారంగా నిర్ణయించాలి.
7. అత్యవసర మందులపై జి.ఎస్.టి ని తొలగించాలి.
8. తగినన్ని ధరలు కేటాయించాలి. ప్రభుత్వ రంగ ఔషధ పరిశ్రమలను పునరుద్ధరించాలి.

❋

# మోడీకి దాసోహమైన డిజిటల్ మీడియా




మార్చి 31, 2018 నాటికి భారతదేశంలో లక్ష పత్రికలు ప్రచురించబడుతున్నట్లు వార్తాపత్రికల రిజిస్ట్రార్‌లో నమోదు చేయబడ్డాయి. లక్ష పత్రికలకి 24 కోట్ల సర్క్యులేషన్ ఉంది. భారతదేశంలో 850 టీవీ ఛానెల్స్ ఉండగా, 19.70 కోట్లు టివి లు ఉన్నాయి. జూలై 2020 నాటికి 46 కోట్ల మంది ఇంటర్నెట్ ని, 17 కోట్ల మంది ట్విట్టర్ ని వినియోగిస్తున్నారు (ప్రశాంత్ భూషణ్ ట్వీట్స్ ద్వారా అపకీర్తి పొందిన ముగ్గురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సహా). సుమారు 30 కోట్ల మందికి వాట్సాప్ అకౌంట్స్, 33 కోట్లు మందికి ఫేస్‌బుక్ ఖాతాలున్నాయి.

మోడీ రాకతోనే అచ్చేదిన్ వచ్చేస్తుందని, అది కనుచూపుమేరలోనే ఉందని సోషల్ మీడియాను ఉపయోగించుకొని 37 శాతం ప్రజలు బిజెపికి ఓటు వేసేలాచేయడంలో సక్సెస్ అయ్యారు. సుప్రీంకోర్టు తీర్పుతో అయోధ్యలో రామాలయం నిర్మాణానికున్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని, ఇక మిగిలినది కాశీ, మధురలే అని వీటికి అనుకూలంగా కూడా కోర్టు తీర్పులు రానున్నాయని బిజెపి శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. ఇరవై మంది భారతీయ సైనికుల మరణానికి కారణమైన చైనాకు తగిన సమాధానం భారత్ ఇచ్చిందని 69 శాతం ప్రజలు ? ఆర్థిక వ్యవస్థ నడక తీరుపై 50 శాతం ప్రజలు సంతోషంగా ఉన్నారని భావిస్తున్నట్లు ఇటీవల సేకరించిన అభిప్రాయ సేకరణలో వెల్లడైనట్లు బిజెపి నమ్మించే ప్రయత్నం చేస్తున్నది. లాక్‌డౌన్ ప్రకటించి ప్రజలపై భారాలు వేస్తుంటే, లక్షలాది మందిని ఉద్యోగాల నుండి తొలగించి నిరుద్యోగులుగా మారుస్తుంటే ప్రభుత్వం చక్కగా పనిచేస్తుందని ప్రజలు భావిస్తున్నారని చెబుతున్న ఒపీనియన్ సర్వేను ఎందుకు ప్రశ్నించకూడదు? చైనా సైనికులు పాంగోంగ్ సరస్సు ఒడ్డునే వాటర్ పోలో ఆట ఆడుతున్నప్పటికీ ఎవరూ ఎల్.ఎ.సిని (లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్) దాటి భారత భూభాగంలోకి రాలేదని, ప్రధానమంత్రి (పొలిటికల్ సైన్స్‌లో దేశం మొత్తంలో ఒకే ఒక్క పోస్ట్‌గ్రాడ్యుయేట్) చెప్పిన దాన్ని ప్రశ్నించకుండా ఎలా నమ్మగలం ?

12 కోర్టులు, బార్ అసోసియేషన్లు కలిసినా చేయలేని విధంగా పౌరహక్కుల రక్షణ కోసం పోరాటం చేస్తున్న న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డాడని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని న్యాయవాద సంఘాలు, బార్ అసోసియేషన్లతో పాటు వెయ్యిమంది ప్రముఖ న్యాయవాదులు(ఎవరో తెలియదు) సమర్థించారని ప్రచారం చేస్తున్నారు. పాపడ్ తింటే, ఆవు పేడ రాసుకుంటే, బురదలో పొర్లి శంఖం ఊదితే, దీపాలు వెలిగిస్తే, చప్పట్లు కొడితే కరోనా ఖచ్చితంగా రాదని, చైనా, నేపాల్, బంగ్లాదేశీయుల వలనే కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయని బిజెపికి చెందిన కేంద్ర మంత్రులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. కరోనా వైరస్ ధాటికి ప్రతిరోజు వెయ్యి మంది మరణిస్తుంటే పట్టించుకోని బిజెపి ప్రభుత్వం, తనకు వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తులను, సంస్థలను మాత్రం అణిచివేస్తున్నది.

లడఖ్ గురించి చెబుతున్న అబద్ధాలు, ఉత్తరప్రదేశ్‌లో అత్యాచారాలు, అస్సాంలో వరదల కంటే బాలీవుడ్ నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య వెనకున్న రహస్యం ఏంటీ ? రియా చక్రవర్తి పాత్ర ఏంటనే కథనాలకే మీడియా ప్రాధాన్యత ఇస్తున్నది. కరోనా సమయంలోనే వివాదాస్పదమైన, విషతుల్యమైన నూతన విద్యావిధానాన్ని బిజెపి ప్రభుత్వం బలవంతంగా అమలు చేయడానికి పూనుకుంది. సిలబస్ నుండి పౌరసత్వం, జాతీయవాదం, లౌకికతత్వం, ఫెడరలిజం ఇంకా మన రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు చెందిన చాప్టర్లను ఏకపక్షంగా తొలగించింది. సామాజిక వేత్తలు, మానవహక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలు, విద్యార్థుల మీద తప్పుడు కేసులు పెట్టి మోడీ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. ఈశాన్యఢిల్లీ మారణహోమానికి గల కారణాలను వెలికితీయటానికి జరగాల్సిన దర్యాప్తును , పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగిస్తున్న ఆందోళనలకు చెక్ పెట్టేలా చేయటానికి అన్ని రకాల ప్రయత్నాలు మోడీ – అమిత్ షా ద్వయం చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈశాన్యఢిల్లీపై దర్యాప్తు ప్రారంభం అయ్యే నాటికే దాన్ని ఎలా ముగించాలనే విషయంలో స్పష్టమైన అవగాహన కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి ఉందన్నది సత్యం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డైరెక్షన్‌లో సాగిస్తున్న ఎఫ్ఐఆర్ రాజకీయాలు సహజ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కాయి. లౌకిక ప్రజాతంత్ర శక్తులను, రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టి, బెదిరించి నోరు మూయించే సాధనాలుగా పోలీసు వ్యవస్థలను తయారు చేసి, సరికొత్త గుజరాత్ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయటానికి బిజెపి పూనుకుంది.

దేశంలో రోజురోజుకూ కొత్త రికార్డులను సృష్టిస్తూ కరోనా కేసులు పెరుగుతున్నాయి. అనేక రాష్ట్రాల్లో వరదలు జన జీవనాన్ని అతలాకుతలం చేస్తుంటే నెమళ్ళకు మేత వేస్తున్నదీ, అవి పురివిప్పి ఎలా ఆడుతున్నది చూపుతూ ఆగస్టు 23న మన ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా విడుదల చేసిన నెమలి వీడియోకు మీడియా బాగానే ప్రాచుర్యం కలిగించింది. ముఖ్యమైన రాజకీయ సంఘటనలపై ప్యానెల్ చర్చ చేయడానికి ఎలక్ట్రానిక్ మీడియాకు సమయం ఉండదు కానీ నెమళ్ళకు ఆహారం అందిస్తున్న ప్రధానమంత్రిని చూపించడానికి మాత్రం తగినంత సమయం ఉంటుంది.

రాజకీయాల పట్ల తటస్థంగా ఉండే జర్నలిస్ట్ థామస్ జఫెర్సన్ వార్తాపత్రికలు చదివిన వ్యక్తి కంటే, చదవని వాడే మంచి విద్యావంతుడని చెప్పాడు. దురదృష్టవశాత్తూ

> **"మోడీ ప్రభుత్వంపై విశ్వాసంతో టీవీ యాంకర్లు ప్రభుత్వప్రచారకర్తలుగా మారిపోయారు. టీవీ ప్రేక్షకులకు, పత్రికా పాఠకులకు వాస్తవాలను అందించడానికి మీడియా నిరాకరిస్తున్నది. టి.వి ప్యానల్ చర్చల్లో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై దౌర్జన్యం చేస్తున్నారు. మోడీ ప్యాక్టరీలో తయారైన యాంకర్స్ ప్రభుత్వానికి బాకాలుగా మారిపోవడం దీర్ఘకాలంలో మన దేశానికి చాలా ప్రమాదకరం."**

ఈరోజు అతను బ్రతికి ఉన్నట్లుయితే టీవీ, ఇంటర్నెట్‌ను కూడా వార్తాపత్రికల జాబితాలో చేర్చేవాడు. ఈరోజు మీడియా పోషిస్తున్న పాత్ర అంతకన్నా భిన్నంగా ఏమీ లేని పరిస్థితి. దేశంలో కవర్ చేయడానికి సమస్యలేమీ లేవన్నట్లు మోడీని పొగడటంలోనే టీవీ చానెల్స్ మునిగితేలుతున్నాయి. అవాస్తవాల కుమ్మరింతలో నిండిన ఎల్లో మీడియా కథనాలను చూస్తుంటే సమాజం ఇంతటి తిరోగమనంలో పయనిస్తోందా అనే సందేహం కలగకమానదు. ప్రపంచంలోనే అత్యధిక కరోనా కేసులు నమోదైన దేశాల జాబితాలో భారత్ అగ్రస్థానానికి చేరిన వైనాన్ని పట్టించుకునే తీరిక బడా మీడియా సంస్థలకు దొరకడం లేదు. మైనస్ 23.9 శాతానికి పడిపోయిన భారత స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) పతనంపై విశ్లేషణ ఇద్దామన్నా సమయం లేని పరిస్థితి.

ఈరోజు నిజమైన వార్తలు భూతద్దం వేసి వెతికినా కనపడని పరిస్థితి. ప్రభుత్వ దుశ్చర్యలను బహిర్గతం చేయడం, విభిన్న ఆలోచనలకు అవకాశం కల్పించడం, వాస్తవాలను ప్రతిబింబించేలా కథనాలను ప్రసారం చేయడం, చర్చలు జరపడం ఎలక్ట్రానిక్ మీడియా చేయాలి. ఇవి చేయకుండా 800 టీవీ ఛానళ్ళు, లక్షల సంఖ్యలో పత్రికల సర్క్యులేషన్ ఉన్నా ఉపయోగం లేదు. ఈ రోజు ప్రజలకు వాస్తవాలను తెలియజేసే వార్తలను మీడియా అందించడం లేదు. మీడియాలో చెప్పేవి, చూపించేవి ఘర్షణలు, అరుపులు మాత్రమే. ప్రత్యర్థులపై బురద చల్లడం, ద్వేషం, కోపం ప్రదర్శించే ట్రిక్కులు చేస్తూ మతోన్మాద పిడివాదులకు ఛానల్స్ బాకాలుగా మారాయి. అంగవైకల్యం బారిన పడిన వారిలా, మతోన్మాదం మత్తులో యాంకర్లు చిందులు తొక్కుతున్నారు. ఫేక్ కథనాలు ప్రసారం చేస్తున్నారు. యాంకర్స్ అవాంఛనీయమైన పదజాలాన్ని ఉపయోగించి వార్తలను చంపేస్తున్నారు. నిజాలను, ప్రత్యామ్నాయాలను ఫేక్ వార్తలతో కలగాపులగం చేయడంతో మీడియా మురికి కూపంగా మారిపోయింది. బిజెపి నాయకత్వంలో పనిచేసే ఐటి సెల్ ట్రోలర్స్ కంటే స్వప్రయోజనాలు ఆశించే సంపాదకులు, పెయిడ్ యాంకర్స్ బిగ్గరగా అరుస్తున్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో మూలస్తంభం అని చెప్పుకునే మీడియాలో ఒక సెక్షన్ బిజెపి ప్రభుత్వానికి బాకాలుగా మారడం విచారకరం. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుంబిగించిన మీడియా నేడు మోడీ ప్రభుత్వ నిరంకుశ చర్యలు విషయంలో రాజీ పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

వ్యవసాయ బిల్లులు, కార్మిక చట్టాలు మార్పు, అక్రమ కేసులు, అరెస్టులు, కరోనా వైఫల్యాలు వంటి ముఖ్యమైన అంశాలపై ప్రజలను ఆలోచించనీయకుండా ఉద్దేశ్యపూర్వకంగానే దారి మళ్ళించే కథనాలను మీడియా యజమానులు సృష్టిస్తున్నారు. ఇటీవల జరిగిన సంఘటనలపై మీడియా ప్రతిస్పందనలను పరిశీలించండి. బాలివుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణంపై ఇంతకు ముందు ఎన్నడూ చూడని విధంగా మీడియా ప్రాధాన్యత ఇస్తున్నది. గత రెండు నెలలుగా సమస్యలేమీ లేనట్లు టీవీల్లో ప్రచారం చేస్తున్నారు. మీడియా, న్యాయవ్యవస్థ ఈ సమస్యను సర్కస్ కంటే హీనంగా మార్చేశారు. టీవీ యాంకర్స్ కల్పిత కథనాల ద్వారా సుశాంత్‌సింగ్ మరణానికి డజను కారణాలు (వ్యక్తిగత దూషణలు, అత్యాచారం ఆరోపణలు, బలవంతంగా డబ్బులు వసూలు (దోపిడీ), రాజకీయాలు, బంధుప్రీతి, డ్రగ్స్ మరియు మానసిక అనారోగ్యం) ఉన్నట్లు నిర్ధారించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రసారం చేసే వార్తలతో కొందరి పలుకుబడి, కెరీర్లు నాశనం అవుతున్నాయి.

ఒక ఛానెల్ అతని ఫోటోను మాత్రమే ఆధారం చేసుకొని సుశాంత్ సింగ్ మరణంపై వివరణాత్మక ఫోరెన్సిక్ మరియు పోస్టుమార్టం కథనాన్ని ఇచ్చింది. మీడియా కథనాల్లో, సంపాదకీయాల్లో సుశాంత్‌ది ఆత్మహత్య కాదు, హత్య అని నిరూపించడానికి ఏడు కారణాల జాబితా ఇచ్చారు. సెయింట్ విటస్ డాన్సర్‌గా ఖ్యాతి పొందిన యాంకర్ ఒక రాజకీయ నాయకుడిని దోషిగా ప్రైమ్ టైమ్‌లో ప్రకటించారు. ఈ కేసులో ముంబై పోలీసులకు మినహా మిగతా వారందరికీ తమ అభిప్రాయాలు ఉన్నాయి.

లడఖ్ విషయంలో కూడా ఇదే జరిగింది. ప్రధాని మోడీ చైనాకు గట్టి షాక్ ఇచ్చారని మన మీడియా ప్రసారం చేసింది. వందల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించే ప్రయత్నం చేస్తే మన సైన్యం వెనక్కి కొట్టిందని వార్తలు ప్రసారం చేశారు. భారతీయ సైనికుల మరణానికి ప్రతీకారంగానే చైనా వస్తువులని, 150 చైనా యాప్స్ ని నిషేధించి చైనాని ఆర్థికంగా మోడీ దెబ్బతీశారని మీడియా ప్రసారం చేసింది. ఇదే ప్రధాని మోడీ సంకల్పం అని బయట ప్రపంచానికి తెలిసేలా కథనాలు ప్రసారం చేశారు. లడఖ్‌లో ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్నటికీ గత 6 నెలల్లో భారత్ – చైనా సరిహద్దుల్లో ఎటువంటి చొరబాట్లు జరగలేదని, తూర్పు లడఖ్‌లో గాల్వన్ వ్యాలీ ఘర్షణల వల్ల ఏర్పడిన సరిహద్దు ఉద్రిక్తతల తరువాత చైనాతో సంబంధాలు దిగజారలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు ప్రకటిస్తున్నా మీడియా వాస్తవాల్ని దాచిపెట్టి ఘర్షణ వాతావరణం సృష్టించే విధంగా కథనాలు ప్రసారం చేస్తున్నది. కార్పొరేట్ మీడియా యాజమాన్యాలు ఇలాంటి కట్టు కథలు ప్రసారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు.

మోడీ ప్రభుత్వంపై విశ్వాసంతో టీవీ యాంకర్లు ప్రభుత్వ ప్రచారకర్తలుగా మారిపోయారు. టీవీ ప్రేక్షకులకు, పత్రికా పాఠకులకు వాస్తవాలను అందించడానికి మీడియా నిరాకరిస్తున్నది. టి.వి ప్యానల్ చర్చల్లో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై దౌర్జన్యం చేస్తున్నారు. మోడీ ప్యాక్టరీలో తయారైన యాంకర్స్ ప్రభుత్వానికి బాకాలుగా మారిపోవడం దీర్ఘకాలంలో మన దేశానికి చాలా ప్రమాదకరం. ప్రభుత్వం, అధికార పార్టీ ప్రతినిధులు ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా ఉండే మీడియా వ్యవస్థను నాశనం చేస్తున్నారు. గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వం తన పౌరులతో సత్యాన్ని చాలా అరుదుగా పంచుకున్నది. అణచివేయడం, వక్రీకరించడం,

తిరస్కరించడం చేస్తూ మీడియా ప్రభుత్వానికి సౌకర్యవంతంగా తయారైంది. దీనికి బిజెపి ఐటి విభాగంలో పనిచేస్తున్న ప్రతినిధులతో పాటు ఫేస్‌బుక్ కూడా సహాయపడుతున్నది. ఒకవేళ కొంతమంది జర్నలిస్టులు వాస్తవాలను, సత్యాలను ప్రచారం చేస్తే వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారు. కరోనాపై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రిపోర్టింగ్ చేసిన 55 మంది జర్నలిస్ట్‌లని బెదిరించారు. అక్కడితో ఆగకుండా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారు.

సోషల్ మీడియా యావత్ అధికార పార్టీ చేతిలోనే ఉంది. దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, సంఘటనల్లో బాగా ప్రచారం పొందిన కొన్ని అంశాలను మాత్రమే ఫేస్‌బుక్ నిర్ధారించి బహిరంగపరుస్తున్నది. ఫేస్‌బుక్‌లో మిలియన్ల సంఖ్యలో నకిలీ ఖాతాలున్నాయి. సామాజిక మాధ్యమాలు ఫేక్ న్యూస్‌కు అడ్డాలుగా మారాయి. బిజెపికి అనుకూలమైన అంశాలు మాత్రమే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వార్తలను వక్రీకరించి బిజెపికి అనుకూలంగా మలిచి సామాజిక మాధ్యమంలో తప్పుడు పోస్టులను వదులుతున్న ఓ సీరియల్ ఫేక్‌న్యూస్ ప్రచారకుడు తనకు బిజెపి ఐటీ సెల్ సమాచారాన్ని సమకూర్చి పెడుతుందని కుండబద్దలు కొట్టాడు. ఆయన ఫేస్‌బుక్‌లో 'నమో' అనే పేజీకి కో అడ్మిన్, ఎడిటర్ కావడం చర్చనీయాంశంగా మారింది. కిరాయి సైన్యంతో నడుపుతున్న ట్రోలింగ్ వ్యవస్థను నేడు భారతదేశం ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వాయిస్‌కి సోషల్ మీడియా ప్రాధాన్యం ఇవ్వదు, ప్రచారం చేయదు. దీనికి విరుద్ధంగా కొన్ని డిజిటల్ వెబ్‌సైట్స్, ఫ్లాట్‌ఫామ్స్ స్వతంత్ర స్వరాలకు వేదికగా ఉండి వారి వాయిస్‌ని వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసే సంస్థలు, వ్యక్తులు వారి అభిప్రాయాలను, ఆలోచనలను ప్రజలతో పంచుకోవడానికి డిజిటల్ వేదికల్లో అవకాశం ఉంది. పున్య ప్రసూన్ బాజ్‌పాయ్, యోగేంద్ర యాదవ్, అభిసర్ శర్మ, ఫైజాన్ ముస్తఫా, అశుతోష్, ప్రవీణ్ సాహ్నీ, కల్నల్ అజయ్ శుక్లా తదితరులు వాస్తవాలను వెల్లడించే డిజిటల్ విశ్లేషకులుగా ప్రచారం పొందారు. కిరాయి సైన్యం ట్రోల్ చేస్తున్న అంశాలను ప్రజాస్వామ్యంలో ఉన్న ప్రగతిశీల పౌరసమాజం సవాల్ చేస్తోంది. ప్రభుత్వానికి గేట్ కీపర్లుగా పనిచేసే డిజిటల్ విధానాన్ని మార్చాలి. ద్వేషం,

**❝ సోషల్ మీడియా యావత్ అధికార పార్టీ చేతిలోనే ఉంది. దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, సంఘటనల్లో బాగా ప్రచారం పొందిన కొన్ని అంశాలను మాత్రమే ఫేస్‌బుక్ నిర్ధారించి బహిరంగపరుస్తున్నది. ఫేస్‌బుక్‌లో మిలియన్ల సంఖ్యలో నకిలీ ఖాతాలున్నాయి. సామాజిక మాధ్యమాలు ఫేక్ న్యూస్‌కు అడ్డాలుగా మారాయి. ❞**



అపవిత్ర కలయిక: నరేంద్ర మోడీ, ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బెర్గ్

అసహన దోరణులతో ఉన్న సోషల్ మీడియా బావజాలానికి చెక్ పెట్టాలి.

కార్పొరేట్ దిగ్గజాల గుత్తాధిపత్యంలో పని చేస్తున్న కార్పొరేట్ మీడియా, సోషల్ మీడియాను శాసన పర్యవేక్షణ కమిటీలు నియంత్రించాలి. రాష్ట్రపతి మరియు ప్రధానమంత్రుల ట్విట్టర్ పోస్టులను కూడా శాసన పర్యవేక్షణ కమిటీ సెన్సార్ చేయవలసిన పరిస్థితి వస్తున్నది. విద్వేషభావాలు, నిరాధార వార్తలు, వ్యక్తిత్వహననం, దేశ వ్యతిరేక కామెంట్లు, పోస్టులు డిజిటల్ మీడియాలో బాగా పెరుగుతున్నాయి. ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని దుర్వినియోగం చేసినందుకు, విద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించకుండా అనుమతించినందుకు నిరసనగా అడిడాస్, డియాజియో, ఫోర్డ్, హోండా, హెచ్‌పి, హెర్షే మరియు కోకాకోలా లాంటి కార్పొరేట్ కంపెనీలు ఫేస్‌బుక్‌లో వాణిజ్య ప్రకటనలను నిలిపివేశాయి.

భారతదేశంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, బిజెపి ఫేస్‌బుక్‌కు మద్దతు ఇస్తున్నాయి. ప్రభుత్వానికి పక్షపాతంగా ఉన్నందుకు ప్రతిఫలంగా ఫేస్‌బుక్ వ్యాపారానికి ప్రభుత్వం సహకరిస్తున్నది. భారతదేశంలో ఫేస్‌బుక్, వాట్సాప్ వినియోగించడంలో, వాటికి వాణిజ్య ప్రకటనలు ఇవ్వడంలో బిజెపికి ఏ ఇతర రాజకీయ పక్షం సాటిరాదనేది ఇక్కడ గమనార్హం. ప్రభుత్వానికి, ఫేస్‌బుక్‌కి ఉన్న వ్యాపార సంబంధాలను మీడియా బహిరంగపర్చాలి. యాంకర్స్ ప్రైమ్‌టైమ్‌లో చర్చలు జరపాలి. 2019లో కేంబ్రిడ్జ్ ఎనలిటికా చేసిన అధ్యయనం కన్నా పేస్‌బుక్ వ్యవహారం చాలా అధ్వాన్నంగా ఉందని నిపుణులు ప్రకటిస్తున్నారు. ఈ విషయంపై ఫేస్‌బుక్‌ను విచారించాలని కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు శశిథరూర్ డిమాండ్ చేసిన వెంటనే సమాచార సాంకేతిక పరిజ్ఞానంపై నియమించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యక్ష పదవి నుంచి ఆయనను తొలగించాలని బిజెపి ప్రయత్నాలు ప్రారంభించింది.

రాత్రి 9 గంటలకు ప్రసారం అయ్యే న్యూస్ బులిటెన్‌లో ముఖ్యమైన అంశాలను వార్తలుగా వినటానికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. ఇలాంటి జర్నలిజం వలన కూడా ఉపయోగం ఉన్నది. "నిరక్షరాస్యుల అభిప్రాయాలను మనకు చెప్పటం ద్వారా పాత్రికేయ సమాజంలో ఉన్న అజ్ఞానాన్ని కూడా మనకు పరిచయం చేస్తుంది" అని ఆస్కార్ వైల్డ్ ముందుచూపుతో చెప్పిన మాటలు ఎంతో సంతృప్తి కలిగిస్తాయి. చివరిగా గత నెలలో జరిగిన "ఒపీనియల్ సర్వే"ను ఇండియాటుడే కొంత సానుకూల దృక్పథంతో ప్రారంభించింది.

**(స్వేచ్ఛానువాదం: కె.హరికిషోర్)**

# ఫేస్‌బుక్ జియో డీల్ : ఇంటర్నెట్‌పై కార్పొరేట్ ఆధిపత్యం



**రఫీ అహ్మద్**

ఈ సంవత్సరము జూన్ మాసంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) జియో డిజిటల్ సంస్థలో (రిలయన్స్ సంస్థ) ఫేస్‌బుక్ 9.99 శాతం వాటాను కొనడానికి అనుమతి ఇవ్వగానే, అనేక అనుమానాలు వెల్లునెత్తాయి. ముఖ్యంగా "మార్క్ జుకర్‌బర్గ్" (ఫేస్‌బుక్ అధినేత), భారతీయ టెలికాం రంగంలో కేవలం నాలుగు సంవత్సరాల క్రితం 1.8 కోట్ల అతి తక్కువ పెట్టుబడితో ఏర్పడిన జియెా డిజిటల్స్‌లో, ఏకైక అతిపెద్ద విదేశీపెట్టుబడి (సుమారు 43,574) కోట్లు ఎందుకు పెట్టాడానినేది సందేహాస్పదమైనది.

ఈ ఒప్పందం టెలికాం రంగంలో అతిపెద్ద గుత్తాధిపత్యం దిశగా సాగుతుందని చాలా మంది మేధావులు భావిస్తున్నారు. భవిషత్తులో ఇది ఇంటర్నెట్ తటస్థత సుత్రాలను పక్కన పెట్టి, తప్పుడు మార్గంలో ఇండియాలో జీరో రేటింగ్ అమలు చేయనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంటర్నెట్ తటస్థత ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇంటర్నెట్ అనుసంధాన ప్రక్రియలో అందరికీ సమాన అవకాశాలు అందించే వేదికగా ఉండాలని నిర్దేశించబడింది.

దీని ఫలితంగానే ఇంటర్నెట్ సేవలు అందించే వారందరూ అందుబాటులోకి వచ్చే సమాచారం మొత్తాన్ని సమతుల్యంతో అందించాలి. కొన్నింటిని ప్రోత్సహించటం, కొన్నింటిని మరుగు పర్చడం చేయరాదు. అసలు ఇంటర్నెట్ తటస్థతకు మొదటి ముఖ్య కారణం ఏమిటంటే, ఈ సేవలు అందించేవారు ఒకే రకమైన సమాచారం లేదా సారానికే ప్రాధాన్యత ఇస్తుంటే, కొత్తగా సేవలు అందించటానికి వచ్చేవారు వినియోగదారులను ఆకట్టుకోవటంలో కష్టసాధ్యమవ్వటమేకాక, అది అంతిమంగా నూతన ఆవిష్కరణలను నిరోధించటానికి దోహదపడుతుంది.

అందుకే ఇంటర్నెట్ తటస్థతను కాపాడాలి, కొనసాగించాలని పౌరసమాజం డిమాండు చేస్తోంది. ఎందుకంటే ఇంటర్నెట్ సేవలరంగంలో కేవలం కొద్ది భారీసంస్థలను అనుమతిస్తే, ప్రజలకు అందుబాటులోకి వచ్చే సమాచారాన్ని నియంత్రించడం, వారికి అనుకూలంగా ఉన్న సమాచారాన్ని ఎంపిక చేసుకునే గుత్తాధికారం వారిచేతుల్లో ఉంటుంది. దీని వలన కేవలం ఇంటర్నెట్ సేవల చార్జీలు, డేటా ఛార్జీలలో మార్పులకు మాత్రమే పరిమితం కాకుండా, సామాజికంగాను, రాజకీయంగాను తీవ్రమైన ప్రభావాన్ని కలిగిస్తుంది.

ఇక ఇంటర్నెట్ సేవలలో జీరో రేటింగ్ విధానాన్ని పరిశీలిస్తే అదిఒక విధమైన వ్యాపార విధానం అని స్పష్టంగా తెలుస్తుంది. ఇది కూడా ఇంటర్నెట్ తటస్థత గొంతు నొక్కేస్తుంది. ఇందులో ఇంటర్నెట్ సేవలు అందించే వారితో పాటు నేషనల్ మీడియాలో ఉన్నవారి అన్న తమ్ముళ్ళు, అక్కచెళ్ళెల్లు ద్వారా కూడా ఇంటర్నెట్ వినియోగారులను నియంత్రించే పనిలో ఉంటారు.

సులభంగా చెప్పాలంటే ఇంటర్నెట్ సేవలు అందించే వారి ప్రమాణం ప్రకారం వినియోగదారుడు, వారి నెలసరి డేటా పరిధిలో వారికిష్టమైన యాప్‌లో అయినా ఎక్కువగా వాడుకోవచ్చు. ఆ సేవలకు ఎటువంటి నియంత్రణలు ఉండవు, ఉండకూడదు. కాని సేవలందించే సంస్థవారు జీరో రేటింగ్ విధానం ప్రకారం ఫలానా యాప్‌నే వాడుకొండని సెలవిస్తే అది మిగతా యాప్‌ల వాడకాన్ని నిరోధించటం అవుతుంది. ఫేస్‌బుక్ లేదా వాట్సాప్ లాంటి పెద్ద సంస్థలే ఇటువంటి జీరో రేటింగ్ ఒప్పందాలకు సర్వీసు అందించే సంస్థలను తట్టుకొగలవు. అందువలన ఆ సేవలకు వినియోగదారులు వారి ఇంటర్నెట్ సేవలను, డేటాను తప్పనిసరి పరిస్థితిలో ఫేస్‌బుక్ మరియు వాట్సాప్ లాంటి సేవలకు మాత్రమే వినియోగించే రీతిలో జీరో రేటింగ్ వ్యవస్థ ప్రోత్సహిస్తుంది. ఎందుకంటే అది ఉచితంగా లభిస్తుంది. వినియోగదారులు డేటా వాడుకోవంలో అది లెక్కలోకి రాదు.

ఇటువంటి పరిమిత వినియోగపు వ్యవస్థ ఇతర దేశాలలో ఇప్పటికే జరిగింది. ఉదాహరణకి బ్రెజిల్ దేశంలో జీరో రేటింగ్స్ ప్లాను ప్రకారం మోజరిటీ వినియోగదారులకి హద్దులులేని నేషనల్ మీడియా అందుబాటులోకి వచ్చింది. కాని ఇంటర్నెట్ సేవలలో లభించే ఇతర సమాచార వ్యవస్థలు వీరికి అందుబాటులో లేకుండా పోయాయి. బాడ్‌బ్యాండ్ సేవలు ఇప్పటికే అధికధరలలో ఉండటమే దీనికి కారణం. దీని ఫలితంగా ఉచితంగా లభించే వాట్సాప్ మరియు ఫేస్‌బుక్ సేవలలో ఏదైనా అసత్య ప్రచారం జరుగుతుంటే, దాని నిజనిజాలు తెలుసుకోవటానికి వారికి విశాలమైన ఇంటర్నెట్ అందుబాటులో లేకుండాపోయింది.

2015లోనే ఆశ్చర్యం గొలిపే రీతిలో ఫేస్‌బుక్ "ఫ్రీ బేసిక్స్ " పేరుతో ఒక జీరో రేటింగ్ కార్యక్రమాన్ని రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో కలిసి చేయడానికి గట్టి ప్రయత్నం చేసింది. ఇంటర్నెట్ తటస్థతను దెబ్బతీసే ఈ చర్యలపై చాలామంది ఆందోళన వ్యక్తం చేశారు. తటస్థతను తారుమారు చేస్తోందని విమర్శకులు పెద్ద పెత్తున నిరసనలు తెలియ చేయడంతో అంతిమంగా ట్రాయ్, (టెలికాం రెగ్యూలేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) దానిని వ్యతిరేకించింది. ఇంటర్నెట్ తటస్థతను విచ్ఛిన్నం చేయడానికి ఇంకా అనేక ప్రయత్నాలు జరిగాయి. ఉదాహరణకు ఎయిర్‌టెల్ ఆ ప్రయత్నంచేసింది. వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ కాల్స్" కి తన డేటా ప్యాకేజీలకు అదనంగా ఛార్జీలు వసూలు చేయడానికి ప్రయత్నించింది. దీనివలన ఈ సేవలలో "మనం స్కైప్ కాల్స్" అంటాం. వీటికి అధికంగా వసూలు చేయాలని ప్రయత్నం చేసింది. ఈ వివక్షాపూరిత ధరల విధానం పూర్తి స్థాయిలో అమలు కాలేదు. సోషల్ మీడియాలో అప్పటికే ప్రబలుతున్న ఆందోళనలు, ట్రాయ్ నిర్ణయాలు దీనిని నిరోధించగలిగాయి.

**రిలయన్స్ జియో విధ్వంసం**

2016లో రిలయన్స్ జియో టెలికాం వేదిక "జియో ఎకోసిస్టమ్" ఇండియాలో ప్రారంభించ

బడింది. ఇది జరిగిన కొద్ది కాలానికే టెలికాం రంగంలో ఉన్న చిన్న చిన్న సంస్థలు అంతర్ధానమవటం లేదా కొన్నిటిని జియో స్వాధీనం చేసుకోవటం జరిగిపోయాయి. డేటా వాడకంలోనూ, అందుబాటులోకి తేవడంలోనూ జియో ప్రభావం ఆకస్మాత్తుగా పెరిగిపోయింది. నెలసరి వాడకం దేశంలో 20 కోట్ల జి.బి నుండి ఒక్కసారిగా 370 కోట్ల జిబికి ఎగబాకింది. అంతేకాదు, ఈ సేవలు అందించే సంస్థలలో కేవలం నాలుగు మాత్రమే మిగిలేలా పావులు కదిపింది. అవి జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ మరియు బి.ఎస్.ఎన్.ఎల్. ఈ చివరి మూడు సంస్థలు కూడా తమ అస్థిత్వం కాపాడుకోవటానికి ప్రయాసపడే స్థితికి వచ్చాయి. జియో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద ఇంటర్నెట్ సేవలనందించే సంస్థగా ఎదిగింది. ఇది గమనించినందునే తన స్వార్ధ ప్రయోజనాలు నేరవేర్చుకోవటానికి, గుత్తాధిపత్యానికి బాటలు వేయటానికి ఫేస్‌బుక్‌లో జియో పెట్టుబడులు పెట్టింది.

2015లోనే రిలయన్స్, ఫేస్‌బుక్ భారత ప్రజలకు ఇంటర్నెట్ సేవలు అందించే ప్రయత్నం చేశాయి. ఇంటర్నెట్ తటస్థత సూత్రాన్ని భగ్నం చేయడానికి ఒక ప్రయత్నం జరిగింది. ఇందులో మొట్టమొదటిది "లస్సో" అనే యాప్ ద్వారా తక్కువ నిడివిగల వీడియోలను ప్రారంభించింది. ఇది "టిక్‌టాక్"కి పోటీగా తీసుకువచ్చింది. చైనా వెలుపల 12 కోట్లమంది వినియోగదారులు ఉన్న అతిపెద్ద వేదిక ఇది.

ఇంటర్నెట్ సేవలకి చెల్లించలేని పరిస్థితి ఉంటే, అనివార్యంగా ఉచితంగా సేవలు అందిస్తున్న ఫేస్‌బుక్ మీద ఆధారపడతాము. అంతే కాదు ఫేస్‌బుక్ సేవ అంటే ఇంటర్నెట్‌గా, ఇంటర్నెట్ అంటే ఫేస్‌బుక్ అనే భ్రమలోకి నేట్టి వేయబడతాము. లోకోపకారమే తమ ధ్యేయం అని మభ్యపెడుతూ దేశంలో ఇంటర్నెట్ వినియోగదారులను నూతన చట్రంలోకి తేవడమే జూకర్‌బర్గ్ వ్యూహం. ఈ దుష్ట ఆలోచనలను అర్థం చేసుకోలేకపోతే ఫేస్‌బుక్ ఉచిత సేవలే ఇంటర్నెట్ అనే భ్రమలో పడతాం

ఈ నేపథ్యంలోనే ఫేస్‌బుక్ కనుక "లాసో" యాప్‌ను ఆరంభిస్తే అది టిక్‌టాక్ కన్న పెద్దది అవుతుందని విమర్శకులు వాదించారు. అలాగే వాట్సాప్ సేవలకు ఛార్జీలు వసూలు చేసే యాప్ ప్రారంభించటం తీవ్ర విమర్శలకు దారి తీసింది. రిలయన్స్ నెట్‌వర్క్‌తో జట్టుగా మారిపోతుందని అందరూ భావించారు. దేశ రక్షణ, విశ్వసనీయతలు దెబ్బతినే అవకాశం ఉందని, గుత్తాధిపత్వంనికి దారి తీయోచ్చని, ఇతర యాప్‌లు పేటిఎమ్ మరియు మొబిక్విక్ లాంటి అంతర్జాతీయ సంస్థలు తుడిచిపెట్టుకుపోయే అవకాశాలు ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తున్నాయి. పౌరసమాజం యొక్క నిరసనలతో రెగ్యులేటరీ విధానాలు రావటంతో ఫేస్‌బుక్, రిలయన్స్ డీల్ ఆగిపోయింది.

> **"గత చరిత్రను పరిశీలన చేస్తే ఇంటర్నెట్ తటస్థ వైఖరులను ఉల్లంఘించిన వారిని గుర్తించడమే ఒక పెద్ద పరీక్షగా ఉంది. అందువలన జియో గనుక ఇంటర్నెట్ తటస్థ విలువలను తూలనాడితే ట్రాయ్ ఎటువంటి చర్యలు చేపట్ట గలుగుతుందని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు."**

## ఫేస్‌బుక్–జియో ఒప్పందం

ఇంటర్నెట్ తటస్థ సేవలపై చొరవ చూపి నియంత్రణలను పొందుపరిచిన కొద్ది దేశాలలో భారతదేశం ఒకటి. ఇంటర్నెట్ సేవలు అందించే సంస్థలతో టెలికాం డిపార్ట్‌మెంట్ చేసుకున్న ఒప్పందంలో ఈ ఉద్దేశాలు అంతర్లీనంగా పొందుపర్చబడ్డాయి. దీనర్థం ఏమిటంటే " ఇంటర్నెట్ తటస్థం" పై ఎటువంటి చట్టం లేనప్పటికీ లైసెన్స్ అంగీకార పత్రరంలో పొందుపరచ్చబడ్డాయి. ఈ అంశాలు మార్పుకి గురయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చట్టంలో పొందుపర్చితే ఆ విధంగా మార్చటం సాధ్యం కాదు.

ఫేస్‌బుక్ జియో ఒప్పందంపై పౌర సమాజంతో పాటు, వ్యాపార, వాణిజ్య సంస్థల అసోసియేషన్లు కూడా తీవ్రంగా విమర్శలు , నిరసనలు తెలియజేశాయి. తక్షణ, దీర్ఘకాలిక ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని వారందరు నిరసిస్తూన్నారు. కొంతమంది విమర్శకుల అంచనాల ప్రకారం ఇది స్థానికంగా పెద్ద ఉపద్రవం తేవటమేకాక, అంతర్జాతీయ ఈ కామర్స్‌లో బడా సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల కన్నా కూడా మన ప్రయోజనాలను ఎక్కువగాదెబ్బతీయవచ్చు. వీరి వాదన ప్రకారం జియో మరియు ఫేస్‌బుక్‌లు వారి వారి రంగాలలో వారే అగ్రగాములు. ఆ రకంగా వారికి అందుబాటులో ఉన్న సమాచారం (డేటా)ను అంచనావేస్తే, వారిద్దరు కలిసి డిజిటల్ వలస రాజ్యమే స్థాపించగలరు.

అలాగే డేటా మీద ఉన్న అనంతమైన పరిపతి (ఫేస్‌బుక్)ని ఉపయోగించి జియో, ఈ కామర్స్ మార్కెట్‌లో ముందుగా ప్రవేశించి పోటీని నాశనం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కొల్లగొట్టే ధరలతో, ఇతర మెళుకువలతో మార్కెట్‌లో ఉన్న పోటీదారులను తప్పించే ప్రయత్నం చేస్తుంది. ఒకసారి మార్కెట్‌లో గుత్తాధిపత్యాన్ని సాధించిన తరువాత అటు వినియోగదారులకు ఇటు వ్యాపారస్తులను ఆదేశించే పద్ధతులను అమలు చేస్తుంది.

గత చరిత్రను పరిశీలన చేస్తే ఇంటర్నెట్ తటస్థ వైఖరులను ఉల్లంఘించిన వారిని గుర్తించడమే ఒక పెద్ద పరీక్షగా ఉంది. అందువలన జియో గనుక ఇంటర్నెట్ తటస్థ విలువలను తూలనాడితే ట్రాయ్ ఎటువంటి చర్యలు చేపట్ట గలుగుతుందని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు.

అయితే ఇటీవలనే ట్రాయ్ ఒక కొత్త సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. ఇంటర్నెట్ ట్రాఫిక్‌ను అదుపుచేసే చర్యలపై ఎదురవుతున్న సమస్యలను చర్చించటం, అలాగే ఇంటర్నెట్ తటస్థతకు సంబంధించి బహాళ భాగస్వామ్య వేదిక నొకదానిని ఏర్పాటు చేయాలని దీనిలో సూచించింది. దీనిని టెక్నాలజీ సంస్థలు, సేవా సంస్థలు సంతోషంగా ఆహ్వానించగా ఇండియన్ టెలికాం మార్కెటల్లో రెండు అతి పెద్ద షేరు హోల్డర్లుగా ఉన్న భారతీ ఎయిర్‌టెల్ మరియు జియో మాత్రం తటస్థ సుత్రాలు సరిపోతాయని, ఇటువంటి వేదిక అవసరం లేదని ప్రకటించాయి. కాబట్టి ఈ వేదిక ఏర్పడినా, ఏర్పడకపోయినా నిరంతరం పరిగెత్తించే అవకాశం ఉంది.

రిలయన్స్ జియో భారత ప్రజలకు డేటాను అందుబాటులోకి తెచ్చిందనటంలో ఎటువంటి సందేహం లేదు. కానీ దానికున్నటువంటి పరపతిని విస్తారంగా ఉన్నటువంటి వినియోగాదారులకి ఉపయోగపడేలా చూడాల్సి బాధ్యత ట్రాయ్ మీద ఉంది. వినియోగదారుల అవసరాలను పట్టించుకోకుండా, వాటి గొంతునొక్కే విధంగా, వారి వికృత ఆలోచనలు, కొల్లగొట్టే విధానాలను అరికట్టాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఇవి సమతుల్యం, పోటీని అంతం చేసి, దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసే అవకాశం ఉంది.

**(అనువాదం: ఎల్ఎన్ భారవి)**

గ్రామీణ భారతం

# ఉపాధికి ఏదీ హామీ?

ఎ కోటిరెడ్డి



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

ఈ సంవత్సరం దేశంలోని ఎక్కువ భాగంలో సమృద్ధిగా వర్షాలు పడటం తో రైతులు సకాలంలో వివిధ పంటలు వేయటం పూర్తిచేశారు. పంటలు నాటేకాలంలో వ్యవ సాయ కార్మికులతో పాటు కౌలురైతులు, పేదరైతులకు కూడా పనులు దొరికాయి. ఇపుడు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలలో పంటలు వేసే సీజను పూర్తయింది. పంటకోతలు ప్రారంభం కావటా నికి ఇంకా రెండు మాసాలకు పైగా సమయం ఉంది. ఈ కాలంలో చిల్లరమల్లర పనులు మినహా కూలీలందరికీ పనులు దొరకవు. గ్రామాలలో వ్యవసాయ పనులు మినహా ఇతరంగా పనులు దొరికే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సాంప్రదాయకంగా గ్రామాలలో పనులు చేసే కార్మికులతో పాటు పట్టణాలు, నగరాలకు వలసలు వెళ్ళి పనులు చేసుకుంటున్న వారిలో ఎక్కువ మంది కోవిడ్ 19 మహమ్మారి కారణంగా లాక్‌డౌన్ విధించిన సమయంలో గ్రామాలకు చేరుకున్నారు. పట్టణాలు, నగరాలలో ఇంకా ఆర్థిక కార్య కలాపాలు ఊపందుకోకపోవటం, లాక్‌డౌన్ సందర్భంలో ఎదుర్కొన్న ఇబ్బందుల కారణంగా ఏర్పడిన భయాందోళనలతో కొందరు తిరిగి పట్టణాలు, నగరాలలో పనులకు వెళ్ళటానికి విముఖంగా ఉన్నారు. ఈ కారణాల వలన ఈ సంవత్సరం గ్రామాలలో వ్యవసాయ రంగంపై ఆధారపడి, కూలిపనులు చేసుకొనే వారి సంఖ్య పెరిగింది. కాబట్టి రానున్న రెండు మాసాల పాటు గ్రామాలలో పనిచేయటానికి సిద్ధపడేవారందరికీ ఉపాధిహామి పనులు కల్పించటానికి ప్రభుత్వం పూనుకోవాలి.

ఇపుడు ఉపాధిహామి పనులు డిమాండ్ చేస్తుంటే చాలామంది వ్యతిరేకిస్తుంటారు. అందుకు వారు చెబుతున్న కారణాలు ఈ విధంగా ఉంటాయి. ప్రస్తుతం పొలాలన్నీ పచ్చగా ఉన్నాయి. వ్యవసాయ పనులు బాగానే దొరుకుతున్నాయి. గ్రామీణప్రాంతంలోని ప్రజలందరూ పనులు చేసుకొంటూ సుఖంగా ఉన్నారు. ఈ సంవత్సరం పంటలు కూడా బాగా పండుతాయి. ఇటువంటపుడు ఉపాధిహామి పనులు కల్పించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తారు. వ్యవసాయ పనులు ఉన్న సమయంలో ఉపాధిహామి పనులు ప్రారంభిస్తే కూలీలు వ్యవసాయ పనులకు రారని, అందువలన రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటారని వాదిస్తారు. సంవత్సరం పొడవునా కూలీలకు పనులు కల్పించటానికి ప్రభుత్వం వద్ద నిధులు ఎక్కడ ఉంటాయని, అలా పనులు కల్పించాలంటే ప్రభుత్వం ఎన్ని లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాలని, అలాఖర్చు పెట్టటానికి ప్రభుత్వానికి నిధులెలా వస్తాయని ప్రశ్నిస్తారు. ఇవి పూర్తిగా తప్పుడు వాదనలు. మొదటి అంశం ఏమిటంటే పొలాలన్నీ పచ్చగా ఉన్నంత మాత్రాన వ్యవసాయ పనులు చేసేవారందరికీ పనులు దొరకవు. అందుకు కారణాలు స్పష్టమే. వ్యవసాయరంగంలో పంటలు వేసేటపుడు, తిరిగి పంటకోతలు జరిగేటపుడు మాత్రమే ఎక్కువ పనులు ఉంటాయి. ఆ సమయాలలో వ్యవసాయ పనులు కోరేవారందరికీ దాదాపుగా పనులు దొరుకుతాయి. పంటలు వేయటం పూర్తయిన తర్వాత కలుపు తీయటం, ఎరువులు వేయటం, పురుగుమందులు చల్లటం తదితర పనులు మాత్రమే ఉంటాయి. కలుపు నిర్మూలన మందులు వినియోగించటంతో ఆ పనులు దొరకటం తగ్గిపోయింది. పురుగుమందులు చల్లటానికి పవర్‌స్ప్రేయర్లు, ఇతర యంత్రాలను వినియోగించటం వలన పనులు తగ్గిపోయాయి. ఇతరంగా లభించే పనులు అతి తక్కువగా ఉంటాయి. కాబట్టి కూలీలలో ఎక్కువమందికి పనులు దొరకవు. పనులు దొరకని రోజులలో రైతులలోని పై తరగతులు అంతకు ముందు నిల్వ ఉంచుకున్న ధాన్యం, డబ్బును వినియోగించుకొని తమ జీవనం సాగిస్తారు. వారికి ఎప్పుడు కావాలంటే అపుడు తక్కువ వడ్డీకి రుణాలు కూడా లభిస్తాయి. కాని వ్యవసాయ కార్మికులు, కౌలురైతుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. స్వంతభూములున్న పేదరైతులు కూడా కొంతమేరకు ఇబ్బందులను ఎదుర్కొంటారు. కాని మొదట్లో పేర్కొన్న రెండు వర్గాల వారికి ఎటువంటి ప్రత్యామ్నాయం ఉండదు. ఈ కాలంలో వారికి దొరికేపనులు, వచ్చే ఆదాయం ఉండదు. మరి ఇటువంటి సమయంలో వారెలా బతకాలి? అందువలన ఉపాధిహామి పనులు కల్పించటాన్ని వ్యతిరేకించేవారు వాదిస్తున్నట్లుగా ఈ కాలంలో కూలీలందరికీ పనులు దొరకవు. ఇక పంటకోతలు వచ్చే తరుణంలో కూలీలు వ్యవసాయ పనులకు రారనే వాదన కూడా సరికాదు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నపుడు వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులకే ప్రాధాన్యత ఇస్తారు మినహా ఉపాధిహామి పనులకు వెళ్ళరు. ఉపాధిహామి పనులకు ఖర్చు పెట్టటం కోసం నిధులు సమీకరించటానికి ప్రభుత్వానికి అనేకమార్గాలు ఉన్నాయి. పెట్టుబడిదారులపై పన్నులు వేయటం, వారికిస్తున్న పన్ను రాయితీలను తగ్గించటం, లోటుబడ్జెట్ తదితర మార్గాలు ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం వద్ద నిధులు లేవని చేసే వాదనలు నిలిచేవి కావు.

**ఆధునిక బానిసత్వానికి దారులు**

పనులు దొరకని వ్యవసాయ కార్మికులు పట్టణాలు, నగరాల నుండి గ్రామాలకు తిరిగి వచ్చిన కూలీలకు బతకటానికి అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. వారికి గ్రామంలో అప్పు పుట్టదు. తినటానికి తిండిగింజలు సంపాదించుకోవటం కూడా కష్టమౌతున్నది. ఒకవేళ ఎవరైనా అప్పు ఇచ్చినా తిరిగి తీర్చేదారి ఉండదు. ఇటువంటి పరిస్థితులలో ఉన్నవారికి ఉపాధిహామి పనులు కల్పించటం ద్వారా మాత్రమే వారికి బతక టానికి అవకాశం దొరుకుతుంది. ఈ అంశా లను ప్రస్తావిస్తే ఈ వాదనను కాదనలేక, గ్రామాలలో పంటలున్నపుడు, మాగాణి ప్రాంతాలలో కాలువలు, బోదెలు, చెరువులలో నీళ్ళున్నపుడు ఏం పనులు కల్పించటం సాధ్యపడుతుందని ప్రశ్నిస్తారు. గ్రామాలలో జాగ్రత్తగా పరిశీలన చేసి, ప్రణాళిక రూపొందిస్తే వ్యవసాయ కార్మికులకు, పనులు కోరుతున్న పేదలకు ఇపుడు కూడా పనులు కల్పించటానికి అవకాశాలు దొరుకుతాయి.

ఒకవేళ నిజంగానే పనులు లేనప్పటికీ వారు బతకటం కోసం ఉపాధిహామి చట్ట ప్రకారం వారికి ప్రభుత్వం నిరుద్యోగభృతి చెల్లించాలి. అపుడు మాత్రమే వీరు స్వేచ్ఛగా బతకటానికి అవకాశం ఏర్పడు తుంది.

కాని ప్రభుత్వం ఇటువంటి చర్యలు తీసుకోవటానికి, పనులు కోరుతున్నవారికి పనులు కల్పించటానికి సిద్ధంగా లేదు. వ్యవసాయ కార్మికులు, పేదలకు ఉపాధిహామి పనులు కల్పించటాన్ని వ్యతిరేకించే భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారుల వాదన లనే ప్రభుత్వం వల్లె వేస్తున్నది. ఇపుడు పనుల అవసరం లేదని, డిమాండ్ కూడా తక్కువగానే ఉన్నదని ప్రభుత్వం చెబుతున్నది. ఈ వాదనలను అడ్డం పెట్టుకొని పనులు కాని, నిరుద్యోగభృతి ఇవ్వటాన్ని గురించి కాని ప్రస్తావించటం లేదు. ప్రభుత్వం, ఉపాధిహామి పనులు కల్పించటాన్ని వ్యతిరేకించేవారు వాదిస్తున్నట్లుగా నిజంగానే గ్రామీణప్రాంతంలోని పేదలకు పనులు దొరుకు తున్నాయా? వారికి ఉపాధిహామి పనులు కల్పించాల్సిన అవసరం లేదా?

ఈ వాదనలే నిజమని కాసేపు అంగీ కరిద్దాం. మరి పనులు అవసరం లేకపోతే వ్యవసాయ కార్మికులు, పేదలు గ్రామాలను వదిలి పనుల కోసం ఎందుకు వలసలు పోతున్నారు? కోవిడ్ భయంకరంగా కోరలు చాస్తున్నప్పటికీ, దేశంలో పరిస్థితులు భయా నకంగా మారుతున్నప్పటికీ, వలస వెళ్ళినచోట్ల పనులు దొరుకుతాయనే గ్యారంటీ లేనప్పటికీ లక్షలాది మంది వలసలు వెళుతూనే ఉన్నారు. తమస్వంత గ్రామాలలో బతకటానికి అవకాశం ఉంటే వలసలు వెళ్ళాల్సిన అవసరం ఏముంది?

పనులు, ఆదాయం లేక దాయనియమైన పరిస్థితులలో ఉన్న వ్యవసాయ కార్మికులు, పేదలను మధ్య దళారులు ముందుగానే ఒప్పందాలు చేసుకొని దూరప్రాంతాలకు తీసుకుపోతారు. వలస పోయినచోట కార్మికులకు ఎటువంటి హక్కులు, రక్షణలు ఉండవు. పనిగంటలకు పరిమితులు ఉండవు. జరిగే ప్రమాదాలకు యజమానులు బాధ్యత వహించరు. రియల్ ఎస్టేట్, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలు, ప్రమాదాలకు దారితీసే పనులలో కార్మికులు తరచుగా గాయపడటం, చనిపోవటం జరుగుతుంది. వలసలు వెళ్ళిన ప్రాంతంలో వారి గోడు ఆలకించేవారు ఉండరు కాబట్టి జరిగిన నష్టాని పరిహారం పొందటం, కనీసం వైద్య సదుపాయం పొందటం కూడా కష్టమౌతుంది. తమ స్వగ్రామాలలోనే పనుల తరుణం పూర్తయిన తర్వాత ఆర్థికంగా భూస్వా ములు, వడ్డీ వ్యాపారులపై ఆధారపడేవారు వలసలు వెళ్ళినచోట్ల పూర్తిగా అక్కడి భూస్వా ములు, మధ్యవర్తుల దాయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తుంది. పేదలు బతకలేని పరిస్థితులను భూస్వాములు, పెట్టుబడిదారులు, దళారులు బాగా వినియోగించుకొంటున్నారు. తమ జిల్లాలు, రాష్ట్రాలలో పనులు లేని వ్యవసాయ కార్మికులు, పేదలను వదిలివేసి, పనులు చేయించుకోవటం కోసం ఇతర రాష్ట్రాల నుండి కూలీలను తీసుకొస్తున్నారు. ఇతర రాష్ట్రాల వారైతే భాష తెలియదు. కూలిరేట్లు, అదనపు సదుపాయాలు, తదితరాలను డిమాం డ్ చేయరు. వారి సమస్యలను గురించి స్థానికులు పట్టించుకోరు. ఇటువంటి ప్రయోజనాలుంటున్నా యని ఇతర రాష్ట్రాల వారిని తీసుకొచ్చి పనులు చేయించుకుంటున్నారు. ఇపుడు కూడా బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుండి బస్సులు, లారీలలో మన రాష్ట్రానికి కూలీలను తెచ్చుకుం టున్నారు. మనరాష్ట్రం నుండి కూడా ఇదే విధంగా ఇతర రాష్ట్రాలకు కూలీలను తీసుకెళు తున్నారు. రాష్ట్రం కాని రాష్ట్రాలకు వెళ్ళి, భూస్వాములు, రైతుల పశువుల పాకలు, రేకుల షెడ్లు తదితరాలలో తలదాచుకొనే వీరు అధిక వర్షాలు, వరదలతో చెప్పరాని ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పిల్లాపాపలతో తరలివెళు తున్న వీరు అపరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారలేమి వలన కోవిడ్ 19 మహ మ్మారి, ఇతర రోగాల బారినపడే ప్రమాదం అధికంగా ఉంటుంది.

**పనులు కల్పించటంపై శ్రద్ధలేని ప్రభుత్వం**

ఒకవైపు ఉపాధిహామి పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకొంటుండగా, మరోవైపున ప్రభుత్వ సమాచారం ప్రకారమే పనులు అవసరమైన కూలీల కుటుంబాలలో అతి తక్కువమందికి మాత్రమే పనులు కల్పిస్తున్నారని స్పష్టమౌతున్నది. సెప్టెంబరు 26వ తేదీన ఉ పాధిహామి పనుల కల్పనకు సంబంధించి, ప్రభుత్వ పోర్టల్‌లో ఉన్న సమాచారం ప్రకారం మొత్తం 14.43 కోట్ల జాబ్‌కార్డులను జారీ చేయగా 8.78 కోట్ల జాబ్‌కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. జాబ్‌కార్డులలోని మొత్తం కార్మికుల సంఖ్య 28.03 కోట్లు కాగా, 13.55 కోట్ల మంది కార్మికులు యాక్టివ్‌గా ఉన్నారు. ఈ ఆర్థిక సంవతత్సరంలో ఇప్పటి వరకు 212.36 కోట్ల పనిదినాలు, కుటుంబానికి 35.58 పనిదినాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లెక్కలు పొంతన లేకుండా ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన లెక్కలలో 8.78 కోట్ల జాబ్‌కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి కాబట్టి ప్రభుత్వం కల్పించిన 212.36 కోట్ల పనిదినాలు కుటుంబానికి సగటున 23 మాత్రమే వస్తాయి. యాక్టివ్‌గా లేని జాబ్‌కార్డులలో కూడా ఎక్కువ భాగం ప్రభుత్వం ఇక పనులు కల్పించదని భావించి డిమాండ్ చేయనివారు కూడా ఉంటారు. అటువంటి వారిని కూడా కలుపుకుంటే కుటుంబానికి 20 రోజులు కూడా పనులు కల్పించలేదు. ఆర్థిక సంవత్సరంలో ప్రధానంగా పనులు లేని సమయం ఏప్రిల్, మే, జూన్ నెలలు. తర్వాత ఎక్కువ ప్రాంతాలలో సెప్టెంబరు, అక్టోబరు నెలలలో కూలీలకు పనులు ఉండవు. కాబట్టి వాస్తవంగా ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించటంపై శ్రద్ధ పెట్టినట్లైతే ఇప్పటికే ఎక్కువ శాతం కుటుంబాలకు 100 రోజుల పనికల్పించి ఉండాల్సింది. కాని ఇప్పటికి 9,72,453 కుటుంబాలకు మాత్రమే 100 రోజులు పనులు కల్పించారు. అంటే పనులు కోరుతున్న కుటుంబాలలో ఒకశాతం కుటుంబాలకు కూడా 100 రోజులు పనులు కల్పించలేదు. కోవిడ్ 19 మహమ్మారితో విధించిన లాక్‌డౌన్, దానితో వ్యవసాయ కార్మి కులు, వలసలు వెళ్ళి, లాక్‌డౌన్ కారణంగా తిరిగి స్వగ్రామాలకు చేరుకున్న కార్మికుల పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉన్నాయో అర్థం చేసుకొంటే ఉపాధిహామి చట్టం ద్వారా పనులు కల్పించటంలో ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో స్పష్టమౌతున్నది.

కోవిడ్ 19 మహమ్మారిని అరికట్టటం పేరుతో విధించిన లాక్‌డౌన్, ఆర్థికమాంద్యం ఫలితంగా సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ తీసుకోవటం లేదు. కష్టజీవులు, సామాన్య ప్రజలు అసాధారణమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితులలో ప్రభుత్వం ఎటువంటి సహకారాన్ని అందించకపోవటం వలన వ్యవసాయ కార్మికులు, గ్రామాలలోని పేదలు భూస్వాములు, దళారులపై ఆధారపడవలసి వస్తున్నది. వారు కష్టకాలంలో అధికవడ్డీలకు డబ్బులు ఇచ్చి, తక్కువ కూలి ఇచ్చి పనులు చేయించుకుంటారు. ప్రభుత్వం ఉపాధిహామి పనులు కల్పించటానికి చర్యలు తీసుకొని, గ్రామాలలోని కూలీలందరికీ పనులు కల్పిస్తే వ్యవసాయ పనులు లేని రోజులలో వారు స్వతంత్రంగా బతకటానికి వీలవుతుంది. గ్రామీణపేదలకు అటువంటి స్వతంత్రతను కల్పించటానికి పూనుకోకుండా మోడి ప్రభుత్వం వారిని భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్య దళారుల దయాదాక్షిణ్యాలకు వదిలివేసింది. మహమ్మారి విజృంభిస్తున్న వేళ పేదప్రజల జీవితాలపై ఇది అత్యంత దారుణ ప్రభావాన్ని చూపిస్తుంది. వ్యవసాయ కార్మికులు, గ్రామీణపేదల జీవించే హక్కును కాపాడుకోవటం కోసం ఉపాధి హామి పనులు కల్పించమని ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి.

❋

విద్యారంగం

# నూతన విద్యావిధానం: సమస్య, పరిష్కారం



రచయిత విద్యా విధాన పరిశోధకుడు

**యువరాజ్ సింగ్**

### సమస్య

విద్యాభ్యాసానికి అనేక రకాల అర్థాలు, భావనలు ఉన్నాయి. విద్యాభ్యాసం అన్న ఆలోచనతోనే ఎన్నో ప్రశ్నలు ముడిపడి ఉన్నాయి. ఉదాహరణకి విద్యాభ్యాసం చేసేటప్పుడు నేర్పిస్తున్నదేమిటి? విద్యాభ్యాసం ఎందుకు? బోధన – విద్యాభ్యాసం పద్ధతులు ఎలా ఉండాలి? తరగతి గదులలో విద్య నేర్పే క్రమం, సమాజంలో ఉన్న అసమానతలను పెంచు తున్నదా? తగ్గిస్తున్నదా? విద్యాభ్యాసం ఫలితాలను అంచనా వేసేందుకు ఏమయినా కొల మానాలు ఉనాయా? బోధనా విధానం వైరుధ్యాలతో కూడి ఉన్నదా? విద్యావిధాన క్రమం సమానత్వంతో కూడుకొని ఉన్నదా? తది తరాలను పరిశీలించాల్సివుంది.

అయితే జాతీయ విద్యా విధానాన్ని కేవలం ఒకే ఒక సమస్యను దృష్టిలో పెట్టుకుని రూపొందించారు. విద్యాభ్యాసం చేసేటప్పుడు పిల్లలు మౌలికంగా పొందవలసిన అక్షర జ్ఞానం, అంకెలు నేర్చుకోవడాలలో నైపుణ్యం సంపాదించారా లేదా అనే ఒకే సమస్యను మాత్రమే ఈ విధానం పరిశీలించింది? అంటే బడిలో విద్యాభ్యాసం చేయడంలో అసలైన సమస్య "విద్యాభ్యాస సంక్షోభం"గా మాత్రమే జాతీయ విద్యా విధానం గుర్తించింది. బడి బయటికి వచ్చేసరికి బడిలో విద్యాభ్యాసం చేసినందు వలన వచ్చిన ఫలితంపైన మాత్రమే కేంద్రీకరించింది. ఉదాహరణకి: "ప్రస్తుతం విద్యాభ్యాసం చేసినందువలన వచ్చే ఫలితానికి, ఇకపై రావలసిన ఫలితానికి మధ్య నున్న వ్యత్యాసాన్ని సరిచేయాలి ... పసితనంలో పిల్లల రక్షణకు తీసుకునే చర్యల నుండి ఉన్నత విద్య వరకు "విద్యార్థుల శిక్షణలో తరుగుతున్న స్థాయిని గురించి ఆందోళన వ్యక్తం చేసింది. విద్యా వ్యవస్థలో దానిని అత్యంత కీలకమైన లోపంగా భావించింది. "మనం ఇప్పుడు విద్యాభ్యాస సంక్షోభంలో ఉన్నాం. ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులలో ఎక్కువమందికి – దాదాపు 5 కోట్ల మందికి – ప్రాథమిక స్థాయిలో ఉండవలసిన అక్షర, అంకెల జ్ఞానం లేదు" అని ఆందోళన వ్యక్తం చేసింది.

### సమస్యను సృష్టించడం

నయా ఉదారవాద విధానాలు అవలంభిచడం ఆరంభించిన తరువాత, ప్రజా సంక్షేమం కోసం నిధుల కేటాయింపులు తగ్గిన నేపథ్యంలో మార్కెట్ల భాష – సమర్థత, జవాబుదారీతనం, పోటీ, నిరంతర పర్యవేక్షణ, ఫలితాలు వగైరా – భారతదేశంలోని విద్యా విధానంలోకి చొప్పించబడింది. 2005 నుండి వార్షిక విద్యా స్థితిపై నివేదికలు వెలువడడం మొదలయింది. ఇందులో విద్యార్థుల అక్షర జ్ఞానం, అంకెలు నేర్చుకోడంలో నైపుణ్యానికి మాత్రమే ప్రాధాన్యత నిచ్చారు. అదికూడా ప్రభుత్వ పాఠశాలలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. ఇందువల్లనే దేశంలో " విద్యాభ్యాస సంక్షోభం "ఏర్పడిందనే భావన కలిగింది. పైగా 2000 సంవత్సరం నుండి ఓ ఇ సి డి ప్రతి మూడు సంవత్సరాలకు నిర్వహిస్తున్న "అంతర్జాతీయ విద్యార్థుల అంచనా కార్యక్రమం(పిసా) ప్రపంచవ్యాప్తంగా విద్యాభ్యాస సంక్షోభం సృష్టించడంలో కీలకపాత్ర పోషించింది. భారతదేశం 2009లో ఈకార్యక్రమంలో భాగస్వామి అయింది. ఈ పరీక్షలలో పాల్గొన్న 74 దేశాలలో 72వ స్థానం సంపాదించింది. దీని ఫలితంగా భారతదేశ బడులలో "విద్యాభ్యాస సంక్షోభం" తీవ్రంగా ఉందన్న భావనకు మద్దతు లభించింది.

2014లో అనేక మంది విద్యావేత్తలు "విద్య యొక్క పరిధిని కుదించడాన్ని" విమర్శిస్తూ ఆ రకంగా అంచనాలు వేయడం నిలిపి వేయాలని పిసా డైరెక్టర్‌కి లేఖ వ్రాశారు. ఈ రకంగా అంచనాలు వేయడం వలన "అంచనాలకు అందని లేదా అంచనా వేయడానికి వీలుకాని విద్యాభ్యాసం యొక్క లక్ష్యాల పట్ల ప్రభుత్వాలకు శ్రద్ధ లేకుండా పోతుందని" అన్నారు. "విద్య ఎలా ఉండాలో, ఎందు కోసం ఉండాలో అని అందరూ కలిసి ఆలోచించు కోవటాన్ని ఈ ఈ విధానం కుంచించి వేస్తుందని" ఈ విద్యావేత్తలు ఆరోపించారు. ఈ లేఖలో ఓ ఇ సి డి కి, ప్రైవేటు కంపెనీలకు ఉన్న సంబంధాలను ఎత్తి చూపారు. పిసా విధానాల వలన ప్రైవేటు కంపెనీలు ఆర్థికంగా ఎలా లాభపడతాయో బయటపెట్టారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలన్నీ పిసా కొలమానంలో పైకి ఎగబాకడానికి తమ విధానాలను, వ్యవస్థలను ఎలా సవరించుకుంటున్నాయో తెలియచేశారు. ఇప్పుడు జాతీయ విద్యావిధానం పరిస్థితి కూడా ఇదే.

### రోగ నిర్ధారణ

భారతదేశంలో చదువుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్న విషయం వాస్తవమే. కానీ ఈ సమస్యను "విద్యాభ్యాస సంక్షోభం"గా చిత్రించడం సరికాదు. ఎన్ సి ఇ ఆర్ టి విశ్రాంత డైరెక్టర్, విద్యావేత్త, రచయిత ప్రొఫసర్ కృష్ణకుమార్ భారతదేశంలో ప్రభుత్వ పాఠశాలలో సమస్యను "బోధనా సంక్షోభం"గా పిలవవచ్చునని పేర్కొన్నారు. ఎందుకంటే ప్రాథమిక పాఠశాలలలో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

శిక్షణపొందని ఉపాధ్యాయుల (పారా టీచర్లు) ద్వారా ఈ లోటును భర్తీ చేస్తున్నారు. ఉపాధ్యాయులు కాంట్రాక్టు పద్ధతిలో నియమించబడుతున్నారు. వారు అననుకూల పరిస్థితులలో పని చేయవలసి వస్తున్నది. ఒక ఉపాధ్యాయుడు బోధించవలసిన విద్యార్థుల నిష్పత్తి 30:1 ఉంటుందనుకున్నా, మన దేశంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివే 3 కోట్లమంది విద్యార్థులకు ఉపాధ్యాయుడే లేదు. ఈ లోపాన్ని పరిగణనలోనికి తీసుకోని జాతీయ విద్యా విధానం రోగ నిర్ధారణలోనే విఫలమయింది.

అయితే ఈ సమస్యలో అనేక దొంతరలు, కోణాలు ఉన్నందువలన దీనిని కేవలం "అధ్యయన సంక్షోభం"గానో లేదా "బోధనా సంక్షోభం"గానో చూడడం పొరపాటు.

జాతీయ విద్యావిధానం సమస్యను పరిశీలించకముందే కేవలం ఆధ్యాపకుల అసమర్థత వలన ఏర్పడ్డ "విద్యాభ్యాస సంక్షోభం" అనే అంచనాకు వచ్చేసింది. ఉదాహరణకి ఒక చోట "ఉపాధ్యాయులు బోధనలో తమ సమర్థత అత్యున్నతంగా తీర్చిదిద్దుకునేందుకు

అనువుగా, బడులలోని వాతావరణంలో సేవకి, సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ సమూలమైన మార్పులు చేయబడతాయి... మన పిల్లలు తప్పనిసరిగా చదువు నేర్చుకునేటట్టు చూడబడుతుంది" అని ఉంది. ఆ తరువాత విద్యార్థులు సాధించిన ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయులకు గుర్తింపు నివ్వడం జరుగుతుందని కూడా స్పష్టంగా ప్రకటించారు. ఉపాధ్యాయులు వృత్తిపరంగా నిరంతరంగా అభివృద్ధి చెందాలని, వర్కుషాప్స్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు ఇతర కార్యక్రమాలతోపాటు నాయకత్వ, యాజమాన్యపు శిక్షణ నిర్వహించాలని నొక్కి చెప్పడం జరిగింది.

నిరంతర వృత్తిపర అభివృద్ధి కార్యక్రమం గత రెండు దశాబ్దాలలో ఎలా జరిగిందో చూద్దాం. స్వచ్ఛందసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు వృత్తిపర నైపుణ్యం పెంచే పేరుతో శిక్షణా కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఈ సంక్షోభానికి బాధ్యతను ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులపై పెడుతున్నారు కాబట్టి ఈ కార్యక్రమాలను చేస్తున్నారు. చదివే పిల్లల సామర్థ్యం తక్కువ అన్న అంశాన్ని ఉపాధ్యాయులు స్కూలుకు హాజరు కాకపోవటానికి, వారి సామర్థ్యం తక్కువగా ఉండటమే కారణమని ఎఎస్ఇఆర్ ఆరోపణలు చేస్తూ ఈ సంక్షోభానికి ఉపాధ్యాయులను బలిపశువులుగా చేస్తున్నారు. వారి సమర్థత పెంచేందుకు ఎంతగా ప్రయత్నాలు చేసినప్పటికీ 10 లక్షల ఉపాధ్యాయుల ఖాళీలు ఉండడం వలన సమస్య అలాగే మిగిలి పోయింది. అందువలన వెంటనే ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీచేయాలి.

ఉపాధ్యాయ ఖాళీలు త్వరగా భర్తీ చేయబడతాయని జాతీయ విద్యా విధానం చెబుతున్నది "అననుకూల ప్రాంతాలలో, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో, నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో అతి త్వరగా, నిర్ణీత కాలంలో ఖాళీలు భర్తీ చేస్తామని, ఆ ప్రాంతంలో నివసించేవారికి, ఆ ప్రాంత భాష తెలిసిన వారికి ప్రాధాన్యతనిస్తామని" ప్రకటించింది. ఇది అత్యంత సమస్యాత్మక మైన విషయం. ఎందుకంటే ఇది ఆ ప్రాంతంలో ఇప్పటికే పనిచేస్తున్న పారా ఉపాధ్యాయులకు హాని కలిగిస్తుంది. పైగా 2019 జాతీయ విద్య విధానం ముసాయిదా పత్రంలో పారా ఉపాధ్యాయుల నియామకాన్ని రద్దు చేస్తున్నట్టు చేసిన వాగ్దానం తుది విధానపత్రంలో లేకపోవడం మరింత ఆందోళన కలిగించే అంశం.

**పరిష్కారం**

జాతీయ విద్య విధానం ప్రోత్సహించే, "ఫలితాల ఆధారంగా విద్యా ఉండాలన్న విధానం" విద్యాభ్యాసాన్ని సంక్షోభంలోకి నెడుతుంది. ఈ విధానం కొత్తగా రుపొందించబడిన బోధనా పద్ధతి 5+3+3+4, అంటే బడిలోచేరే ముందు పసివారికి రక్షణ కల్పించే సంవత్సరాలను తగ్గించి, వాటిని విద్యకు పునాది అయిన ఒకటి, రెండు తరగతులతో కలుపుతూ బడికి సన్నద్ధులను చేస్తున్నది. ఇది 2005లో రూపొందించిన జాతీయ పాఠ్యాంశాల చట్రం (నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్)కి భిన్నంగా ఉన్నది. ప్రస్తుతాంశాలను ప్రధానంగా చూసి, భవిష్యత్తును నిర్లక్ష్యం చేయుటం పిల్లల సంక్షేమానికి, సమాజానికి, దేశానికి కూడా హాని కలిగిస్తుందని అందులో పేర్కొన్న అంశాలకు ఇది విరుద్ధంగా ఉన్నది. ఈ కొత్త విధానం 2013లో జాతీయ ఇ సి సి ఇ సిఫారసు చేసిన సమగ్ర పాఠ్యాంశ విధాన చట్రానికి కూడా వ్యతిరేకంగా ఉన్నది.

పైగా ముందు సమర్పించిన ముసాయిదాలో సూచించినట్టుగానే, విద్యాహక్కు చట్టం గురించి తుది ప్రకటనలో లేనేలేదు. అంటే 3-6 (మరియు 15-18) వయసు పిల్లల చదువు గురించి ప్రభుత్వాలకు ఏ విధమైన బాధ్యత లేకుండాపోతుంది. సహజంగానే ఈ విధానం వలన ప్రైవేటు పాఠశాలల యజమానులు ఇబ్బడి ముబ్బడిగా లాభాలు పెంచుకుంటారు. ఈ విధానంలో ప్రాథమిక స్థాయికి ముందు ప్రైవేటు బడులలో పిల్లలను చేర్చుకోవడం గురించి మౌనం వహించడం కూడా దేశంలో ప్రైవేటు బడులు విపరీతంగా పెరగడానికి ఆస్కారం కల్పిస్తుంది.

విద్యా విధానం ఎదుర్కొంటున్న సమస్యలకు విద్యను ప్రైవేటీకరించడం ప్రధానమైన పరిష్కారంగా నూతన జాతీయ విద్య విధాన ప్రతిపాదనలలో చూపబడింది. నిజానికి వీరు సమర్పించిన 65 పేజీల పత్రంలో 'ప్రైవేటు' అన్న పదం వాడక పోయినా, అందుకు బదులుగా "ప్రజల మేలు కోసం ప్రైవేటు", "దాతృత్వంతో ప్రైవేటు" అని వాడినా, ప్రైవేటీకరించడమే విద్యారంగంలో సమస్యలకు తారక మంత్రంగా చూపబడింది. మొదటి వ్యక్తీకరణ పరస్పర విరుద్ధమైనది కాగా రెండో దానిని, 'పెట్టుబడిదారుల దాతృత్వం' అని చెప్పుకోవచ్చు. పెట్టుబడిదారుల దాతృత్వానికి, మార్కెట్ యొక్క ఉమ్మడి ప్రయోజనాలకు వైరుధ్యం లేదని, అందువలన ప్రభుత్వాలు సేవలు అందిస్తున్న అన్ని రంగాలకు విస్తరించడానికి మార్కెట్‌కి అనుమతివ్వాలని 'మిక్కెల్ తౌరప్' అనే చరిత్రకారుడు రాశాడు. జాతీయ విద్యావిధానం యొక్క 61వ పేజీలో "పునరుజ్జీవనం, ఆచరణాత్మక ప్రోత్సాహం, విద్యరంగంలో ప్రైవేటు దాతృత్వ సంస్థలకు మద్దతు ఇవ్వాలని" పిలుపునిచ్చారు. 31వ పేజీలో మరింత స్పష్టంగా, నిర్దిష్టంగా "విద్యరంగంలో ప్రైవేటు/దాతృత్వ కార్యక్రమాలను ప్రోత్సహించాలి. అప్పుడు వారు ప్రయోజనకరమైన, ప్రముఖమైన పాత్ర పోషించగలుగుతారు" అని వ్రాసి ఉంది.

రెండు దశాబ్దాల కిందట అటల్‌బిహారి వాజ్‌పాయ్ నాయకత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వ హయాంలో భారతదేశంలోని వ్యాపార దిగ్గజాలు ముఖేష్ అంబానీ, కుమార మంగళం బిర్లా "విద్యారంగం సంస్కరణలకు విధాన రూపకల్పన" అనే ఒక నివేదికను రూపొందించారు. అందులో విద్య మార్కెట్‌కి అనుగుణంగా ఉండాలని సూచించారు. జాతీయ విద్యావిధానం ఈ సిఫారసులకు అనుగుణంగా ఉన్నది.

తాజా విధాన ప్రకటన ఈ నేపథ్యాన్ని మరింత స్పష్టంగా చూపిస్తున్నది. జూన్ 24వ తేదీ మానవ వనరుల (ప్రస్తుతం -విద్య) మంత్రిత్వ శాఖ ప్రపంచ బ్యాంకుతో ఒక ఒప్పందాన్ని చేసుకుంది. ప్రపంచ బ్యాంకును 'బోధనా - అధ్యయనాలు బలపరచడం, ఫలితాలు సాధించడం '(ఎస్.టి.ఏ.ఆర్.ఎస్) కార్యక్రమంతో, రాష్ట్రాలలో ఉన్న బడులలో జోక్యం చేసుకుని, విద్యను మెరుగుపరి చేందుకు ఆహ్వానించింది. ఈ కార్యక్రమం విద్యారంగంలో ప్రైవేటు సంస్థల పాత్రను మరింత పెంచుతుంది. కేంద్ర ఆహ్వానంతో ఇప్పటికే ప్రపంచబ్యాంకు, భారతదేశంలో రాష్ట్రాలు నిధులు సమకూర్చే ప్రాథమిక విద్యలో, జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమాలలో జోక్యం చేసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించదు.

నూతన విద్య విధానం రుపొంచిందినది విద్యార్థుల స్థాయిని పెంచి, పిసాలో స్థానం మెరుగు పరుచుకోడానికనే అనుకుందాం. ఫిన్లాండ్ విద్య విధానం ప్రపంచంలోనే అత్యంత ఉన్నతమైనదని అందరూ అంగీకరించే విషయం. ఆ దేశం పిసాలో అగ్రస్థానంలో ఉంది. కానీ ఫిన్లాండ్ విద్య వ్యవస్థ స్వరూపంలోని కొన్ని ముఖ్యాంశాలు ఏ విధంగా ఉన్నాయో చూద్దాం. ఫిన్లాండ్‌లో బోధనలోగాని, అధ్యయనంలోగాని ఏ విధమైన స్థాయిలు నిర్ణయించబడలేదు. బడుల మధ్య అతి తక్కువ పోటీ ఉంటుంది. విద్యార్థుల స్థాయిని, అధ్యాపకుల పనితీరును పర్యవేక్షించేందుకు ఎటువంటి జాతీయ పరీక్షా విధానం లేదు.

ఫిన్లాండ్‌లో విద్య మెరుగుగా ఉండడానికి అక్కడ మార్కెట్ ఆధారిత విద్యా విధానాలను ప్రతిఘటించటమే కారణమని పసి సాహల్‌బర్గ్ అనే ఫిన్లాండ్ విద్యావేత్త, ఉపాధ్యాయుడు పేర్కొన్నాడు. భారతదేశం, ఫిన్లాండ్ ఏంతో భిన్నమైనవి అయినప్పటికీ విద్య సరుకుగా మారకూడదు అన్నది మరవకూడని అంశం. పాఠశాలలు మార్కెట్ ప్రభావానికిలోను కాకుండా చూడాలి. ఈ పాఠం నేర్చుకోడానికి మనం సిద్ధంగా ఉన్నామా అన్నదే సమస్య.

**(అనువాదం: కె ఉషారాణి)**

**ప్రశ్నలు-సమాధానాలు**

# విద్యుత్‌రంగ ప్రైవేటీకరణే నగదు బదిలి లక్ష్యం




బి.వి. రాఘవులు


**ప్రభుత్వాలు నగదు బదిలీ పథకాన్ని అన్ని రంగాలకు చాపకింద నీరులా ప్రవహింప జేస్తున్నాయి. ఉదాహరణకు వ్యవసాయ విద్యుత్ వినియోగంలో నగదు బదిలీని ప్రవేశపెట్టి, రైతులు వాడుకున్న బిల్లునంతా ప్రభుత్వమే కడతానంటోంది. రేపు రేషన్ కు కూడా ఇదే విధమైన నగదు బదిలీ వస్తుందంటున్నారు. ఎలాంటి అనుమానం రాకుండా చేదు గుళికలకు సుగర్ కోటింగ్‌ను కాస్త అధికంగా దట్టించి, నగదు బదిలీ రూపంలో ప్రజలచేత మింగిస్తున్నారు. ఈ లోగుట్టును రైతులకు గాని, ప్రజలకు గాని సరళంగా, అర్థమయ్యే రీతిలో ఎలా చెప్పాలి? ఇది ప్రమాదకరమని, ఇదొక విషవలయమని ప్రజలు గుర్తించేలా, అర్థం చేసుకునేలా ఎలా చెప్పాలి? – ఓ పాఠకుడు**

విద్యుత్‌రంగ నగదు బదిలీ పథకం ఉద్దేశ్యం ఆయా రంగాలలోప్రైవేటు శక్తులు, సంస్థల ప్రవేశాన్ని సుగమమం జేయడం, ప్రజలకు వెంటనే అర్ధం కాకుండా క్రమేణా ప్రభుత్వ సబ్సిడీ/రాయితీలని తగ్గించుకోవడం.

ఇప్పుడు వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్‌రంగంలో అమలుజేయపూనుకుంటున్న నగదుబదిలి పథకాన్ని పరిశీలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వుద్దేశ్యాలు స్పష్టం అవుతాయి.

బి.జె.పి కేంద్రప్రభుత్వం మోడీ నాయకత్వాన ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని కారు చౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేటు సంస్థలకు త్వరత్వరగా అప్పగించడానికి కార్యచరణ పథకాన్ని అమలు జేస్తుండడం మనకు తెలుసు. అందులో విద్యుత్‌రంగం మొదట వున్నది. దీనికి సన్నాహంగా కేంద్ర విద్యుత్ చట్టాన్ని పంపిణీ, సరఫరా వ్యవస్థలను ప్రైవేటు వారికి అమ్మడానికి అనుగుణమైన సవరణలను చేసింది. విద్యుత్‌రంగం ప్రధానంగా రాష్ట్రాల ఆధీనంలో వున్నందున కేంద్రం సూచిస్తున్న ప్రైవేటీకరణ పథకాన్ని అమలు జేయడానికి రాష్ట్రాలపై నిర్భందం, ఒత్తిడి పెంచుతున్నది. ఇందుకోసం కరోనావైరస్ విపత్తు వలన రాష్ట్రాలకు వచ్చిన ఆర్థిక కష్టాలను ఉపయోగించుకుని బ్లాక్ మెయిల్‌కు పూనుకున్నది. కేంద్రం సూచించిన విద్యుత్ ప్రైవేటీకరణను అమలు జేస్తేనే రాష్ట్రాలు అప్పుజేయడానికి అనుమతి ఇస్తామని షరతు పెట్టింది. అనేక రాష్ట్రాలు ఈ రకంగా షరతుపెట్టడాన్ని వ్యతిరేకిం చాయి. కేంద్రమే అప్పుజేసి తమకు రుణం ఇవ్వాలని కోరాయి. కేరళ వామపక్ష ప్రభుత్వం కేంద్రం విధించిన షరతును అమలుజేయబో మని, విద్యుత్ ప్రైవేటీకరణకు పూనుకోనని తెగేసి చెప్పింది.

కాని వై.ఎస్.ఆర్ పార్టీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజల ప్రయోజనాలకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నది. కనీసం కేంద్ర వత్తిడిని వ్యతిరేకించడానికి కూడా పూనుకోలేదు. పైపెచ్చు కేంద్రం ప్రతిపాదనను అత్యుత్సాహంతో ఆహ్వానించి అందరికన్నా ముందు అమలుజేయడానికి పూనుకున్నది.

దేశంలో 1991లో సరళీకరణ విధానాలు ప్రారంభమయిన తర్వాత ప్రపంచ బ్యాంకు షరతుల్లో భాగంగా విద్యుత్ ప్రైవేటీకరణను అనేక రాష్ట్రాలు అమలు జేశాయి. అయితే ఈ ప్రైవేటీకరణను విద్యుత్ ఉత్పత్తి రంగంలో మాత్రమే అమలుజేయగల్గాయి. ప్రజా ప్రతిఘటనకు భయపడి సరఫరా, పంపిణీ వ్యవస్థలను ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేయలేక పోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన విద్యుత్ పోరాటం ఆ రకంగా ప్రైవేటీకరణ ప్రయత్నా లను మధ్యలోనే ఆపగల్గింది. ఆనాడు తెలుగు దేశం పూనుకుంటే ఇప్పుడు వై.ఎస్.ఆర్.సి.పి సరఫరా, పంపిణీల ప్రైవేటీకణను పూర్తిజేయ డానికి పూనుకుంటున్నది. మతోన్మాద బి.జె.పి ఆదేశాన్ని అమలు జేయడానికి ఎగిరిగంతేస్తున్నది.

విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థలను ప్రైవేటు సంస్థలు తీసుకోవాలంటే లాభదాయకమైన ధరలకు అమ్ముకోవడానికి వాటికి అవకాశం ఇవ్వాలి. నిర్ణయించిన ధరల ప్రకారం వినియోగదారులు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించాలి. క్రమం తప్పకుండా బిల్లులు ఇవ్వాలంటే విద్యుత్ వినియోగం ఎంత చేశారో నిర్ణయించడానికి మీటర్లు కావాలి. మీటర్లు లేకపోతే ప్రైవేటు కంపెనీలు విద్యుత్ సంస్థను కొనడానికి ఇష్టపడవు. ఈ కారణంతోనే మీటర్లు లేకుండా ఉచిత విద్యుత్‌ను పొందుతున్న రైతాంగ మోటర్లకు మీటర్లు పెట్టే ప్రయత్నాన్ని శ్రీకాకుళం జిల్లాతో ప్రారంభించింది.

మీటరుంటే ప్రతినెలా మీటర్ రీడింగ్ ప్రకారం వచ్చే బిల్లుకు చెల్లింపు జరుగుతుంది. చెల్లించకపోతే విద్యుత్‌ను నిలిపి వేయవచ్చు. ప్రైవేటు సంస్థలకు కావాల్సింది ఇదే. విద్యుత్ ఆపివేస్తే ఆడిగేదానికి, ఆందోళన జేసేదానికి వుండదు. ఎందుకంటే ప్రభుత్వం విత్యుత్ సరఫరా జేయడం లేదు కాబట్టి. సబ్సిడీ వుందా? వుంటే ఎవరు ఇస్తున్నారు? అనే అంశం ప్రైవేటు సంస్థలకు అక్కరలేదు. బిల్లుకు సరిపోయిన డబ్బు చెల్లించారా లేదా అన్నదే వాటికి ముఖ్యం.

ఇప్పటి వరకు ప్రభుత్వ నిర్ణయం ప్రకారం రైతాంగానికి ఉచిత విద్యుత్‌ను ఇస్తున్నందున, అయ్యే ఖర్చును కొంతమేరకు ప్రభుత్వం భరిస్తున్నది. మరికొంత క్రాస్ సబ్సిడీ రూపంలో ఇతర వినియోగదారుల నుండి అదనంగా వసూలుజేసి ఖర్చుచేస్తున్నది. అందువలన వ్యవసాయ విద్యుత్తుకు ఇంత ధర అని ఇప్పటికి నిర్ణయం జేయడం లేదు. ఇంతఖర్చు, ఇంత సబ్సిడీ అని విభజన లేదు. కాని ఇప్పుడు అలా కుదరదు విద్యుత్‌ఛార్జీ, దానిలో వుండే సబ్సిడీలు వేరయిపోతాయి. వ్యవసాయానికి సరఫరా జేసే విద్యుత్తుకు పూర్తి స్థాయి ధర నిర్ణయించబడుతుంది. దాని ప్రకారం బిల్లు వస్తుంది. దాన్ని రైతు సంస్థకు చెల్లించాలి. ఆ రకంగా విద్యుత్ ధర నిర్ణయానికి, సబ్సిడీ మొత్తానికి ఉన్న లంకెను తెగ్గొట్టింది. ఈ లంకె తెగకపోతె ప్రైవెటురంగ ప్రవేశం సాధ్యం కాదు.

ప్రభుత్వం సబ్సిడీని కొనసాగించదల్చుకుంటే ప్రైవేటు సంస్థతో సంబంధం లేకుండా రైతుకు అందించే మార్గంగా నగదు బదీలి పద్ధతి వచ్చింది. ప్రభుత్వం ఇవ్వదల్చుకున్న సబ్సిడీ నేరుగా రైతు బ్యాంకు ఎకౌంటులో పడుతుంది. ఇప్పటి వరకు విద్యుత్ ధర ఎంతయినా రైతుకు వ్యవసాయ విద్యుత్తు ఉచితంగా వస్తున్నది. ఇప్పుడు విద్యుత్ ధర, సబ్సిడీ వేరయిన తర్వాత దానంతటే విద్యుత్ ధరంతా సబ్సిడీ రూపంలో రైతుకు అందాల్సిన అవసరం లేదు.

ధర పెరిగినప్పుడల్లా, ఆ ధరనంతా సబ్సిడీగా ప్రభుత్వం ప్రకటిస్తే ఉచిత విద్యుత్ అమలవుతుంది. సబ్సిడీ మొత్తం అలా స్థిరంగా వుంటే ఖర్చు ఎక్కువ అవుతూ ఉంటుంది. సబ్సిడీ మోతాదు తగ్గిపోతూ ఉంటుంది. ముప్పై సంవత్సరాల పాటు ఉచిత విద్యుత్ కొనసాగుతుంది. ఏ మార్పు వుండదు అని వైఎస్ఆర్


(మిగతా 19వ పేజీలో)

# తెలంగాణా సాయుధ ప్రజా పోరాటం

(2వ పేజీ తరువాయి)

పాలనా వ్యవస్థకి వ్యతిరేకంగా, జాతీయోద్యమ స్ఫూర్తితో, స్వేచ్ఛను కోరుకునే ప్రజల సంఖ్య పెరిగింది. వారు తెలంగాణాలో ఆంధ్ర మహాసభగా, మహారాష్ట్రలో మహారాష్ట్ర పరిషద్, కన్నడ ప్రాంతంలో కన్నడ పరిషద్‌లను ఏర్పాటు చేశారు. ఇవి విశాల రాజకీయ, సాంస్కృతిక వేదికలు. కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రా యూనిట్ మిలిటెంట్, అభివృద్ధి కాముక కార్యకర్తలతో సంబంధాలు ఏర్పరచుకుని, వారి నుండి ఒక శక్తివంతమైన గ్రూపును తెలంగాణాలో ప్రారంభించింది.

ఆంధ్ర మహాసభ మొదట్లో కేవలం పాలనా వ్యవస్థలో సంస్కరణాల కోసం, పౌర స్వేచ్ఛ కోసం, మరిన్ని బడులు కావాలని, భూస్వాముల నుండి మరిన్ని వెసులుబాట్లు కావాలని తీర్మానాలు చేయడానికే పరిమితమయింది. ప్రజలను సమీకరించలేదు. నిజాంకు వ్యతిరేకంగా గాని, భూస్వాములకు వ్యతిరేకంగా గాని పోరాటాలకు పిలుపులివ్వలేదు. ఆంధ్ర మహాసభను ప్రజలలోకి తీసుకెళ్లడానికి కమ్యూనిస్టుపార్టీ అద్భుతమైన కృషి చేసింది. ఆంధ్ర మహాసభలోని మితవాదులు వీటిని వ్యతిరేకించారు. కమ్యూనిస్టుల నాయకత్వంలోని వామపక్షం వెట్టిని రద్దుచేయాలని, విపరీతమైన కౌలు వసూళ్లు నిలిపివేయాలని, పండించుకుంటున్న భూముల పట్టాలను సాగుదార్లకే ఇవ్వాలని, పన్నులను, కౌళ్లను తగ్గించాలని, కౌలుదార్లను తొలగించ కూడదని, సర్వే సెటిల్ మెంట్లు తప్పనిసరి చేసితీరాలని, తాటికల్లుపై పన్నును ఎత్తివేయాలని, జాగీర్దారీ వ్యవస్థను రద్దు చేయాలనీ, ప్రజలకు పూర్తిగా బాధ్యత వహించే ప్రభుత్వం ఉండాలనే డిమాండ్లను పెట్టి ప్రజలను ఈ డిమాండ్ల వెనుక సమీకరించారు.

కమ్యూనిస్టుల నాయకత్వంలో ఆంధ్ర మహాసభ 1944 తొలిరోజుల నుంచి జమిందారులకు, దేశముఖులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసింది. సంఘం అని ప్రేమగా పిలవబడే ఆంధ్రమహాసభ పొలాలలో ఎర్రజెండాలను పాతి, ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించింది. సంఘం నాయకత్వంలోని ప్రజలు గూండాయిజాన్ని అనుమతించే వారు కాదు, లంచాలు ఇవ్వడం మానివేశారు. వెట్టి చాకిరీ చేయడం, బడా భూస్వాములకు నజరానాలు చెల్లించడం నిలిచిపోయింది.

ఈ పరిస్థితులలో 1946లో జనగాం తాలూకాలోని దేశముఖ్ విసునూరు రామచంద్రారెడ్డి ఐలమ్మ అనే మహిళ భూమిని బలవంతంగా లాక్కొనే ప్రయత్నం చేశాడు. ఐలమ్మ సంఘం మద్దతుదారురాలే కాదు చురుకయిన కార్యకర్త కూడా. ఆమె పొలంలోని పంటను దేశముఖ్ గుండాలు పొలంనుండే ప్రత్యక్షంగా తరలించుకు పోయే ప్రయత్నం చేశారు. అది చూసిన సంఘం వాలంటీర్లు లాఠీలు తీసుకుని గట్టి పట్టుదలతో గుండాల వెనక పడగానే గుండాలు భయపడి పరుగులు తీశారు. వలంటీర్లు పంటను ఐలమ్మ ఇంటికి తరలించారు. ఈ అనుభవం ప్రజలలో స్ఫూర్తిని నింపింది. తెలంగాణా పోరాటానికి నిప్పుకణిక అయ్యింది.

ఈ సంఘటన తరువాత 1946 జులై 4వ తేదీన ఒక ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఇందులో భూస్వాముల తొత్తులు అనేక సార్లు తుపాకులతో కాల్పులు జరిపారు. ఆకాల్పులలో దొడ్డి కొమరయ్య అమరుడయ్యాడు. తెలంగాణా రైతాంగంలో నివురుగప్పిన నిప్పులాగా ఉన్నకోపం కొమరయ్య అమరత్వంతో మంటయి ఎగసిపడింది. నల్గొండలోని అన్ని తాలూకాలలో ప్రజలు తిరగబడ్డారు. ఒక గ్రామంలోని ప్రజలు కర్రలు, ఒడిశలలతో పక్క గ్రామానికి వెళ్లి వాళ్ళనుకూడా ఉత్తేజపరిచేవారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా తమ గ్రామా ప్రదర్శనలో పాల్గొనడమే కాక పక్క గ్రామ ప్రదర్శనలో కూడా పాల్గొనడం ఈ ప్రదర్శనల ప్రత్యేకత. పక్క గ్రామాల నుండి వచ్చిన వారికి కుల, మతాలతో సంబంధం లేకుండా ఆహారం ఏర్పాట్లు చేసేవారు. అందరు కలిసే గడీల ఎదురుగా సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు, ఎర్రజండాను ఎగరవేశారు. 'సంఘం తమను సంఘటిత పరిచిందని, ఇకపై వెట్టి చేయబోమని, చట్ట విరుద్ధమైన వసూళ్లు చెల్లించమని, పొలాల నుండి తరిమి వేయడం కుదరదని' ప్రకటించుకున్నారు. సంఘం చేసిన ఈ నిర్ణయాలు అమలు చేయబడ్డాయి. భూస్వాముల ఇళ్లలో ఎవరూ పనులకు పోలేదు. ఒక వారం రోజుల్లో ఉద్యమం నల్గొండ, ఆ చుట్టుపక్కల జిల్లాలలోని 300–400 గ్రామాలకు పాకిపోయింది.

మొట్టమొదటి సారిగా భూ సమస్య, వెట్టి, బలవంతపు పంట వసూళ్లు జమిందారీ వ్యవస్థ రద్దు చేయడానికి ముడిపెట్టబడ్డాయి. ఇదే ఈ కాలంలోని ముఖ్యమైన అంశం. ఈ ప్రజా ఉద్యమ వెల్లువలోప్రభుత్వం పన్నులు వసూలు చేయలేక పోయింది. పన్నులు వసూలు చేసే ప్రభుత్వాధికారులు గ్రామాలలోకి అడుగు పెట్టలేకపోయారు. వెట్టి ఇక సహజంగానే రూపుమాసి పోయింది. అనేకమంది భూస్వాములు ఊళ్ళ నుండి పారిపోయి నిజాం జోక్యం చేసుకోవాలని కోరారు. ఫలితంగా గ్రామాలలో మిలిటరీ క్యాంపులు ఏర్పడ్డాయి. మిలిటరీ దాడులు వారాలు, నెలలు కొనసాగాయి. వీటన్నింటినీ ప్రజలు ధైర్యంగా ఎదుర్కొన్నారు. నైజాం సైన్యం జోక్యాన్ని అదునుగా తీసుకుని పారిపోయిన భూస్వాములు తిరిగి గ్రామాలకు చేరుకున్నారు. దానితో గ్రామాలలో ఒకరకమైన అనిశ్చితి ఏర్పడింది.

భూస్వాముల గుండాల దాడులను ఎదుర్కొంటున్న గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ ప్రజా వాలంటీర్లకు సైనిక శిక్షణ ఏర్పాటు చేసింది. 1945, 1946లలో వీరే రైతులను భూస్వాముల దాడుల నుండి కాపాడారు. ప్రతి ఇంటిలోని మహిళా, పురుషుడు ఈ పోరాటం కొనసాగిస్తామని తమకుతామే ప్రతిజ్ఞ చేసుకున్నారు. గ్రామం మధ్యలో ఒక పెద్ద ఢంకా పెట్టారు. ఆ ఢంకా ఎప్పుడు మోగినా గ్రామస్తులందరూ తమ దగ్గరున్న ఆయుధాలతో పోరాట స్థలానికి చేరుకోవాలి. వందలు వేలల్లో గ్రామాలలోని యువకులు కర్రలు, బరిశలతో, మహిళలు కారప్పొడులతో, రాళ్లతో, మరిగే నీళ్లతో వారి గ్రామాలను, ఇళ్లను కాపాడుకున్నారు. అది ఆ రోజు ప్రజలలో ఉన్న నమ్మకం, స్ఫూర్తి, క్రమశిక్షణ. తెలంగాణా ప్రజలలో వెట్టికి, అన్యాయమైన వసూళ్లకు, తప్పనిసరిగా చెల్లించవలసిన పన్నులకు, వ్యతిరేకంగా అసంతృప్తి ఎంత ఎక్కువగా ఉండేదంటే వాటిని వెంటనే వదిలించుకోవాలని ఉవ్వెత్తున ఎగిసిపడ్డారు. భూస్వాములు ఆక్రమించుకున్న భూములను తిరిగి సంపాదించుకున్నారు. భూస్వాముల సైనిక దాడులను తిప్పికొట్టారు, పోలీసులకు ఎదురు నిలిచారు, నిజాం మిలిటరీ శక్తికి కూడా ఎదురొడ్డారు.


మహిళలు కూడా తమకు చేతనయినంత వరకు ఉద్యమంలో పాల్గొన్నారు. సాంస్కృతిక రంగంలో మిలిటెంట్ పాటలు, జానపద కళలు పెద్ద ఎత్తున వచ్చాయి. ఉద్యమ ప్రతిఘటనలో భాగంగా కోర్టు ఉత్తర్వులను ధిక్కరించాలని, అరెస్ట్ వారెంట్లు తీసుకోకూడదని, పోలీసుల చేతికి చిక్కకూడదని, ఆస్తుల వేలాలను, జప్తులను ప్రతిఘటించమని పార్టీ పిలుపునిచ్చింది. ప్రజలు ఈ పిలుపులను అక్షరాలా ఉత్సాహంగా అమలు చేశారు. కొత్త కొత్త ప్రతిఘటనా కార్యక్రమాలను రూపొందించుకున్నారు. పార్టీ నాయకులను పువ్వుల్లో పెట్టి చూసుకున్నారు.

1946 చివరిలో తప్పితే ఈపోరాట కాలమంతటిలో రైతాంగ దళాలను ఏర్పాటు చేసి సైనిక శిక్షణ ఇవ్వలేదు. వాలంటీర్ల దళాలకు ఆయుధాలు పట్టుకోవద్దని పార్టీ ఆదేశాలిచ్చింది. ఆయుధాలు తీసుకుంటే అది సాయుధపోరాట దశకు మారుతుందని, భారతదేశ వ్యాప్తంగా దాని పర్యవసానాలు ఉంటాయని పార్టీ భావించింది. రైతాంగ ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం జరిగిన తరువాత, పోలీసులు ఆయుధాలతో దాడులు మొదలు పెట్టిన తరువాత మాత్రమే స్వయం రక్షణకు ఆయుధాలను ఉపయోగించు కోడానికి పార్టీ కార్యకర్తలకి అనుమతి నిచ్చింది.

**(అనువాదం: కె ఉషారాణి)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-10-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# "తటస్థం అంటే నాకు అసహ్యం"



**- ఆంటోనియో గ్రాంసీ**

"తటస్థం అంటే నాకు అసహ్యం. జీవించి ఉన్నాం అంటే అర్థం ఏదో ఒక పక్షం వహించాలని నేను నమ్ముతాను. నిజంగా జీవించి ఉన్నవారెవరైనా పౌరులుగానూ, పక్షపాతులుగానూ ఉంటారు. తటస్థత, ఉదాసీనత అంటే పరాన్నజీవనం, గతితప్పడం; జీవితం కాదు. అందుకే తటస్థం అంటే నాకు అసహ్యం.

తటస్థం అనేది చరిత్ర మనపై పెట్టిన మోయలేని భారం. చరిత్ర మీద అది మహా శక్తితో పనిచేస్తుంది. తటస్థత అనేది నిష్క్రియాత్మకంగా పనిచేస్తుంది. కానీ అది పనిచేస్తుంది. అది మనం ఆధారపడలేని విధి. అది కార్యక్రమాలను వక్రీకరిస్తుంది, ఎంతో చక్కగా తయారుచేసుకున్న ప్రణాళికలను నాశనం చేస్తుంది. అది మేధస్సును నాశనం చేసే ముడి సరుకు. అది నెత్తినెక్కి నాట్యమాడుతుంటే, మానవులు తమ సంకల్పాన్ని వదులుకుంటారు. చట్టాలను ఇష్టం వచ్చినట్లు చేయడానికి అవకాశం ఇస్తారు. అప్పుడు తిరుగుబాటు ద్వారా మాత్రమే వాటిని ఎదిరించే అవకాశం మిగులుతుంది. అధికారంలో ఉన్నవారిని వారి ఇష్టానికి విడిచిపెట్టేస్తారు. అప్పుడు అధికారంలోకి రావడానికి తిరుగుబాటు మాత్రమే మార్గం అవుతుంది. ప్రజలు నిర్లక్ష్యం చేస్తారు ఎందుకంటే దాన్ని విధి ఫలితం అనుకుంటారు. అది అందరినీ, అన్నిటినీ నాశనం చేస్తుందనుకుంటారు; ఆమోదించినవారినీ, అసమ్మతి తెలిపిన వారినీ; తెలిసిన వారినీ, తెలియని వారినీ; చురుకుగా ఉన్నవారినీ, తటస్థంగా ఉన్నవారినీ అందరినీ నాశనం చేస్తుందని అనుకుంటారు. కొందరు భక్తితో గుసగుసలాడుతారు. మరికొందరు అసహ్యంగా తిడతారు. కానీ "నేను నా సంకల్పాన్ని అమలు చేసి ఉంటే ఈ విధంగా జరిగేదా?" అని ఎవ్వరూ అనుకోరు, లేకుంటే కొద్ది మంది మాత్రమే అనుకుంటారు.

అందుకే నేను తలస్థతను అసహ్యించుకుంటాను. అమాయకుల్లాగా గుసగుసలాడే వారంటే నాకు కోపం. ప్రతి రోజు వారికి జీవితం ఇచ్చిన, ఇస్తున్న కర్తవ్యాన్ని వారు ఎలా నిర్వర్తిస్తున్నారు, వాళ్లు ఏం చేశారు, ముఖ్యంగా వాళ్లు ఏం చేయలేదు అన్న విషయంలో ప్రతివారినీ బాధ్యుల్ని చేస్తాను. అటువంటి వాళ్లపట్ల ఏమాత్రం దయా దాక్షిణ్యం ప్రదర్శించకపోవడం, వారితో కలిసి కన్నీళ్లు కార్చకపోవడం నా హక్కు అని నేను భావిస్తాను.

నేను పక్షపాతిని. నేను సజీవంగా ఉన్నాను. నాతో కలిసి భవిష్యత్తును నిర్మించడానికి నా పక్షాన ఉన్న వారు కూడా చైతన్యవంతులై జీవించి ఉన్నారని భావిస్తున్నాను. సమాజం కొద్దిమంది మీద ఆధారపడి నడవదు. లేక అదృష్టం వల్లనో, విధి ఫలితం వల్లనో నడవదు. పౌరుల చైతన్యపూర్వక కార్యాచరణ వల్ల నడుస్తుంది. త్యాగాల గవాక్షాలనుండి, కొద్దిమంది మరణాలనుండి దీన్ని ఎవరూ చూడ్డం లేదు. నేను సజీవంగా ఉన్నాను. పక్షపాతిగా ఉన్నాను. అందుకే నేను ఏదో ఒక పక్షం తీసుకోని వారిని అసహ్యించుకుంటాను. తటస్థం అంటే నాకు అసహ్యం."

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.5. Published on October 1, 2020